
ఆంధ్రసచిత్రవారపత్రిక

28, జూన్-4 జూలై, '85

రు. 2/-





క్రొత్త

పాలతో కూడిన
ఫారెక్స్
ఘన ఆహారం

రెండు టిన్నులు కొన్నప్పుడు

క్రొత్త ఫారెక్స్ అధిక రుచికరం
క్రొత్త ఫారెక్స్ అధిక సంపూర్ణం

ప్రేమతో మీరు పెట్టే ప్రతి చెంచాడు
మీ పాపాయి పెరుగుదలకు మంచిది.

మంచి ఆరోగ్యానికి మూలస్థానం – గ్లాక్సో



ఈ కానుక ఎంపిక చేయబడిన పట్టణాలలో ప్రత్యేక
కానుక టిన్నులపై సరుకు వున్నంత వరకు లభ్యం.

CLARION/B/GX/5/244 TEL

ముఖచిత్రం

మా అభిమాన నటుడు, డేరింగ్, డేషింగ్ హీరో, త్రిబుల్ సూపర్ స్టార్ నటశేఖర కృష్ణగారిని మా (మీ) పత్రికలో ముఖచిత్రంగా వేసినందుకు, మా కోరిక తీరినందుకు మీకు మా కృతజ్ఞతలు

గంటా గిరిధర్ రెడ్డి, నాని, బరంపురం

కథలు

సుమన్, భానుప్రియ ముఖచిత్రంతో వెలువడిన పత్రిక ఆకర్షణీయంగా ఉంది. పాలకూర సీతాలత గారి "ఉంగరం కాండ" చాలా చాలా బాగుంది రచయిత్రికి ధన్యవాదాలు.

బందిగి బాలరాజు, నారాయణపేట

సీరియల్స్

24–5–85 సుహాసిని ముఖచిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాలా బాగున్నది సీరియల్ 'రాగసంధ్య' చాలా బాగున్నది అందులో ముఖ్యంగా శ్రీకాంత్, సంధ్య పాత్రలు మమ్మల్ని ఎంతో ఆకట్టుకున్నాయి రచయిత కాశీనాథుని సువర్చలాదేవి గారికి మా ధన్యవాదాలు. సీరియల్ "పడమట సంధ్యారాగం" చాలా బాగున్నది

లీలావతి– దువ్వాడ, కాశీబుగ్గ

* * * * *

శ్రీదేవి ముఖచిత్రంతో వెలువడిన సంచిక బాగుంది ఆదూరి సావిత్రి గారి 'పడమట సంధ్యారాగం' మమ్మల్ని ఆకట్టుకొంది

ఎస్ ఎమ్ గౌరీశంకర్, కోరుకొండ

* * * *

మౌనవిపంచి సీరియల్ మా కుటుంబానికి ఎంతగానో నచ్చినది ఈ సీరియల్ వ్రాసిన రచయిత్రి పద్మజాజాదరి గారికి మా కృతజ్ఞతలు ఇందులో ప్రభాత పాత్ర చాలా మంచిగా వున్నది.

కాళే శశికళ (స్వర్ణిల), రాజమండ్రి


* * * * *

శ్రీదేవి ముఖచిత్రంతో వెలువడిన పత్రికలోని కొత్త సీరియల్ మల్లిక ప్రారంభంలోనే మమ్మల్నాకట్టుకొంది రచయిత్రికి మా అభినందనలు

ఎం వి రాఘవేంద్రరావు, ఎం మురళీకృష్ణ, గుంటూరు

సుభాషితాలు

26 ఏప్రిల్ – 2 మే పత్రికలో సుభాషితాలు అను శీర్షికలో శ్రీ రాజరాజేశ్వర శర్మగారు మొదటి పద్యము ద్వారా – క్షణం వ్యర్థం చేయకుండా విద్యార్జన చేయాలి' అని తెలిపారు ఈ వాక్యము నూటికి నూరు పాళ్ళు నిజమైనది, ముఖ్యంగా విద్యార్థులు



ఆచరణలో పెట్టవలసిన విలువైన మాట కానీ రెండవ పద్యం ద్వారా 'మనం శాశ్వతంగా ఉంటామని తలచి విద్యార్జన ధనార్జన చేయాలి' అని చెప్పారు కానీ మనము శాశ్వతంగా ఉంటామని తలచిన వెంటనే క్షణం వ్యర్థం చేయకుండా విద్యార్జన (ఏ బహు కొందరు దీక్షాపరులు తప్ప) చేయలేరు ఎందుకనగా మనము శాశ్వతంగా ఎలాగూ ఉంటాము కదా ఇప్పుడు కాకపోతే తరువాత చదువుకొనవచ్చులే అను నిర్లక్ష్య భావము ఇంకా సోమరితనము కూడా అలవడే అవకాశముంది

ఈ విధంగా ఒకే విషయము (విద్యార్జన) గురించి ఒకదాని కొకటి సంబంధం లేని విధంగా రెండు వేరు వేరు భావాలతో తెలుపుట బాగుగా లేదు

టి విశ్వనాథ్, క్వా - 17బి,
జె కె పూర్, ఒరిస్సా – 765017



జిల్లెళ్ళమూడి అమ్మ నిర్యాణం

జిల్లెళ్ళమూడి అమ్మ మాతృశ్రీ అనసూయాదేవి జూన్ 12వ తేదీ రాత్రి గం. 10-35 ని.లకి జిల్లెళ్ళమూడిలో నిర్యాణం చెందారు. 14వ తేదీన అంత్యక్రియలు జిల్లెళ్ళమూడిలో జరిగాయి.

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

శుక్రవారం 28 జూన్-4 జూలై, 1985
శ్రీ క్రోధన నామ సం ఆషాఢ శు ఏకాదశి

సంపుటము 77 : సంచిక 43

సంపాదకుడు
శివలెంక రాధాకృష్ణ

విడి ప్రతి వెల	రు. 2-00
ఆరు మాసాల చందా	రు 55-90
పోస్టులో ఏడాది చందా	రు. 111-80

ఆంధ్రపత్రిక కార్యాలయము,
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి రాధ

కథలు :

ఇది జీవితం	14
ఆడవాళ్ళూ మీకు జోహార్లు	28
తిరిగివచ్చిన వసంతం	46
అవధిలేని ప్రతి అనుభూతికి	60

సీరియల్ నవలలు:

శుశ్రుత నర్సింగ్‌హోమ్	8
జిగిబిగి	20
మసురు వెలిసింది	40
మల్లిక	54

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు-4, న్యూఢిల్లీ లేఖ-5, వ్యక్తిగతం, వారఫలం-6, ధర్మపథం-12, సుభాషితాలు-25, 'శృంగపురి' అగస్త్యేశ్వర క్షేత్రం-26, సినిమా విశేషాలు-34, ప్రశ్నావళి-44, ఇ'వేమన' పద్యాలు-51, ఫాల్గుణి డైరీ-52, హైదరాబాద్ నోట్‌బుక్-66

అభివృద్ధికి స్వేచ్ఛాయుతమైన ఆర్థిక వ్యవస్థ అవసరం!

ఇటీవల మరణించిన ప్రొఫెసర్ రాజ్‌కృష్ణ తాము ఒక విదేశీ పత్రికలో రాసిన వ్యాసంలో ప్రయోగించిన హిందూ అభివృద్ధి రేటు అన్న నిందాస్పదమైన పదజాలానికి ఆయన ఎన్నడూ సరైన వివరణని ఇవ్వలేకపోయారు ఆ పత్రిక సంపాదకులైనా దానిని సరిచేసి ఉండాల్సింది నాటి నించి నేటి వరకూ బ్రిటిష్‌వారు ప్రతి దానికీ భారతదేశంలోని కుల వ్యవస్థని నిందిస్తూనే ఉన్నారు అహమ్మదాబాదులోని కొట్లాటలు దానికి మరింత ఊతాన్ని ఇచ్చేలా ఉన్నాయి కానీ రాజ్‌కృష్ణ వంటి 'సోషలిస్టులు' బ్రిటిష్ వారికి 'తాళం వేస్తూ' భారతదేశంలోని ఆర్థిక వ్యవస్థ ప్రతిష్టంభనకి కారణం దేశంలో ఉన్న హిందూతత్వమేనని దుయ్యబట్టటం నేను ఊహించని విషయం ఆ తర్వాత రాజ్‌కృష్ణని కానీ, ఆయన రచనలని కానీ, నేనంతగా పట్టించుకోలేదనే చెప్పాలి కనీసం ఆర్థిక ప్రణాళికా విధానానికి సంబంధించినంత వరకైనా జవహర్‌లాల్ నెహ్రూని ఆమరణాంతం పూర్తిగా

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

సమర్థించిన రాజ్‌కృష్ణ వంటివారు, మన సోషలిస్టు ఆర్థికవేత్తలు, ఆయన విధానాలు సరైన ఫలితాలు ఇవ్వలేక పోతున్నాయని గ్రహించి తప్పించుకోడానికి తగిన సాకు కోసం వెతకటం మొదలుపెట్టారు ఈ 'హిందూ అభివృద్ధి రేటు' అన్నది వారికి అప్పుడు అనువుగా దొరికింది ఎలాగైతే బ్రిటిష్‌వారు భారతదేశాన్ని విడగొట్టడానికి హిందూ ముస్లిం విభేదాలని వాడుకున్నారో అలాగే వీరికి కూడా 'హిందూ అభివృద్ధి రేటు' అన్నది తప్పించుకోడానికి తగిన సాకుగా దొరికింది

భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత మొదటి 20 సంవత్సరాలలో దాదాపు అన్నిటిలోనూ రాజ్‌కృష్ణ వంటి వారు తప్పటడుగే వేశారు మొహలనోబిస్ తరహా అభివృద్ధి, ప్రభుత్వరంగం మీద ప్రభుత్వం అజమాయిషీ ప్రముఖపాత్రని వహించడం గురించి వారు గొప్పగా చెప్పారు రాజ్‌కృష్ణ సాంకేతిక సంబంధమైన ఆర్థిక శాస్త్రవేత్త కాదు. సామాజిక రాజకీయ వ్యవస్థని అధ్యయనం చేసిన వ్యక్తి ప్రభుత్వం అజమాయిషీలో ఉండే శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ, దాదాపు అన్ని రంగాలపై అది చూపే ప్రభావంవల్ల ఏర్పడే ఇబ్బందులని ఆయన ఊహించి ఉండాల్సింది నెహ్రూ ఉన్నంతకాలం మొహలనోబిస్ తరహా అభివృద్ధి అది ఉండవలసిన స్థానంలోనే చెక్కు చెదరకుండా ఉన్నది బహుశః దానికి కారణం తర్వాత ఇందిరాగాంధీ హయాంలో ఉన్నంతగా ప్రభుత్వరంగం ఉచ్ఛస్థాయిలో లేకపోవటమే కావచ్చు కానీ ప్రణాళికా విధానంలో నెహ్రూతో అంతగా విభేదించని రాజ్‌కృష్ణ వంటి వారు సామాజిక ఉత్పత్తి వనరులపై ప్రభుత్వం అదుపు ఎక్కువగా ఉండటం రాజకీయ, ఆర్థిక వైఫల్యాలకి దారితీయవచ్చుని ఊహించారు జనతా ప్రభుత్వ పంచవర్ష ప్రణాళికలో కూడా అలాంటి పేదరిక నిర్మూలన కార్యక్రమాలని రాజ్‌కృష్ణ వంటి వారు ప్రవేశపెట్టారు కానీ అవి కొద్ది తేడాలతో నెహ్రూ విధానాలలాగే ఉన్నాయనవచ్చు భారతదేశాన్ని విఫలం చేసింది హిందూ అభివృద్ధి రేటు కాదు నెహ్రూ అభివృద్ధి రేటే, రాజ్‌కృష్ణ వంటి వారు, ఇంకా చెప్పాలంటే చంద్రశేఖర్ లాటి వారేనని కూడా నేనంటాను నెహ్రూ పొరపాటు ఎంత ఉందో వీరిదీ అంతే ఉన్నది

వాస్తవానికి జనతా ఆర్థిక కార్యక్రమానికీ, కాంగ్రెసువారి ఆర్థిక కార్యక్రమానికీ తేడా ఏమీ నాకు కనిపించదు జనతా వికేంద్రీకరణ కావాలనుకున్నది, నెహ్రూ కూడా అలాగే అనుకున్నారు తగినటువంటి సాంకేతిక విజ్ఞానం ఉండాలని జనతా భావించింది నెహ్రూ కూడా అదే కోరుకున్నారు జనతా హయాములో ఎన్ని పెద్ద ప్రాజెక్టులు ఉన్నాయో అన్ని అంతకు ముందు ప్రణాళికలలో కూడా ఉన్నాయి పైకి మాత్రం మహాత్మాగాంధీ పేరు చెప్పేవారు జనతావారు

నెహ్రూ కూడా అంతే భావి భారత ఆధునికీకరణకి సారథి అయిన రాజీవ్‌గాంధీ కూడా అదే చెబుతున్నారు జనతా 'అంత్యోదయ' కార్యక్రమాన్ని మాత్రం నిర్వహించింది కానీ అది చాలా స్వల్పమైనటువంటిది ఆర్థిక వ్యవస్థలోని మిగతా విభాగాల నుంచి వనరులు లభ్యం కావడంపై అలాంటి కార్యక్రమాలు ఆధారపడి ఉంటాయి ఆ వనరులని ఆపివేస్తే ఆ కార్యక్రమాలు కూడా అంతరించిపోతాయి

నెహ్రూ ప్రణాళికలకి పేలవమైన ప్రతి రూపాలే జనతా ప్రణాళికలని చెప్పవచ్చు గత ప్రణాళికల మాదిరే, నెహ్రూ అభివృద్ధి రేటులా, అవి కూడా ముగిసిపోయాయి ప్రజలదైనటువంటి ఆర్థిక వ్యవస్థని వారికి అందించడానికి జనతా ప్రభుత్వం ఏమీ చేయలేకపోయింది అధికార యంత్రాంగం పట్టు నుంచి ఆర్థిక వ్యవస్థని విడదీసే ధైర్యం దానికి లేకపోయింది మొరార్జీదేశాయి లాంటి వ్యక్తి ఆధిపత్యంలో ఉన్న జనతా ఆ పని ఎలా చెయ్యగలదు? జనతా పార్టీకి, రాజ్‌కృష్ణ వంటి వారికి ఇది ప్రాథమిక వైఫల్యం అనవచ్చు వారందరూ నెహ్రూ మనుషులే ఈ వైఫల్యమే, నెహ్రూ రకమైన ప్రభుత్వ యంత్రాంగం ద్వారా వచ్చే సామ్యవాదం అనే దాని నుంచి దూరంగా ఉండకపోవటం అన్నదే ఆ పార్టీ పతనానికి కారణం అయింది అదే ప్రత్యామ్నాయ రాజకీయ నాయకత్వాన్ని కూడా లేకుండా చేసింది హిందూ అభివృద్ధి రేటు అన్నది వారికి తర్వాత వచ్చిన ఆలోచన, ఆపద్ధర్మంగా అంది పుచ్చుకున్నట్టు దొరికిన ఒక సాకు

భారతదేశంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం అన్నది ప్రత్యామ్నాయ రాజకీయ సిద్ధాంతం అనేది ఉన్నప్పుడే సాధ్యమవుతుంది ఇంతవరకూ అలాంటి సూచనలేవీ కనిపించడం లేదు స్వేచ్ఛాయుతమైన ఆర్థిక వ్యవస్థని ఒకప్పుడు నమ్మిన పార్టీలతో సహా ఎన్నో పార్టీలు ఇప్పుడు గాంధేయ సామ్యవాదా' అనుసరిస్తున్నాయి ఈ సంకర జాతి సిద్ధాంతాన్ని గాంధీ కూడా ఒప్పుకుని ఉండరు నెహ్రూ కూడా గాంధేయ సోషలిస్టే, ఆయన తనదైన బాణీలో దానికి అర్థం చెప్పుకున్నారు కానీ ఆయన అభివృద్ధి కార్యక్రమాలలో, ఆధునికీకరణ ప్రణాళికలలో ఎక్కడా గాంధేయతత్వం కనిపించదు రాజ్‌కృష్ణ వంటి వారు అక్కడే ఆయనతో విభేదించారు ఎరువులు, ఉక్కు కర్మాగారాలు లేకుండా దానిని వారు సాధించగలరా? అణుశక్తి కర్మాగారాలు లేకుండా గోబర్ గాస్ నిర్మాణాలతో వారు దానిని నిర్వర్తించగలరా? అలాంటప్పుడు వారు జనతా ప్రణాళికలో వాటిని ఎందుకు చేర్చారు? జనతా ప్రణాళికలో ప్రభుత్వరంగం పరిమాణాన్ని ఏమాత్రం తగ్గించకుండా అలాగే ఎందుకు ఉంచారు?

ఈ దేశంలో మనకి కావలసినవి తక్కువదే అయినా మంచి ప్రభుత్వం, చిన్నదే అయినా సమర్థవంతమైన అధికార యంత్రాంగం, కొద్దిపాటిదే అయినా పటిష్టమైన ప్రభుత్వరంగం నెహ్రూ ఆలోచనా మార్గానికిది పూర్తిగా విరుద్ధం దానిలో ఏ కొద్ది మార్పు చేసినా కాంగ్రెసు రాజకీయ వాదులకి మూర్ఛ వచ్చినంత పనవుతుంది వారే రాజీవ్ గాంధీపై వి పి సింగ్ మార్గాన్ని వదిలిపెట్టి నెహ్రూ కాలం నాటి పాత ధోరణుల వైపే మరలే టట్టు ఒత్తిడి తెచ్చారు

గత నలభై ఏళ్ళుగా ఈ దేశాన్ని తన పట్టులో ఉంచుకొన్న నెహ్రూ సిద్ధాంతాన్నుంచి మనం దూరంగా వెళ్లాల్సి ఉంటుంది అది సాధించే స్థితిలో వున్న ప్రతిపక్ష పార్టీ ఏదయినా దానికి మంచి భవిష్యత్తు ఉంటుంది నెహ్రూని ఆయన మనుమడు, వారి పిల్లలు తప్ప మిగతావారంతా మరచిపోతున్నారు ఆయనని మనం పూర్తిగా మరిచిపోయినప్పుడే ఈ దేశం హిందూ అభివృద్ధి రేటు కంటే ఎక్కువ ప్రగతిని సాధించడం ప్రారంభిస్తుంది □

వ్యక్తిగతం

ఇటీవల పారిస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ టెన్నిస్ చాంపియన్ షిప్ మహిళల సింగిల్స్ పోటీలలో అమెరికా సంయుక్త రాష్ట్రాలకి చెందిన క్రిస్ ఎవర్ట్ లాయడ్(30)గత ఏడాది



తనని ఇదే పోటీలలో ఓడించిన మార్టినా నవ్రతిలోవా (28) పై విజయాన్ని సాధించి ఆరు సార్లు ఈ పోటీలలో గెలిచిన తొలిమహిళ అయిందీమె గతంలో 1974, 75, 79, 80, 83 సంవత్సరాలలో ఈమె ఈ పోటీలలో గెలిచింది పురుషుల సింగిల్స్ పోటీలలో గతంలో 6 సార్లు గెలిచి జాన్ బోర్గ్ రికార్డు సృష్టించాడు □



మౌరా మొయినిహాన్- అమెరికా సంయుక్త రాష్ట్రాల సెనెటర్ డేనియల్ పాట్రిక్ మొయినిహాన్ కుమార్తె అమెరికాలో భారత ఉత్సవాలలో పాల్గొనేందుకు అదితి బృందం బయలుదేరే ముందు ఈమె న్యూఢిల్లీ వచ్చారు హిందీ దారాళంగా మాట్లాడ గల మౌరా అదితి ప్రాజక్టు కో ఆర్డినేటర్లలో ఒకరు ఈమె తండ్రి గతంలో ఇక్కడ అమెరికా రాయబారిగా పని చేశారు □

కల్పనా జిన్‌గాన్ (16) అఖిల భారత సెకండరీ స్కూల్ పరీక్షలలో 64 శాతం మార్కులతో ఉత్తీర్ణురాలైంది. అంతకు ముందే చిన్న మెదడుకి సంబంధించిన పక్షవాతంతో బాధ



పడుతున్న ఈమెకి 6 సంవత్సరాల క్రితం కంటిచూపుకూడా కరువైపోయింది. అయినా నిరుత్సాహ పడకుండా పట్టుదలతో తన చదువుని కొనసాగించి తాను అనుకున్నది సాధించింది శారీరకమైన అలాంటి రుగ్మత, దానికి తోడు అంధత్వం ఉండి కూడా ఈ బాలిక విజయాన్ని సాధించడం చాలా అరుదైన విషయం □

వారఫలం

28–6–1985 శుక్రవారం మొదలు 4–7–1985 గురువారం వరకు

★ **మేషం** . సభా గౌరవం, సజ్జనగోష్ఠి; వ్యాపారరీత్యా ఉత్తమ ఫలానికి, ఒకవేళ ఉద్యోగం చేసేలాగైతే అనుకూలం, ఆర్థికంగా కొంత మెరుగు కనిపించటం గమనింపదగిన అంశాలు స్త్రీలకు అప్రయత్న ధనలాభం, వృత్తియందు స్వల్ప మెరుగు చెప్పదగిన అంశం

★ **వృషభం** . ధనార్జనకు మీరు గావించిన యత్నాలు సులభసుందరగా నెరవేరటంగాక, కొంత ప్రగతి కనిపించటం కూడా చెప్పదగిన అంశం గృహ నిర్మాణతకు కొందరు యత్నించుట సఫలీకృతులగుట గమనింపదగిన అంశం రాజకీయంగా యత్నించి ప్రయోజనం పొందలేక పోతారు స్త్రీలకు సర్వకార్యానుకూలం

★ **మిధునం** సభాగౌరవం సంపాదించుట కొందరకు,, ఆజన్మ మిత్రులను తలవని తలంపుగా కలసికొనుట కొందరకు, ఆదాయమందు క్రమాభివృద్ధినందుట కొందరకు చెప్పదగిన అంశాలు అధిక వ్యయానికి మీరు గురి కాగలరు, జాగ్రత్త స్త్రీలకు కళారంగానుభవం గలవారికి సదవకాశాలు లభ్యములు

★ **కర్కాటకం** కానివారు పెట్టు యిబ్బందులను దాటుకోవలె ఎవరెట్టివారో గమనించి మెలగుట శ్రేయస్కరం వారాంతంలో 'శుభ వ్యయం' సంభవం కానున్నది మిత్ర సహాయం లభిస్తే కాదనక అందుకోవటం మంచిది చిన్నచిన్న అప్పులు పరిష్కరించుటకు అనువైన కాలం స్త్రీలకు శుభవార్తా శ్రవణం డబ్బు అందటం

★ **సింహం** చక్కగా ఆలోచించి, క్రమబద్ధంగా చేసిన వ్యవహారాలందే లోటు కనిపిస్తుంది సుఖశాంతులకు లోటు వాటిల్లటం గమనార్హం ఏది ఎలాగున్నా అన్ని విషయాలలో వారమంతా ఓర్మితో సంచరించాలి స్త్రీలకు సాటివారిలో, బంధుజాలంలో హోదా పెరుగుట, శతృ విజయానికి ఆస్కారమైన వారం

★ **కన్య** . ఇటీవల సగము వరకు ప్రాకులాడి వదలి వేసిన వ్యవహారం మరలా తిరుగతోడి. పరిష్కారం చేసికొనుటకు, 'కోర్టు' వ్యవహారాలు చక్కదిద్దికొనుటకు, రావలసిన బాకీలు రాబట్టుకొనుటకు యత్నించి సఫలీకృతులవుతారు కొందరకు వాహనం కొనుగోలు చేయు అదృష్టం వారాంతాన చెప్పవచ్చు స్త్రీలకు ధన సంబంధమైన చిక్కులు తొలగిపోవటం, ఉత్తరాల మూలంగా నూతన విషయాలు గ్రహించుటకనువైన వారం

★ **తుల** . మానశిక వ్యధకు గురి కావటం, అధికారం దుర్వినియోగం చేసినారనే అపనిందల పాల్గావటం ఒకవేళ పదవీచ్యుతి జరుగుటకవకాశం, కానివారి వలన యిబ్బంది లేర్పడటం గమనించగలరు స్త్రీలకు కీచులాటలు, చికాకు

★ **వృశ్చికం** కొందరకు ఉద్యోగ విరమణ గావింపవలసి రావటం బాధాకరంగా పరిణమించగలదు చోర బాధకు గురి కావలసిన అగత్యం ఏర్పడవచ్చు స్థిరాస్తికి విఘాతం రాగల సన్నివేశాలుంటాయి బంధువులకు దనరూప సహాయం చేయవలసిన పరిస్థితులుంటాయి, గమనించండి స్త్రీలకు ఆర్థికంగా పెంపు రచనా వ్యాసంగాన సత్ఫలితం

★ **ధనుస్సు** చాలకాలం క్రితం మీతో విరోదించిన మిత్రులు మరల దాపునకు రాగలరు కోర్టు వ్యవహారం సానుకూలం కావటం, దూరదేశ ప్రయాణానుకూలం, యిత్యాది ఫలితము లుండగలవు స్త్రీలకు ఉద్యోగమందభివృద్ధి, దూరదేశ ప్రయాణానుకూల్యత కొందరకు చెప్పవచ్చు

★ **మకరం** · ఇటీవల మీ ఆదాయమందు మార్పు కనిపించుచున్నది చేసిన పనినే మరలా చేయవలసిన అగత్యమేర్పడుట కూడ గమనించగలుగుతారు పరుల చేత చిక్కిన ద్రవ్యం రాబట్టుకొనుట యందు అధిక శ్రమకు గురి కాగలుగు దురు, అన్నింటిని దాటుకొనుటకు ఓర్మి వహించటం ఒక్కటే మార్గం స్త్రీలకు విలువగల వస్తుసేకరణకు, రాజకీయములందు పాల్గొను టకు అవకాశం గలవారం

★ **కుంభం** · ఒకానొక విషయంలో మీ త్యాగబుద్ధి మంచి పేరు తెచ్చి పెడుతుంది మీకు గల కళా ప్రావీణ్యత బాగా వికసిస్తుంది పత్రికా లేఖనమందు, ప్రచురణ మందు, గ్రంధకర్తృత్వమందు రాణింపు కొందరకు సాధ్యం స్త్రీలకు చాలమందికి ప్రయాణానుకూల్యత, శుభవార్తా శ్రవణం

★ **మీనం** సజ్జన సాంగత్యమున, ధనవంతుల ప్రాపకమున, రాజకీయ మిత్రుల కలయిక వలన చాలమందికి ఆనందోత్సాహాలకు ఆస్కారం గలవారం సాటివారి యందు ఎనలేని ప్రతిష్ఠ కాస్కారం గలవారం వారాంతానికి శుభవార్తా శ్రవణం, కొందరకు విదేశ ప్రయాణాదులు సూచితము స్త్రీలకు ధనలోపం, ఆరోగ్య లోపం, భరింపరాని ఖర్చులు పైబడుట గమనింపగలరు

—విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి.

కొవ్వొత్తుల చిరువెలుగులలో... గులాబీపూల సువాసనలలో...


మేమిద్దరమే వున్న ఏకాంతంలో!



ఏముండాలి విందు భోజనంలో ?

ఆ విందు చాలా ప్రత్యేకంగా ఉండాలి మరి ఎందుకంటే
మీరు ప్రత్యేకమైన వారికోసం వంట చేస్తున్నారు
కాబట్టి
అప్పుడు మీకు కావలసినవి విజయ పాల ఉత్పాదనలు
విజయ వెన్న, నెయ్యి, జున్ను, పాలపొడి ఏదైనా కానీ మీ
వంటకు ప్రత్యేకమయిన రుచిని ఇస్తా యి
నిముషాలలో తయారు చేసే ఫలహారం కానీ షడ్రుచుల
విందుభోజనం కానీ విజయ రుచి విశిష్టం
ఎప్పుడూ విజయ ఉత్పాదనలను మీ అందుబాటులో
ఉంచుకోండి ఎందుకంటే ఎప్పుడు అవసరం వస్తుందో ఎవరికి
తెలుసు ?

ఆంధ్ర ప్రదేశ్ పాడి పరిశ్రమ సమాఖ్య
లాలా పేట, హైదరాబాదు - 500 017





విజయ. అది లేకుంటే విందులో స్వారస్యం ఎక్కడిదిమరి !

APDDC/37/85/Tel

సీరియల్

శుశ్రుత నర్సింగ్ హోమ్

డాక్టర్ కె రవీంద్రబాబు

(గత సంచిక తరువాయి)

నిలువెల్లా దనమదంతో నిండిపోయిన రాకేష్ చిటికెనవేలు కొనగోరు కదిల్చితే అందమైన ఆడపిల్లలు ఎదురుగా వచ్చి నిలబడే రాకేష్ అహంబావంతో కండ్లు మూసుకుపోయిన రాకేష్ ఒక సామాన్య విద్యార్థిని తనను నిర్లక్ష్యం చేయడం సహించలేక పోయాడు ఇందుతో పరిచయం చేసుకోవాలని అతడు ఎన్నో విదాల ప్రయత్నించాడు! కాని అతని ప్రవర్తన నడవడి గమనించిన ఇందు దుష్టునికి దూరంగా వుండాలి అన్నట్లు అతన్ని లెక్కపెట్టేది గాదు పగ పట్టిన తాచులా బుసలు పెట్టి చంద్ర ద్వారా ప్రతీకారవాంచ నెరవేర్చుకోవాలని చూచాడు!

కాని అతను అనుకున్న దొకటి జరిగిందొకటి! ఎవరిని పరాబవించాలని ప్రయత్నించాడో ఆమె పుటం పెట్టిన బంగారంలా ప్రకాశించటం– కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు ఆమెను ఎంతో గౌరవంగా ఆరాదించడం– ఇంతెందుకు ఎవరినైతే ఆమె మీదకు ప్రయోగించాడో ఆ చంద్ర ఆమె అబిమానిగా మారిపోవడం చూచి వుడుక్కోవడం మినహా మరి ఏమీ చేయలేక పోయాడు రాకేష్ ఇప్పుడు ఇందును పల్లెత్తు మాట అంటే ఎవరూ సహించరు ఆఖరుకు రాకేష్ అయినా సరే! ఉక్రోషపడి వుడుకెత్తి కుతకుతలాడి ఆవిరై మండిపోతూ ట్రాన్సఫర్ సర్టిఫికేట్ తీసికొని వేరే వూరికి వెళ్ళిపోయాడు రాకేష్ చివరకు!

చంద్ర అప్పట్నుంచీ ఇందు అంటే ఎంతో అబిమానంగా వుంటూ వచ్చాడు బి యే అయాక ఎం ఏ చదవటానికి తను వాల్తేరు వెళ్ళింది పై చదువు చదవలేక గుంటూరులో టొబాకో కంపెనీలో వుద్యోగంలో చేరాడు చంద్ర కాని ఇద్దరి మధ్య స్నేహం ఆ రోజు కారోజుకు పెరిగి పెద్దదయిందే గాని తగ్గిపోలేదు వాల్తేరులో చదువు కుంటున్నన్నాళ్ళు ఇందును చూడటానికి ఎన్నోమార్లు గుంటూరు నుండి వచ్చేవాడు చంద్ర

చంద్రా! నీకు వచ్చే జీతం వాల్తేరు రావటానికి రైలు టికెట్లు కొనటానికి చాలుతుందో లేదో అని నా అనుమానం!

ఎందుకిలా మాటి మాటికి పరిగెత్తుకు వస్తావు?

సంతోషంతో పొంగి పొరలే సముద్ర తరంగాలను చూడటానికి చంద్రు డెందుకు ఉబలాట పడతాడు?

ఇందూ! నీ హృదయం వొక ప్రేమసాగరం! నిన్ను ద్వేషించేవారిని కూడా ప్రేమించగల రాగమయివి! ప్రపంచంలోని అదృష్టహీనులను అనాదలను పరిపూర్ణ ప్రేమ బావంతో చూడగల కరుణామయివి! నిన్ను చూడకుండా ఎలా వుండగలను?

ఆపు చంద్రా! ఎవరైనా నీ కవిత్వం విన్నారంటే బాగుండదు చక్కగా వుద్యోగం చేసుకుంటున్నావు తగిన అమ్మాయిని చూచి పెళ్ళి చేసుకుని జీవితంలో సెటిల్ అవు అంతేగాని తెగిన గాలిపటంలా ఎంతకాలం ఇలా వుంటావు!

ఇందూ మరలా ఇలా అన్నావంటే వూరుకోను!

ఏం చేస్తావు?

నది సముద్రంలో దూకి శాశ్వతంగా నీకు కనపడకుండా పోతాను

చంద్రా! ఎగతాళిగా కూడా ఇలా మాట్లాడకు అంటూ ఇందు అతని నోటిని తన చేతివేళ్ళతో మూసి వేసేది

ఇందును చూడకుండా చంద్ర వుండలేడు! కాని ఇందు వద్ద నుండి తగినంత ప్రోత్సాహం రాకపోవడంతో ఆమెకు తన మనసులోని మాటలు చెప్పలేక పోయేవాడు

ఉవ్వెత్తున ఎగసిపడే ప్రేమ తరంగాలను బలవంతాన అణుచుకుంటూ



తనలో తనే కుమిలిపోయేవాడే గాని ఇందు ముందు తన హృదయంలోని బావాలను బహిర్గతం చేసేవాడు కాదు

చంద్ర ఇందుల స్నేహబందం ఆత్మీయ బందంగా మారింది ఆ తర్వాత

చంద్ర మనసులోని బావనలు ఇందుకు తెలుసు కాని అతనిని ఒక ఆత్మీయునిగా చూడ గల్గుతున్నదే గాని బావి జీవిత బాగస్వామిగా వూహించలేక పోయింది ఇందు!

యం ఏ అయాక ఇందుకు విజయవాడ కాలేజీలో వుద్యోగం వచ్చింది నాన్నకు బొంబాయి ట్రాన్స్ఫర్ అవడంతో వొంటరిగా ఇంట్లో వుంటూ వున్నది ప్రతి ఆదివారం గుంటూరు నుండి వచ్చి ఇందుతో మాట్లాడుతూ కాలం గడపి సాయంత్రం బస్సులో గుంటూరు వెళ్ళేవాడు చంద్ర

ఈ మద్య కాలంలో అతనికి తరచు కడుపు నొప్పి వస్తుందని చెప్పేవాడు

డాక్టరుగారి కెవరికైనా చూపకపోయావా చంద్రా అంటే

చూపితే ఆపరేషన్ చేయాలంటారు! ఆపరేషన్ అంటే నాకు బయం!

అదేమిటి చంద్రా! సరైన వైద్యం చేయించుకోకుండా అశ్రద్ధ చేస్తే ఎలా? ఉండు నాకు తెలిసిన డాక్టరుగారి దగ్గరకు వెళదాం!

నీకో దణ్ణం! నీకు తెలిసిన డాక్టరుగారికో దణ్ణం! నన్నిట్లా బతకనీయు అంటూ పారిపోయేవాడు

ఎంతో ప్రాణం మీదకు వస్తేగాని ఇలా ఆస్పత్రిలో జేరి వుండడు! ఎలాగైనా ప్రిన్సిపాల్ గార్ని బతిమిలాడి శెలవు తీసుకుని గుంటూరు వెళ్ళి చంద్రని చూచి రావాలి!

చంద్ర డాక్టరు రవి నర్సింగ్ హోమ్‌లో జేరానని వ్రాసాడు జీవితంలో

జరిగిన కథ–1 రచయిత సర్జన్ అయిన రవితో రచయిత్రి లెక్చరర్ అయిన ఇందూ వదనకు హైదరాబాదులో పరిచయం అయ్యింది విజయవాడలో తన ఇంటికి వచ్చిన ఇందూకి చంద్రహాస్ నుంచి వచ్చిన ఉత్తరం సాక్షాత్కరించింది తనకి కడుపు నెప్పి ఎక్కువగా ఉందని అందు మూలంగా గుంటూరులోని రవి గారి శుశ్రుతా నర్సింగ్ హోమ్‌లో చేరానని రాసాడు ఇందుకు చంద్ర తనని మొదట ఎలా అల్లరి పెట్టిందీ తుదకు ఎవిదంగా ఆత్మీయుడైన స్నేహితుడైనది గుర్తుకు వస్తుంది

ఒకోసారి అనుకోకుండా ఎన్నో సంఘటనలు జరుగుతుంటాయి!

రెండు రోజులలోనే ఎంతో దగ్గరికి వచ్చిన డాక్టరు రవి చిరకాలంగా ఆత్మీయ స్నేహితుడు చంద్ర ఇద్దరూ ఒకే చోట వున్నారు! ఈ రోజే వారి దగ్గరకు వెళ్ళాలి!

ఎప్పుడూ అడగని ఇందు సెలవు కావాలని అడుగగానే ఒప్పుకున్నారు ప్రిన్సిపాల్ గారు సాయంత్రం కాలేజి వొదలగానే బస్ స్టాండ్‌కు వచ్చి గుంటూరు వెళ్ళే నాన్‌స్టాప్ బస్‌లో కూర్చుంది వాతావరణం స్తబ్దంగావుంది ఎక్కడా ఆకు అల్లాడినట్లు లేదు! దట్టంగా మబ్బు కమ్మింది గాలి లేకపోవటంతో బస్సులో జనం ఎక్కువ మంది కిందకు దిగారు డ్రైవర్ విజిల్ వేయగానే బిలబిల మంటూ



శుశ్రుత నర్సింగ్‌హోమ్

లోపలకు వచ్చారు అంతా బస్సులో ఎక్కగానే స్టార్టు చేసాడు డ్రైవర్. పూనకం పూనిన వాడిలా బస్సు నడుపసాగాడతను. గాలి లేదనే చిరాకుతో!

బస్సు కృష్ణా బరాజ్ వద్దకు వచ్చేసరికి పెద్ద పెట్టున గాలివాన మొదలయింది కిటికీ పక్కన కూర్చున్న ఇందు పూర్తిగా తడిసి పోయింది గాలి, వాన, గతుకుల రోడ్డు ఏ నిమిషాన బస్సు రోడ్డుమీద నుండి కిందకు దొర్లుతుందో, ఏ సెకండులో ఎదురుగా వచ్చే వాహనంతో ఢీ కొడుతుందో అని ప్రాణాలు అర చేతుల్లో పెట్టుకుని కూర్చుంది ఇందు గాలీ, వాన అంత కంతకు ఎక్కువయింది గాని తగ్గలేదు! డ్రైవర్ తన సర్వ శక్తి యుక్తులూ కేంద్రీకరించి బస్సు నడుపసాగాడు ఎక్కడైనా ఒక చోట బస్సు ఆపుదామా అని క్షణం ఆలోచించాడు కాని తను బస్సును ఆపుకుని కూర్చున్నంత మాత్రాన ప్రమాదం జరుగకుండా వుంటుందని ఎలా అనుకోగలడు? ఎదురుగా వచ్చే వాళ్ళెవరైనా చూడకుండా గుద్దేయ వచ్చు అందుకని హెడ్ లైట్లు వేసుకుని బస్సు నెమ్మదిగా పోనీయసాగాడు

మంగళగిరి దాటాక గాలి జోరు తగ్గి వాన ఎక్కువైంది 'అమ్మయ్య సగం పీడ వదిలింది అనుకుంటూ బస్సు నడుపసాగాడు డ్రైవర్ సిగరెట్ తీసి నోట్లో పెట్టుకుని ఎడమ చేతితో లాఘవంగా అగ్గిపుల్ల వెలిగించి సిగరెట్ ముట్టించి గుప్పు గుప్పుమని పొగలాగుతూ నెమ్మదిగా బస్సు నడుపసాగాడు

ఇందు బట్టలు పూర్తిగా తడసి ముద్దయిపోయాయి చలి జ్వరం వచ్చినట్లు పళ్ళు గజగజ వణకసాగింది అంతగా వణికి పోతూ కూడా ఆమె చంద్ర ఎలా వున్నాడో? రవి నర్సింగ్‌హోమ్‌లో జేరాడు ఇలా తను చంద్రను చూడటానికి వచ్చానని తెలిస్తే రవి ఏమనుకుంటాడో? అనుకుంటూ బయట వాతావరణంలో వున్న అలజడి కంటె ఎక్కువగా మనసులో ఆరాట పడసాగింది!

గుంటూరు బస్‌స్టాండు దగ్గరకు బస్ వెళ్ళే సరికి వాన పూర్తిగా ఆగిపోయింది రిక్షాలో ఎక్కుతూ డాక్టర్ రవి గారి ఆస్పత్రికి పోనీయ్ అంది ఇందు

రిక్షా డాక్టర్ రవి ఎం ఎస్ అనే బోర్డు గల మేడముందు ఆగింది రిక్షా దిగి సూట్‌కేస్ చేతిలోకి తీసుకుంటూ ఇదేనా డాక్టరు రవి గారి ఆస్పత్రి' అని రిక్షా అతన్ని అడిగింది ఇందు

ఇదే ఆరిల్లు' అన్నాడు అతను

ఇల్లు కాదయ్యా బాబూ' ఆస్పత్రి దగ్గరకు వెళ్ళాలి'

అవునమ్మా ఇదే ఆరిల్లు అదుగో బోర్డు సూడండి" అతనికి చెముడనీ ఎలాగో డాక్టర్ రవి పేరు వినిపించుకుని ఇక్కడకు తీసుకుని వచ్చాడనీ అర్ధమయింది ఇందుకు ఆస్పత్రి ఎక్కడో కనుక్కుందామని చుట్టూ చూచిందామె

ఓ' ఇందూ' వాట్ ఏ స్ట్రేంజ్ లక్' అలాగే నిలబడి పోయావేం? రా లోపలకు!'అంటూ బజారునుండి ఇంటికి వస్తున్న రవి అనగానే ఏం చేయాలో అర్ధంకాక క్షణం నిలబడి పోయింది అంతలోనే తేరుకుని చిరునవ్వే సమాదానంగా రవి వెంట లోపలకు వెళ్ళింది

ఇందు డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చోగానే ఆమె చేతిలోని సూట్ కేస్ అందుకుంటూ–

అరె' బట్టలన్నీ తడిసి పోయాయే! వుండు బాత్ రూమ్‌లో గీజర్ ఆన్ చేసి వస్తాను అంటూ ఆమె సమాధానం కోసం చూడకుండా లోపలకు వెళ్ళాడు.

ఇందు మనసులో ఏదో తెలియని బాధ! చంద్రను చూడాలని, అతనికి ధైర్యం చెప్పి వోదార్చాలని వచ్చింది తను! రిక్షావాడు డాక్టరు రవి ఇంటికి తీసుకుని వచ్చాడు!

డాక్టరు రవిని చూసిన మరు క్షణం నుండి తన మనసు వశం తప్పిపోతున్నది! మేఘాలను చూసి పురి విప్పి నాట్యమాడే మయూరంలా సంతోష పారవశ్యంలో ఒడలు మరచిపోతున్నది!

రవి ముఖం తనను చూడగానే వెయ్యి వోల్టుల బల్బులా వెలిగి పోయింది! సందేహం లేదు! రవి తనను ప్రేమిస్తున్నాడు .'తను ఇప్పుడు చంద్ర కోసమై ఇక్కడకు వచ్చానని తెలిస్తే అతనేమనుకుంటాడో? తనను గూర్చి ఏమని ఆలోచిస్తాడో?

ఇందు ఆలోచనలను భగ్నం చేస్తూ ఒక ఇరవై ఏళ్ళ అమ్మాయి వచ్చి 'రండి స్నానం చేద్దురు గాని అంటూ స్నానాల గది దగ్గరకు తీసుకుని వెళ్ళింది లోపల గది నుండి ఎవరో ముసలమ్మ కర్టెన్ వెనుకగా తనను గమనించడం చూసింది ఇందు!

వేన్నీళ్ళతో తల స్నానం చేసి వచ్చాక కొంచెం సేద దీరినట్లు అనిపించింది

ఇందూ' ఇలారా' భోజనానికి ఇప్పటికే ఆలస్యమయిపోయింది" అని డైనింగ్ రూమ్ నుండి కేక వేసాడురవి

ఇందు వెళ్ళేసరికి రవి , ఆ అమ్మాయి డైనింగ్ టేబిల్ ముందు కూర్చుని వున్నారు టేబిల్ ముందున్న ఖాళీ కుర్చీలో కూర్చుంటుంటే ' ఇందూ! ఈ అమ్మాయి నా మేనగోడలు గీత అమ్మమ్మా! ఈ అమ్మాయి ఇందు' విజయవాడలో లెక్చరరుగా పని చేస్తున్నది'అని పరిచయం చేసాడు

రవి అమ్మమ్మ అని పరిచయం చేసిన ముసలామెకు నమస్కరించింది ఇందు

ముసలామె అయిష్టంగా ప్రతి నమస్కారం చేసి 'కూర తెస్తా' నంటూ లోపలకు వెళ్ళింది

"ఏమిటండోయ్! కూర బాగా లేదా?' అని అడిగింది గీత

"లేదమ్మా! బాగానే వుంది!"

'మరి అన్నం తినకుండా అలానే కూర్చున్నారేం? ఆప్యాయంగా ఆ అమ్మాయి పలుకరిస్తుంటే వులికి పడింది ఇందు ఈ అమ్మాయి అచ్చం మేనమామ పోలికలా వుంది!" అనుకుంది మనసులో!

"గీతా! ఇందు మంచి రచయిత్రి' అన్నాడు రవి

"ఏం లేదమ్మా! ఏదో రవిగారు అలా అంటున్నాయి అంద ఇందు ముసలమ్మ ముఖం ముడుచుకోవడం చూసిందామె

భోజనాలయినాక అంతా వచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చున్నారు

ముసలమ్మ వచ్చి కూర్చుని 'అయినవాళ్ళంతా పోయారు! నేను మాత్రం రాయిలా అలానే వున్నాను మనవడికి మనవరాలి కూతురికి పెళ్ళి చేసి కృష్ణా రామా అనుకుంటూ వో మూలపడి వుందామని వుంది అంది యదాలాపంగా

ఉలికిపడి చూసింది ఇందు ముసలమ్మ తనకు వార్నింగ్ ఇస్తుందిలా వుంది! పరధ్యానంగా తలవూపింది ఇందు.


తన పని అయినట్లుగా లోపలకు వెళ్ళిపోయింది ముసలమ్మ! గీత కూడా చదువుకోవాలన్నట్లు లోపలకు వెళ్ళింది

ఐయామ్ సారీ ఇందూ! అమ్మమ్మ మాటలు పట్టించుకోకు భర్త, కూతురు, అల్లుడు పోతే నన్ను మా అక్కని అన్నీ తానే అయి సంబాళించుకు వచ్చింది గీత పుట్టిన ఏడాదికే అక్క పోయింది బావ మళ్ళీ వివాహం చేసుకున్నాడు. అందువల్ల గీతను అమ్మమ్మ తెచ్చి పెంచక తప్పలేదు

రక్త సంబంధీకులలో పెండ్లి జరుగ గూడదని చెప్పినా వినదు చిన్నప్పుడు గీతను ఎత్తుకు పెంచాను ఆ అమ్మాయిని ఎలా వివాహం చేసుకునేది? చాదస్తంగా మాట్లాడుతుంది ఆమె మాటలకు బాధ కలుగుతుంది కాని ఆమె మీద గౌరవం వల్ల ఏమీ అనలేకపోతున్నాను!

'రవీ! ఆ తరంవారి ఆలోచనలు అవి! వాళ్ళు మనలా ఆలోచించలేరేమో అని మనం అనుకుంటున్నట్లే మనం వాళ్ళు చెప్పినట్లు వినడం లేదేమో అని వాళ్ళనుకుంటారు

"అమ్మయ్య! ఇప్పటికి నా మనసులో బెంగ తీరింది! అలసిపోయి వుంటావు!



విశ్రాంతి తీసుకో ఇందూ! నీ సూట్‌కేస్ మేడమీద గదిలో వుంచాను

"రవీ! నీతో వొక మాట చెప్పాలనుకుని తాత్సారం చేసాను మీ నర్సింగ్ హోమ్‌లో చంద్ర అనే అతను ఇన్‌పేషెంట్‌గా వున్నాడు అతన్ని చూడాలి!

"అలాగా! రేపు వుదయం నేను నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళేప్పుడు తీసుకు వెళతాను వెళ్ళి విశ్రాంతి తీసికో!"

అయిష్టంగా మేడమీదకు వెళ్ళి మంచం మీద పడుకున్నది ఇందు. కొంతసేపు అటూ ఇటూ దొర్లింది గాని నిద్ర రాకపోయేసరికి కిందకు దిగి వచ్చింది. గీత చదువుకుంటూ వున్నది ఇందును చూచి

"మంచినీళ్ళు కావాలా? అని అడిగింది

"లేదమ్మా! అంకుల్ నిద్రపోతున్నారా?"

"లేదు! తెల్లవారినదాకా రాసుకుంటూ వుంటాడు "

"అలాగా! ఏం లేదమ్మా అంకుల్ నర్సింగ్ హోమ్‌లో నాకు తెలిసినాయన వున్నాడు ఆయనను చూచి వస్తాను నర్సింగ్‌హోమ్ ఎక్కడమ్మా"

"పక్క బజారులో నే వుంది '

"అలాగా! వెళ్ళి వస్తానమ్మా! అంకుల్‌తో చెప్పు! తలుపేసుకో!" అంటూ వీధి తలుపు తీసుకుని బయటకు వచ్చింది ఇందు తను అలా వెళ్ళడం రెండు కళ్ళు అతి నిశితంగా పరిశీలిస్తున్నాయని ఆమెకు తెలియదు!

'ఎవరే ఆ అమ్మాయి?

"ఏమో నమ్మమ్మా! ఇందు అని కాలేజి లెక్చరర్ అనీ మామయ్య చెప్పాడు.'

"ఇక్కడ కెందు కొచ్చింది?

'మామయ్యకు తెలిసి నామె కాబోలు!

'అర్ధరాత్రప్పుడు ఎక్కడికి అలా వెళ్ళింది?"

"ఆమెకు తెలిసినాయన మామయ్య నర్సింగ్ హోమ్‌లో వున్నాడట. చూసి వస్తానని వెళ్ళింది

"అలా చెప్పు! పేషెంటు తాలుకు మనిషన్నమాట! సరే వీధి తలుపు సరిగా వేసి వుందో లేదో చూచి పడుకో" అంటూ లోపలకు వెళ్ళింది

* * * * * *

కుత్రుత నర్సింగ్ హోమ్ కనుక్కోవడం అంత కష్టమని అనిపించ లేదు ఇందుకు. ఆఫీసు గదిలో కూర్చుని వున్న నర్సుని...

"ఇక్కడ చంద్రహాస్ అని ఒకరు అడ్మిట్ అయివున్నారు. దయచేసి వారు ఏ గదిలో వున్నారో చెబుతారా?" అని అడిగింది.

"ముప్పై ఆరో నంబరు" అని సమాధానం చెప్పి మళ్ళీ చందమామ చదువుకో సాగింది.

నెమ్మదిగా ఒకో గది నంబరూ చూచుకుంటూ ముప్పై ఆరో నంబరు గది దగ్గరకు వెళ్ళింది.

మంచం మీద చంద్ర పడుకుని వున్నాడు. అతని ముఖం పీక్కుపోయి వున్నది శరీరం పాలిపోయి పాండు వర్ణం దాల్చి వున్నది

చంద్ర కనులు మూసుకుని వున్నాయి. మంచం పక్కన స్టూలు మీద కూర్చుంది ఇందు.

చంద్రనలా చూడగానే ఇందు మనసు ద్రవించిపోయింది "ఎలాటి వాడిలా అయిపోయాడు! అతని జీవితంలో ఇంతవరకు ఏమి సుఖం అనుభవించాడు? కష్టాల పరంపర నెదుర్కొంటూ దారిద్ర్యంతో సతతం పోరాడుతూ నిత్యం జీవితంలో ఎదురయే అపజయాలతో కుస్తీ పడుతూ మొండి ధైర్యంతో జీవిస్తున్నాడు. అతని అభాగ్య జీవితంలో ఒకే ఒక ఆశాజ్యోతి తను తనను గూర్చి ఆలోచిస్తూ అతను బాధలన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని వస్తున్నాడీ అయిదేళ్ళుగా!

కాదు ఒక విధంగా ఆలోచిస్తే తనే అతని బాధలకు కారణం ఏమో? తను అతని మనసును దోచుకుని వుండక పోయినట్లయితే అతనీ పాటికి వివాహం చేసుకుని హాయిగా పిల్లా పాపలతో కులాసాగా వుండి వుండేవాడేమో?" అనుకుంటుంటే ఇందు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఇందూ! వచ్చావా!" చంద్ర మాటలకు వులికి పడింది తీరా చూస్తే చంద్ర మాగన్నుగా నిద్రిస్తూనే వున్నాడు! తన పేరే కలవరిస్తూ వున్నాడు! పిచ్చి చంద్ర! నా అన్నవారు లేక బాధలో, నీరసంలో మృత్యు నీడలో తనకై ఎలా పరితపించి పోయాడో?

"ఎప్పుడొచ్చావు ఇందూ?" ఈసారి పూర్తిగా మెలకువలోకి వచ్చాడు చంద్ర


కంట్లలో నుండి కారుతున్న నీటిని తుడుచుకుంటూ "ఇప్పుడే వచ్చాను" అంది.

తనను చూడగానే అతని ముఖం కళ కళ లాడడం గమనించింది ఇందు.

"నువ్వు వచ్చావు! ఇక నాకు మనసులోని బెంగ తగ్గిపోయింది. ఒక రోజు విపరీతంగా రక్త వమనం చేసుకున్నాను. రక్తం చూడగానే ఇక 'చాప్టర్ క్లోజ్' అనుకున్నాను శరీరం చలవలు గమ్మి పోసాగింది మనసు అంధకారంతో నిండిపోసాగింది. 'ఒక్క సారి ఇందుని చూస్తే చాలు. సంతోషంగా చనిపోవచ్చు, అనుకున్నాను. ఎవరో పుణ్యాత్ములు తెచ్చి ఇక్కడ జేర్చారు. డాక్టర్ రవి నిజంగా దేముడు నీరస నిస్సహాయ స్థితిలో వున్న నాకు ధైర్యం చెప్పి మళ్ళీ ప్రాణం పోసారు. అయిదు సీసాల రక్తం ఎక్కించాడు! రక్తస్రావం ఆగక పోతే ఆపరేషన్ చేస్తానంటూ థియేటర్ సిద్ధం చేసాడు. అదృష్టవశాత్తు ఆపరేషన్ పనిలేకుండానే రక్త స్రావం ఆగిపోయింది కాని నీరసం వదలలేదు కొంచెం వోపిక రాగానే నీకు వుత్తరం వ్రాసాను! అప్పట్నించి ప్రతిక్షణం 'ఇదిగో ఇందూ వస్తుంది' అనుకుంటూ వున్నాను." అంతసేపు మాట్లాడినందువల్లో ఏమో చంద్ర రొప్పసాగాడు.

"వూరుకో చంద్రా! తర్వాత చెబుదువుగాని ఇప్పటికీ ఇంకా నువ్వు

ధర్మ పథం



త్రిపురాసుర సంహారం

అసాధ్యులైన త్రిపురాసురులు లోక కంటకులు. వారిని సంహరించ డానికి దేవతలలో ఇంద్రాదులకున్నూ సాధ్యం కాలేదు. అందువల్ల త్రిమూర్తులూ ఆలోచించి గట్టి ప్రయత్నం చేసి వారిని సంహరించారు. వారిపై యుద్ధానికి శివుడు నాయకత్వం వహించాడు. ఆ త్రినేత్రుడికి భూమి రథముయింది. సూర్యచంద్రులు రథ చక్రాలయినారు. నాలుగు వేదాలూ గుర్రాలు కాగా, ఆ రథానికి బ్రహ్మ సారధ్యం వహించాడు. యుద్ధం చేసే మహాదేవునికి మేరు పర్వతం విల్లయింది. నాగరాజు వింటినారి అయినాడు. ఆ రాక్షసుల పయి ప్రయోగించే బాణంగా విష్ణువు మారాడు. ఇట్టి గట్టి సన్నాహంతో బయలుదేరి శంకరుడు ఆ రాక్షసులను సంహరించాడు. ఇది పురాణ గాథ.

మన పురాణగాథల్లో అంతరార్థం ఇమిడి ఉంటుంది. ఆ విధంగానే ఈ గాథలోనూ ఒక అంతరార్థం ఇమిడి ఉన్నదని గ్రహించవలసి ఉన్నది. ఇందులో – జీవాత్మ ఇంద్రియాలను జయించి సాధన చేసి, దృఢ సంకల్పంతో ఉన్నప్పుడు ముక్తిని పొందగలడనీ, పరమాత్మలో ఐక్యం కాగలడనీ వివరించబడు తున్నట్లు ఊహించ వచ్చును

సత్త్వం, రజస్సు, తమస్సు–అనే గుణత్రయమే త్రిపురాలు ఆ గుణాల వల్ల కలిగే వివిధ సంకల్పాలే త్రిపురాసురులు. అట్టి సంకల్పాలు కలుగకుండా గుణత్రయా లను జయించినప్పుడే సాధన సార్థకమయి ముక్తి లభిస్తుంది కాని విజయం కోసం మనోధైర్యం ఉండాలి విల్లుగా మారిన మేరుపర్వతం ధైర్యాన్ని సూచిస్తుంది కొండ అంత వింటికి సామాన్యమైన నారి సరిపోదు అందువల్ల నాగరాజు వింటినారిగా మారాడు. ఇది దృఢత్వానికి సూచకం. వేరొక నారి అయితే తెగిపోవచ్చు. ఇక గుణత్రయ సంబంధం పోగొట్టుకొనడానికి విష్ణువును ధ్యానించడం సూటి అయిన మార్గం. అందువల్ల ఆ దేవుడు బాణంగా గ్రహింపబడినాడు. భూమి స్థిరమైన ఆసన బంధాన్ని సూచిస్తుంది. రథ చక్రాలయిన సూర్యచంద్రులు రాత్రిందివ రూపమైన కాలాన్ని సూచిస్తాడు రాత్రనక, పగలనక సర్వకాలం సాధన సాగించడం దీనివల్ల వ్యక్తమవుతుంది.

మనం చేసే సాధన వేద మార్గాన్ని అనుసరించి ఉండాలి. అందువల్ల చతుర్వేదాలూ రథాశ్వాలుగా చెప్పబడినవి. వేదాలు అపౌరుషేయాలని బ్రహ్మ వాటికి ప్రచారకుడు మాత్రమే అని మన వారి విశ్వాసం. అందువల్ల పితామహుడు ఆ గుర్రాలను నడిపించే సారధిగా చెప్పబడినాడు. ఇట్టి మహాప్రయత్నం వల్ల త్రిగుణాలను జయించడం సాధ్యపడగలదని తెలుసుకోవాలి. ఇలా ఊహించడానికి ఈ పురాణగాథ అవకాశాన్ని కలిగిస్తున్నది.

–బులుసు వేంకట రమణయ్య

శుశ్రుత నర్సింగ్‌హోమ్

నీరసంగానే వున్నావు".

"లేదు ఇందూ! నిన్ను చూడగానే కడ బట్టిన ప్రాణంలో కొత్త ఆశలు చిగురించాయి! నీతో మాట్లాడుతుంటే నాకు ఎక్కడ లేని ధైర్యం వస్తున్నది.

నిన్ను మళ్ళీ చూస్తాననీ, మళ్ళీ నీతో మాట్లాడతాననీ అనుకోలేదు సుమా!"

"చంద్రా! అప్పుడావిషయాలు చెప్పకు! శెలవు పెట్టి వచ్చాగదా! నీకు బాగానయమయిందాకా వుంటాను! ఇక విశ్రాంతిగా వుండు" ఇందు ఎంత వద్దన్నా వినకుండా కబుర్లు చెప్పసాగాడు చంద్ర! కాలేజీలో చదివేటప్పటి సంగతులు, చిన్నప్పటి సంగతులు ఒక్కొటి పూసగుచ్చినట్లు చెబుతూ చివరకు తెల్లవారు జాముకు నిద్ర పోయాడు.

క్రితం రాత్రి కూడా నిద్ర లేకపోవడంతో స్టూలు మీద కూర్చునే తల మంచం మీద ఆన్చి నిద్ర పోయింది ఇందు.

(ఇంకా ఉంది)


నెస్టమ్ బేబీ సిరియల్
ప్రారంభించేందుకు ఆదర్శప్రాయమైనది
పెరుగుదలకు ఆదర్శప్రాయమైనది
నెస్టమ్, పాలు-పూర్తి పోషక విలువలున్న ఆహారం.
మీ బాబు సుమారు 4 నెలలవాడయేసరికి, కావాలి. పాలతోపాటు ఘనఆహారం పాపాయికి తేలిగ్గా జీర్ణమయేట్టు, ప్రత్యేక శ్రద్ధతో తయారయిన- నెస్టమ్ బేబీ సిరియల్‌ని పెట్టడం ప్రారంభించండి. ముందుగా మరిగించి పెట్టిన గోరువెచ్చటి పాలతో కలపండి. ఇక, పూర్తి పోషక విలువలున్న ఆహారం సిద్ధమవుతుంది.
పాపాయి ఆరోగ్యంగా, చలాకీగా పెరిగేందుకు తోడ్పడుతుంది.
నెస్టమ్‌తో వివిధ వంటలు-పాపాయి ఆహారంలో బోలెడన్ని రకాలు
మీ పాపాయి ఎదుగుతున్న కొద్దీ కొత్త రకాలు రుచి చూపించండి.
ఉడికించిన కూరముక్కలూ, పండ్ల ముక్కలూ, పప్పు-వీటిని నెస్టమ్‌తో కలిపి పెట్టండి. బాబు, కుటుంబంలో వారు తినే ఆహారాన్ని తీసుకోవడం నేర్చుకునేందుకు ఇది తోడ్పడుతుంది.
నెస్టమ్®
రైస్
ఇనుము-విటమిన్లతో కూడినది
పాలలో కలపండి.
Nestlé
Nestum
baby cereal
Rice
mix with milk
ఉచితం
మీ బాబు, తన ఆహారంలో, కొత్త రుచులను కోరుతాడు అందుకని–మీ ఉచిత నెస్టమ్ వంటల పుస్తకం కోసం రాయండి.
నెస్టమ్
పోస్ట్ బాక్స్ నెం. 6016, న్యూ ఢిల్లీ-110008.

ఇది జీవితం

శ్రీమధుర్‌జీ

మోడరన్ సినీ స్టూడియో

స్టూడియోలో పదవ ఫ్లోర్‌లో కోలాహలంగా వుంది లైట్ బాయిస్, అసిస్టెంట్లు, కెమరామన్, ఆర్ట్‌డైరక్టర్, ఎక్స్‌ట్రా ఆర్టిస్టులు, యితర వర్కర్లు ఫ్లోర్‌లోని సెట్టింగులూ యిటూ అటూ పరుగులు తీస్తున్నారు 'షాట్'కు సిద్ధం చేస్తూ



ఆరోజా దివ్యకళానికేతన్ వారి సంచలన సాంఘిక చిత్రం 'శీలవతి' కోసం క్లైమాక్స్ దృశ్యాల చిత్రీకరణ గురించి టెక్నీషియన్స్, ఆర్టిస్ట్స్ హడావుడి పడిపోతున్నారు

ఉదయం పదిగంటలు

ప్రఖ్యాత దర్శకుడు రాంచందర్‌గారి కారు స్టూడియోలోకి మలుపు తిరిగి, పదవ ఫ్లోర్ పోర్టికోలో హుందాగా ఆగింది. డైరక్టర్ రాంచందర్‌గారు వాచీ చూసుకుంటూ హడావుడిగా కారు దిగి ఫ్లోర్‌లోకి అడుగుపెట్టారు

యాభై ఏళ్ళు పైబడిన రాంచందర్‌గారి ముఖంలో తెలివితేటలు, హుందాతనం తెలుగుదనం కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి దర్శకుడిగా తెలుగు చిత్రరంగంలో మహోన్నత శిఖరాల నందుకున్నారు ఇక సంచలన నవలా రచయితగా రాంచందర్‌గారు అందుకోని బహుమానం, పొందని గౌరవ పురస్కారం మిగలలేదన్న అతిశయోక్తి కాదు రాంచందర్‌గారు మనిషిగా ఎంతటి సౌమ్యుడో దర్శకునిగా అంతటి నిక్కచ్చి మనిషి తను మనసులో భావించుకున్న ఎఫెక్ట్ వచ్చేంతవరకు తను వూపిరి పీల్చుకోరు ఆర్టిస్టులను, టెక్నీషియన్లకు వూపిరి పీల్చుకోనివ్వరు చిత్రీకరణలో ఎక్కడా రాజీ దొరణిని, లొంగుబాటును, మెతకతనమును ప్రదర్శించరు కాబట్టే రాంచందర్‌గారిని ఉత్తమ దర్శకునిగా ఇటు పరిశ్రమ గౌరవిస్తుంది అటు ప్రజలు ఆదరిస్తున్నారు

'గుడ్ మార్నింగ్ సర్ '

'నమస్కారం సార్'

'నమస్తే! సర్ '

ఆర్టిస్ట్‌ల, టెక్నీషియన్ల నమస్కారాలందుకొంటూనే ' షాటుకు ఏర్పాటు చేసిన హంగులను పరిశీలించారు ఎఫెక్ట్ కోసం కొన్ని మార్పులు, చేర్పులు సూచించి – తదనుగుణంగా సరంజామా మార్పించారు కథా రచయితతో, మాటల రచయితతో పది నిముషాలు చర్చించి సంభాషణలను తను చెప్పదల్చుకున్న భావాలకు అనుగుణంగా సరిదిద్దుకున్నారు తీయదలుచుకున్న షాట్ గురించి హీరోయిన్‌కు తగు

సూచనలిచ్చారు తను కోరుకుంటున్న ఎఫెక్ట్సుకు అనుకూలమైన యాంగిల్స్ గురించి కెమరామెన్‌తో చర్చించారు

షాట్ రడీ

'సైలెన్స్ ' రాంచందర్‌గారి కంఠం ఖంగున మ్రోగింది ఫ్లోర్‌లోని హడావుడి మాయమై – నిశ్శబ్దం రాజ్యం చేసింది

'స్టార్ట్ '

లైట్లు వెలిగాయి కెమరా పని చెయ్యటం ప్రారంభమయ్యింది

శీలవతివి నీవమ్మా
అనురాగవతివి నీవమ్మా

బ్యాంక్ గ్రౌండ్ నుంచి పాట అలా అలా వినిపిస్తోంది గాయిని గొంతునిండా పలికించిన కరుణరసం రేపు ప్రేక్షకులచే కన్నీరు కార్పిస్తుంది పాట కనుగుణంగా హీరోయిన్ హిమబిందు బరువుగా కదులుతోంది. భారంగా అడుగులు వేస్తోంది గ్లిసరిన్ కన్నీరు హీరోయిన్ చెంపల మీదుగా ధారాపాతంగా కారుతున్నాయి జుట్టు చెదిరి, కట్టు చెదరి, చీరనలిగి, బ్రతుకు చిరిగి హీరోయిన్ దయనీయంగా వుంది ప్రేక్షకుల సానుభూతిని, జాలిని యిట్టే చూరగొనేలా వుంది

ధనానికన్నా ఈ జగానమిన్న
శీలమె కద తల్లీ
ప్రాణం కన్నా పదిలమైనదీ
శీలమె కద చెల్లీ

పాటలో చరణాలు కదిలిపోతున్నాయి నీలినీడల నడుమ –వెలుగు చీకట్ల నడుమ దిగివచ్చిన దైన్యంలా, రూపుకట్టిన దీనత్వంలా హీరోయిన్ కన్నీటితో – కొడగట్టిన దీపంలా సాగిపోతూ వుంది దూరంగా స్మశానంలో చితిమంటలు చుట్టూ భయంకర నిశ్శబ్దం కరడుకట్టిన అంధకారం

ఆ నీరవ నిశీథిలో దగాపడిన అడపడుచు మొండిగా నడిచి వెడుతూంది ఆరని కన్నీటితో, చెదరిన గుండెతో, మంటగలసిన శీలంతో

ఈ లోకం పామై కాటేసిందే తల్లీ ఈ సంఘం నిలువున దో చేసిందే చెల్లీ

పాటలో చరణం మారింది
తెగిన గాలిపటానికి గమ్యం ఏదమ్మా
పగిలిన నావకు యిక తీరం ఏదమ్మా

వర్షం మొదలయ్యింది చెట్లు జుట్టు విరియ విరియబోసుకుని దెయ్యం పట్టిన వానిలా ఊగుతున్నాయి ఆకాశంలో ఉరుముల ఫెళఫెళలు

కళ్లు చెదరగొట్టే మెరుపులు ఏర్లు, వంకలు వాగులు ప్రవాహాలుగా పెరుగుతున్నాయి అయినా హీరోయిన్ నిర్లక్ష్యంగా, నిద్రలో నడిచేదానిలా నిర్వికారంగా కన్నీళ్లతో నడుస్తోంది

అదిగదిగో ఆకాశం నిను పిలుస్తున్నది
పొంగి పొరలు జలపాతం నిను రారమ్మన్నది
రా కదలిరా రా రా కదలిరా
రా రా రా రా

హీరోయిన్ మీదుగా సుళ్లు తిరిగే ప్రవాహం ఆపైన భయంకర నిశ్శబ్దం పాట ఆగిపోయింది

'కట్ ఓ కే రాంచందర్‌గారి కంఠం ఖంగుమంది హీరోయిన్ హిమబిందు ముఖం తుడుచుకుంటూ వచ్చింది

'వెల్‌డన్ బిందూ! ఈ సీన్లో నీ యాక్షన్ సూపర్బ్ నాకే కళ్లల్లో నీళ్లు తిరిగాయంటే నమ్ము ' రాంచందర్‌గారు హీరోయిన్‌ను అభినందించారు

'థాంక్స్ సర్ నాదేముంది మీరు వ్రాసిన పాటకు మీరు క్రియేట్ చేసిన వాతావరణానికి సహజంగానే ఆ బలముంది ' హీరోయిన్ వినయంగా జవాబిచ్చింది

మళ్లీ సెట్లో కోలాహలం మొదలయ్యింది

'నాన్నా . '

రాంచందర్‌గారు ఆ పిలుపు విని వెనుదిరిగారు.

నీరజ! రాంచందర్‌గారి ఏకైక పుత్రిక నీరజ కళ్ల నిండా కన్నీరు

'ఎప్పుడొచ్చావమ్మా యివ్వాళ కాలేజీ లేదా తల్లీ –'

'యివ్వాళ నాకు క్లాసు వర్క్ లేదు నాన్నా మీరు ఈ క్లైమాక్స్ సీను మొదలెట్టే వేళకే వచ్చాను మీరు వర్క్ మీద వున్నారు కనుక డిస్టర్బ్ చెయ్యలేదు '

'ఎలా వచ్చిందమ్మా ఈ సీను '

'బాగుంది నాన్నా కానీ –' అర్ధోక్తిలో ఆగింది నీరజ

'ఏమ్మా మధ్యలోనే ఆగిపోయావేం అడుగు తల్లీ –' రాంచందర్‌గారు ఆప్యాయంగా కూతురు తల నిమిరారు.

'ఈ షాట్‌లో హీరోయిన్‌ను ప్రవాహంలో కలిపెయ్యకుండా వుంటే బాగుండేదేమో ' నీరజ గొణిగినట్లుగా అడిగింది

'నో'– రాంచందర్‌గారి కంఠం నిండా స్థిరత్వం

'ఆమె తప్పుకు అదే తల్లీ తగిన పరిష్కారం –'

'ఆమె తప్పు చెయ్యవలసి వచ్చిన పరిస్థితులను కూడా చక్కగా చూపారు కదా నాన్నా అయినా కూడా 'సందిగ్ధంలో ఆగింది

'తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పేకదమ్మా నిప్పును చేత్తో తగిలి అయ్యో యిది నిప్పని నాకు తెలియదే అంటే ఆ నిప్పు ఆ చేతిని కాల్చక మానుతుందా తల్లీ ' రాంచందర్‌గారి వాదన నీరజకు నచ్చనప్పటికిని ఆ వాదనను ఖండించే శక్తి లేక మౌనం దాల్చింది

'ఏమో నాన్నా ఆ ముగింపు నాకు నచ్చలే దు '

'మనకు నచ్చినా నచ్చకపోయినా ఆ కథకు ఆ ముగింపు తప్పదు తల్లీ –'

ఎందుకో నీరజ హఠాత్తుగా తలెత్తి రాంచందర్‌గారి కళ్లలోకి చూసింది ఆ కళ్లలో నీరజకు రాజీ లేని పట్టుదల కన్పించింది తండ్రి కళ్లల్లోకి చూస్తున్న నీరజ కళ్లల్లో కన్నీళ్లు తిరిగాయి


'సార్–' అసిస్టెంటు పిలుపుకు రాంచందర్‌గారు అటు తిరిగారు నీరజ చరచరా ఫ్లోర్ బయటకు వచ్చి కారెక్కింది – కన్నీళ్లు తుడుచుకుని

నీరజ చెవుల్లో 'శీలవతి' క్లైమాక్స్ సీను తండ్రి వ్రాసిన ఆ పాటే ప్రతిధ్వనిస్తోంది నీరజ సీట్లో వెనక్కు వాలి బలవంతంగా కళ్లు మూసుకుంది

ఆ కళ్ల నిండా కన్నీరు

★ ★ ★ ★ ★

సాయంకాలం ఆరు గంటలు



పశ్చిమాకాశంలో సంజకెంజాయలు ప్రకృతికి వింత వింత సోయగాలు పంచిపెడుతున్న వేళ –

నీరజ బీచ్‌లో అసహనంగా కూర్చుంది క్షణ క్షణానికీ చూపులు రోడ్డు మీదకు పరుగెడుతున్నాయి ఆశగా చెవులు అలవాటుపడ్డ స్కూటర్ శబ్దం కొరకు నిరీక్షిస్తున్నాయి అందమైన ఆ సాయంకాలం దుర్భరంగా వుంది నీరజకు చుట్టూ వందలాది జనం ఆనందంగా ప్రకృతి సోయగాన్ని అనుభవిస్తున్నా నీరజకు మాత్రం ఆ వాతావరణం నిర్లిప్తంగా వుంది ఆ ఏకాంతం దుర్భరంగా వుంది ఆ నిరీక్షణ దుస్సహంగా వుంది

అయినా నిరీక్షిస్తూనే వుంది నీరజ నిరీక్షణ మధుకర్ కోసం అవును మదుకర్ ఎవరో నీరజకు సంవత్సరం క్రితం వరకు తెలియదు మదుకర్ సంవత్సరం క్రిందట సిటీ బాంక్‌కు ఆఫీసర్‌గా వచ్చాడు చిత్రంగా ఓ రోజు – సిటీ బస్‌లో కాలేజీకి వెడుతున్న నీరజకు అదే బస్‌లో ప్రయాణిస్తున్న మదుకర్‌కు పరిచయముయింది

మదుకర్ అందం, వ్యక్తిత్వం, మాటకారితనం, చొరవ, చదువు, వుద్యోగం, ఆర్థిక హోదా అన్నీ అన్నీ ఎంతో నచ్చాయి నీరజకు

నీరజ అందం, ఆకర్షణ, మనసు, వినయం, సోషల్ మూవ్‌మెంట్, కళాభిమానం, యవ్వనం అన్నీ అన్నీ మరింతగా నచ్చాయి మధుకర్‌కు

అందుకే వారి పరిచయం స్నేహంగా, స్నేహం ప్రేమగా, ప్రేమ ప్రణయంగా కాలగతితో పాటు పరిణామం చెందాయి ఇక మిగిలిందల్లా ప్రణయం పరిణయంగా మారటమే

సంజకెంజాయలు క్రమంగా కనుమరుగై నీలి తెరల్లాటి చీకట్లు ముసురుకుంటున్నాయి బీచ్‌లో సాయంకాలం సందడి నిశ్శబ్దంగా రూపు మార్చుకుంటోంది

అయినా నీరజ యింకా నిరీక్షిస్తోంది

ఆ నిరీక్షణలోని అసహనం స్థానే క్రమంగా భయం, దిగులు, ఆందోళన చోటు చేసుకుంటున్నాయి నీరజ గుండెలు అర్థంకాని బావనలతో బరువెక్కాయి

మద్యాహ్నం సంగతులు నీరజ మనసులోని భయాన్ని పదింతలుగా పెంచుతున్నాయి గత వారం పది రోజుల్నుంచి నీరజ ఒంట్లో నలతగా వుంది శరీరంలో కనిపించని నీరసం దేహంలో తరిగిపోయిన వుత్సాహం పుట్టి బుద్దెరిగిన తర్వాత ఎన్నడూ లేని క్రొత్తదనం శరీరంలో చోటు చేసుకున్న మానసిక బావన

అందుకే నీరజ మధ్యాహ్నం లేడి డాక్టరును కలిసింది డాక్టరుగారు సమగ్రంగా పరీక్షించి చెప్పిన మాటలు చెవుల్లో మళ్లీ మళ్లీ ప్రతిధ్వనిస్తూనే వున్నాయి

' చూడమ్మా యు ఆర్ లక్కీ ఎనఫ్ నీలో మరో జీవి రూపుదిద్దుకుంటోంది .'

ఇది జీవితం

మరో జీవి తల్లి పెళ్లి కాని తల్లి కన్నెగానే తల్లి

'నో నో అలా జరగటానికి వీల్లేదు వీ ల్లే దు ' బీచ్‌లో కూర్చుని నీరజ పిచ్చి దానిలా పైకే గొణుక్కుంది మధ్యాహ్నమే సిటీ బాంకుకు ఫోన్ చేసి సాయంకాలం ఆరు గంలకు మదుకర్‌ను బీచికి రమ్మని చెప్పింది

బీచిరోడ్డు చర్చిలో ఏడు గంటలు కొట్టారు మధుకర్ స్కూటర్ రోడ్డు ప్రక్కన ఆగింది ఇసుకలో నడిచి తనవైపే వస్తున్న మధుకర్ వైపు తదేకంగా చూసింది నీరజ మధుకర్ కన్నుల్లో కాంతి తప్ప కపటం కనబడలేదు నీరజకు ఆ చిరునవ్వుల్లో వెన్నెల తప్ప నీలి నీడలు కనబడలేదు నీరజకు

నో నా మదు నన్నెప్పటికీ మోసం చెయ్యడు గొణుక్కుంది

సారీ నీరజా! బాగా లేటయ్యింది సాయంకాలం ఐదింటికి రీజనల్ మేనేజర్ రావటంతో బాగా ఆలశ్యమయింది సారీ ఫర్‌ది ట్రబుల్ " వినయంగా సంజాయిషీ చెప్పుకున్నాడు మధుకర్ నీరజ మధుకర్ కళ్లలోకి పిచ్చిదానిలా చూస్తోంది ఆ కనురెప్పల వెనుక దుముకటానికి సిద్ధంగా వున్నాయి కన్నీళ్ళు

మధూ ! నన్ను మోసం చేయవుగా నీరజ గుండెల్లోని దుఃఖం ఒక్కసారి కెరటంలా ఎగిసి వచ్చింది బేలగా ఏడ్చింది

నీరజా ఏమిటిది ఇప్పుడేమయిందని ప్లీజ్ కిల కిల నవ్వే నీ కన్నుల్లో ఆ కన్నీళ్ళు చూడలేను ప్లీజ్ కంట్రోల్ యువర్‌సెల్ఫ్ .' లాలనగా నీరజ వీపు నిమిరాడు నీరజ మదుకర్ చేతిని తన చేతుల్లోకి తీసుకుని కన్నీళ్ళు తుడుచుకుంది

నీరజా ఏం జరిగిందో వివరంగా చెప్పు

నీరజ తన తలను మధుకర్ గుండెల్లో దాచుకుని వెక్కిళ్లమధ్య చెప్పింది తను తల్లి కాబోతున్న విషయం

ఈజిట్ ! నవ్వుతూ అడిగాడు మధుకర్

అమాయకంగా తలూపింది నీరజ

'డోన్ట్ ఫియర్ డియర్ ఈ మధుకర్ ఎప్పుడూ నీవాడే పోనీ రేపు మీ నాన్నగారిని కలిసి వీలయినంత త్వరగా మన పెళ్లికి ముహూర్తాలు నిర్ణయించమని చెప్పనా చిరునవ్వుతో అడిగాడు

నీరజ ముఖంలో కోటి దివ్వెల వెలుగులతో పాటు బుగ్గలపై చిరుసిగ్గుల అరుణిమలు విరబూశాయి

నీరజ ఆనందంగా తలూపింది మధుకర్ చేతులు నీరజను మరింత దగ్గరగా చేర్చుకున్నాయి

★ ★ ★ ★

కళాబారతిలో రాచందర్‌గారి సన్మాన సభ. సంచలన రచయిత రాంచందర్‌గారి నవల "అబల కు కేంద్ర సాహిత్య అకాడమీ వారు బహుమతి ప్రకటించిన సందర్భంగా– సాహిత్య సంఘాలు, అభిమానులు సంయుక్తంగా నిర్వహిస్తున్న అభినందన సభ

వేదిక మీద నగర మేయర్, ప్రధాన న్యాయమూర్తి, ప్రముఖ సినీ నటులు, దర్శకులు, అనన్య ప్రచారంగల ఓ వారపత్రిక సంపాదకులు– వారి మధ్యన నిలువెత్తు పూలమాలలతో రాంచందర్‌గారు ఆసీనులై వున్నారు

సబ మొదలయ్యింది వేదిక నలంకరించిన ప్రముఖులు తమ ఉపన్యాసాల్లో రచయిత రాంచందర్‌గారి ప్రతిబను, వారి రచనా విధానాన్ని, వారి ప్రాభవ వైబవాల్ని పదే పదే ప్రస్తుతించారు నవలలోని యితివృతాన్ని, దాన్ని నవలగా మలచిన తీరును మరో వక్త ఆకాశాని కెత్తేశాడు తదుపరి రాంచందర్‌గారిని ఘనంగా సన్మానించారు దర్శక, రచయిత రాంచందర్‌గారు తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు

నా నవల 'అబల'కు కేంద్ర సాహిత్య అకాడమీ వారు బహుమతి ప్రకటించడం నాకెంతో ఆనందంగానూ, కొంచం గర్వంగానూ వుంది ఈ బహుమతి నేనూహించిందే నిజానికి 'అబల'లోని కథావస్తువు ఏ బహుమతినైనా గెలువగలిగి నట్టిది ఈ నవల మీరందరూ పదే పదే చదివారు కనుక నేను వివరంగా చెప్పవలసిన పనిలేదు ఈ నవలలోని నాయిక చైతన్యం మూర్తీబవించిన స్త్రీ స్త్రీల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ స్త్రీ పురుషుల మధ్య నున్న అంతరాల్ని, అసమానతల్ని తొలగించటానికి తీవ్రంగా కృషి చేస్తుంది అలా ఉద్యమాల్లో పనిచేస్తూ, మరో సంస్కర్తయైన ఓ యువకున్ని ప్రేమిస్తుంది ఆ ప్రేమ ప్రణయానికి దారి తీస్తుంది కానీ ఆ యువకుడు మరో సాధారణమయిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు

అప్పుడు ఆ నాయిక స్త్రీలందరి సమస్యల గురించికాక తన సమస్య గురించే ఆలోచిస్తుంది ఆమెలోనున్న చైతన్యం కనుమరుగవుతుంది సంఘ దూషణ, తిరస్కారాలకు గురై సమాజం నుండి వెలివేయ బడుతుంది

ముందు వరుస ప్రేక్షకుల్లో కూర్చున్న నీరజ తండ్రిగారి ఉపన్యాస ప్రవాహంలో లీనమయింది నీరజ మనసు నిండా రకరకాల ఆలోచనలు ముసురుకుంటున్నాయి

. అప్పుడు ఆ నాయిక చైతన్యమూర్తి కాదు కేవలం స్త్రీ ఒక అబల ఓ అనాథ అందుకే అందుకే ఆత్మహత్య చేసుకుంటుంది ఈ ఘుగింపు స్త్రీలోకానికి కనువిప్పు కలిగించాలి అప్పుడే నా నవల అబలకు" సార్థకత

చేకూరుతుంది "

హాల్లో చప్పట్లు మారు మ్రోగాయి కాని ఎందుకో నీరజకు ఆ చప్పట్లు చావు బాజాల్లా వికృతంగా వినిపించాయి ప్రేక్షకుల మనస్సులో దాగివున్న పైశాచికత్వం ఆ చప్పట్లలో పరోక్షంగా ధ్వనించినట్లుగా ఫీలయ్యింది నీరజ

సభ ముగిసింది. నీరజ తండ్రి రాంచందర్‌గారితో పాటు కారెక్కింది

"నాన్నా!.... మీ నవల ముగింపును గురించి మీకెవ్వరూ ఏమి వ్రాయలేదా?"

"ఎందుకు రాయలేదు తల్లీ ... ఎన్నో వుత్తరాలు వచ్చాయి– ఆ ముగింపు చాల మందికి నచ్చింది ... ముఖ్యంగా అకాడమి పెద్దలు ఆ ముగింపును మరీ మరీ మెచ్చుకున్నారు తల్లీ .. "

"మీక్కూడా ఆ ముగింపు.... తృప్తి నిచ్చిందా. . నాన్నా. "

"ముగింపు వ్రాసేటప్పుడు ఎక్కడో అంతరాంతరాల్లో రవ్వంత అసంతృప్తి వున్నా పాఠకులు. పత్రికలు, అకాడమీలు ఆ ముగింపును యింతగా మెచ్చుకున్న తర్వాత ఆ ముగింపు నాక్కూడా తృప్తిగా వుంది తల్లీ. "

నీరజ మౌనంగా తండ్రి ముఖంలోకి చూసింది. నీరజ కనురెప్పల చాటున కదలాడే కన్నీటి ఊటలు ..

★ ★ ★ ★

"హలో ... మధుకర్‌గారు రాలేదా. లీవ్ మరో పదిరోజులు పొడిగించుకున్నారా. ఎక్కడకు వెళ్ళారో చెప్పగలరా. హలో.... యింటర్వ్యూకు వెళ్ళారా అడ్రస్ తెలిస్తే చెప్పగలరా. తెలియదంటారా ... ఆల్‌రైట్. థాంక్స్ "

నీరజ నిస్పత్తువగా ఫోన్ పెట్టేసింది

".... ఇప్పటికే మధుకర్ కనిపించి పదిహేను రోజులయ్యింది. మరో పది రోజులు కనిపించదన్న మాట. .. ఇంటర్వ్యూకు వెడుతున్న వాడు మాటవరసకయినా చెప్పకుండా వెళ్ళాడేమిటి యింకా పది రోజులు యిలా కన్నీళ్ళతో, గుండె బరువుతో నిరీక్షించాలా కొంపతీసి మధుకర్ నన్ను. నన్ను మోసం చెయ్యడు కదా ఏమో ?"

ఆ ఊహకే నీరజ గజగజ వణికిపొయ్యింది కళ్ళల్లో నీరు గిర్రున తిరిగి జలపాతాల్లా చెంపల మీద కురికాయి

"నో. అలా ఎన్నటికీ జరుగదు "

మనసులో మళ్ళీ క్రొత్త క్రొత్త ఊహలు తియ్య తియ్యని ఆశలు .

ఆశా నిరాశల నడుమ , భయాల, దిగుల్ల నడుమ, చీకటి వెలుగుల నడుమ పదిరోజులు ఎలాగో గడప గలిగింది నీరజ

మరుసటి రోజు పదిగంటలకు స్వయంగా మధుకర్ పనిచేస్తున్న సిటీ బ్యాంకకు వెళ్ళింది నీరజ. కాని– మధుకర్ అక్కడ లేదు. చెదిరే మనసును చిక్కబట్టుకొని మధుకర్ గురించిన వివరాలు సేకరించింది నీరజ ఆ వివరాలు నీరజ జీవిత గమనాన్ని తారుమారు చేశాయి. నీరజ మనసున మంటలుగా ప్రజ్వరిల్లి ఆమె బ్రతుకునే బుగ్గిపాలు చేశాయి.

మధుకర్ సిటీ బ్యాంక్‌లోని ఆఫీసర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు మరో బ్యాంక్‌లో ఎక్కడో జోనల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడట ..! ఎక్కడ పని చేస్తున్నది ఎవరికీ తెలియదట....!

నీరజ కన్నీళ్ళతో బ్యాంక్ బయటకు వచ్చింది.

నీరజకు ప్రపంచమంతా శూన్యంగా వుంది. మనసు నిండా పిచ్చి పిచ్చి భావాలు ముసురుకుంటున్నాయి. ఆకాశం కూడా నీరజ మనసులానే దట్టంగా మబ్బుపట్టి– కురవటానికి సిద్ధంగా వుంది ...

"తను.. . తను.... మోసపోయిందా...."

గొణుక్కుంది.

కడుపులో జీవం పోసుకుంటున్న మరో జీవి 'అవునవు'నని జవాబిచ్చినట్లుగా తోచింది నీరజకు

బ్యాంక్‌కు ఎదురుగుండా 'శీలవతి' చిత్రం తాలూకు నిలువెత్తు నాయిక కటవుట్

ఆ కటవుట్‌ను నీరజ పిచ్చిదానిలా తీక్షణంగా గమనించింది

.. .

నీరజ కన్నుల్లో కన్నీళ్ళు లేవు . అర్థంకాని భావం తప్ప .

★ ★ ★ ★

మోడరన్ స్టూడియోస్‌లోని ప్రివ్యూ థియేటర్‌లో 'శీలవతి' చిత్రాన్ని పత్రికేయులకు, పరిశ్రమలోని ప్రముఖులకు, నగర పెద్దలకు, మేధావులకు చూపిస్తున్నారు దర్శకులు రాంచందర్‌గారు

ఇంటర్వెల్‌లో రాంచందర్‌గారికి ఫోను

"హలో డైరక్టర్ రాంచందర్‌గారా . మీరు వెంటనే విజయ హాస్పిటల్‌కు రండి. మీ అమ్మాయి నీరజ నిద్రమాత్రలు మ్రింగింది కండీషన్ యీజ్ వెరీ సీరియస్.... వెంటనే రండి ..'

"ఆఁ!!!' – రాంచందర్‌గారు ఫోన్ దగ్గరే కుప్పకూలిపొయ్యారు అందరూ చుట్టుముట్టారు. పరిస్థితి క్షణాల్లో అర్థమయ్యింది 'శీలవతి' చిత్ర ప్రదర్శన అర్ధాంతరంగా ఆగిపొయ్యింది. రాంచందర్‌గారి కారు హాస్పిటల్‌కేసి పరుగు తీసింది...

ఫ్... - "సారీ సర్. మీ అమ్మాయి నీరజ మరణించింది "

"నీరజా . ఆ పిలుపు హాస్పిటల్ అంతటా వెర్రిగా ప్రతిధ్వనించింది రాంచందర్‌గారు నేలమీద కూలిపోయారు

'ఎంతపని చేశావు తల్లీ నీకేం లోటని ఆత్మహత్య చేసుకున్నావు తల్లీ. చెప్పమ్మా

చెప్పి ' పిల్లవాడిలా కూతురు శవంపై పడి ఏడుస్తున్నారు రాంచందర్‌గారు

'సర్ శవం ప్రక్కన ఈ ఉత్తరం దొరికింది ఈ పుస్తకంలో ఆ పుస్తకం రాంచందర్‌గారు వ్రాసిన 'అబల' అది నీరజ చివరి ఉత్తరం కన్నీళ్ళు తుడుచుకుని రాంచందర్‌గారు ఆ ఉత్తరం చదివారు

నాన్నా !

నేను తప్పు చేశాను నా మనసుకు నచ్చిన ఓ యువకునికి మనసివ్వటమన్న తప్పు చేశాను మనసిచ్చిన వానికి మనసిచ్చిన తర్వాత నాకున్నవన్నీ యిచ్చుకున్నాను నన్ను నేనే అర్పించుకున్నాను అప్పుడు తెలిసింది నాన్నా నేను తప్పు చేశానని నా తప్పుకు ఫలితంగా నా కడుపులో మరో జీవి ఊపిరి పోసుకుంటున్నదని తెలుసుకున్నప్పుడు నే చేసింది యెంతటి తప్పో తెలుసుకున్నాను నాన్నా!

కానీ నాన్నా! ఓ దగుల్బాజీ, ఓ మోసగాడు, ఓ వంచకుడు నన్ను నమ్మించి ప్రేమించినట్లు నటించి – మోసం చేసి పారిపోయినపుడు నేను పిరికిదానిలా ఆత్మహత్య చేసుకోకూడ దనుకున్నాను కానీ – నన్ను కని అల్లారు ముద్దుగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించిన మీరు మీ రచనల్లో, మీ దర్శకత్వంలో వచ్చిన సినిమాల్లో నా జీవితంలో వచ్చిన యిలాంటి సజీవ సమస్యలకు ఆత్మహత్యలే

ప్రభాతసూక్తి

మనిషిని
మనిషిగ చూడు
మానవత్వాన్ని
తెచ్చుకో తోడు!
'మంచి'
మనిషికి నీడ!
'నీడ' లేని
బ్రతుకే చీడ!
మాట
మనుగడకు కోట.. !
బీటలు వారితే
నీటి మూట !

–యస్వీకె మల్లిక్

ఇది జీవితం

పరిష్కార మార్గాలుగా చూపారు అవునా నాన్నా ? పైగా ఆ ముగింపు గురించి నేను మిమ్మల్ని పదే పదే ప్రశ్నించినా ఆ ముగింపే సరైనదనీ మీకు తృప్తి కలిగించినదనీ మీరు చెప్పారు

అందుకే నాన్నా! మీ కూతురు కూడా తన జీవిత సమస్యకు మీరు చూపిన పరిష్కారాన్నే అనుసరించింది నాన్నా శెలవ్

కడసారి నమస్సులతో మీ కూతురు,
నీరజ

ఉత్తరం పూర్తి చేసిన రాంచందర్‌గారు పిచ్చివానిలా అరుస్తూ – కన్నీరు మున్నీరుగా విలపించారు

అమ్మా నీరజా నా కళ్ళు తెరిపించావు తల్లీ సినిమాల్లో, నవలల్లో నేనిచ్చే పరిష్కారాలు వ్యాపారం కోసం తల్లీ పాఠకుల్నీ, ప్రేక్షకుల్నీ ఏడిపించి సొమ్ము చేసుకుంటున్నాము తల్లీ అమ్మా నీరజా! అవి నవలలు సినిమాలు తల్లీ కాని యిది యిది జీవితమమ్మా జీవితం


రాంచందర్‌గారు వెర్రిగా కేకలేస్తూ తన 'అబల నవలను ముక్కలు ముక్కలుగా చించారు

మరుసటి రోజు –

ప్రఖ్యాత రచయిత, దర్శకుడు నిర్మించిన 'శీలవతి' చిత్రానికి రాష్ట్రపతి అవార్డు

ప్రముఖ పత్రికలన్నీ ఈ వార్తను ప్రముఖంగా మొదటి పేజీలో బాక్సులు కట్టి ప్రచురించాయి

అదే పత్రికల్లో ఓ మూల నీరజ ఆత్మహత్య కూడా అతి మామూలుగా ప్రచురింప బడింది □


హార్లిక్స్ మా కుటుంబంలో ప్రతి ఒక్కరికి మిత్రుడు వంటిది - రోజంతా ఆఫీసు పనితో అలసి వచ్చే మా శ్రీవారికి, కాలేజీకి, డాన్సు క్లాసుకి వెళ్ళివచ్చే మా అమ్మాయికి, ఫుట్‌బాల్ హీరో మా అబ్బాయికి. అంతెందుకు, రోజూ మార్కెట్ పని ముగించుకుని ఇంటికి వచ్చాక , నేను కూడా ఒక కప్పు హార్లిక్స్ త్రాగవలసిందే! హార్లిక్స్ మాలో ప్రతి ఒక్కరికి మేలు చేస్తుందని నా నమ్మకం.
మాల్టెడ్ బార్లీ, వెన్నతో కూడిన పాలు, బంగారు వన్నె గోధుమలలోని పోషక శక్తుల మంచితనమంతా చక్కగా రంగరించబడిన హార్లిక్స్ ఎంతో రుచికర మైన పానీయం.
పోషక శక్తిని సమకూర్చేందుకు ఉత్తమ మార్గంగా అందరు నమ్ముతారు. 100 సంవత్సరాలకు పైగా ప్రపంచమంతటా లక్షలాది కుటుంబాలు హార్లిక్స్‌ని నమ్ముకున్నాయంటే ఆశ్చర్యం ఏముంది?
Horlicks
The Great Nourisher
కొత్త సమయం, కొత్త రూపం
మంచి పుష్టికరమైనది
HTD-HMM-8072 TEL

సీరియల్:

జిగి-బిగి

ఎమ్.హరా

(గత సంచిక తరువాయి)

గదిలోని చీకటిని చిమ్మివేస్తున్నది వెలుగు అమ్మాయీ, అబ్బాయి వొకరు నొకరు అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నారు

అప్పుడే గదిలోకి వచ్చిన సూరీడు మందహాసంతో అబ్బాయిని పలుకరించి, తాను తెచ్చిన ఫ్లాస్క్, టిఫెన్ పొట్లాలు టేబుల్ మీద వుంచి, అబ్బాయిగారూ మీరింకా స్నానం చేయలేదా? త్వరగా తెమలండి ఇంటర్వ్యూకి టైం అవుతున్నది అంటూ అమ్మాయి వంక ప్రశ్నార్థకంగా చూస్తూ బయటికెళ్ళిపోయాడు

అతను అన్నపూర్ణ కేఫ్‌లో క్లీనర్ మెట్రిక్ పరీక్షకెళ్ళున్నాడు అతనికి ప్రవేట్ చెబుతున్నాడు అబ్బాయి అవసరమొచ్చినప్పుడు అబ్బాయికి హొటలు నుంచి కాఫీ టిఫెన్లు తెచ్చి యిస్తూ వుంటాడు సూరీడు

రండి కాఫీ తీసుకుందాం అన్నాడు అబ్బాయి

థాంక్స్ టిఫెన్ మీరొక్కరే ఆరగిస్తారా? అవునులెండి ఇంటర్వ్యూకి అటెండ్ కావాలిగా బలంగా వుండాలి కళ్ళని చక్రాల్లా త్రిప్పుతూ నిష్ఠూరంగా అంది అమ్మడు

ఇంతేనా మీరు నన్ను అర్థం చేసుకుంది వస్తుందో రాదో తెలియని బోడి ఉద్యోగం కోసం మీకు దూరమవుతానా? మిమ్మల్ని బాధ పెడతానా? ఇవాళ కాకపోతే రేపైన వస్తుంది ఉద్యోగం మీ తాతయ్యకిప్పుడు బలమైన ఆహారం వైద్యం చేయించక

అతని మాట పెగల్లేదు అనారోగ్యపు తల్లి గుర్తుకు వచ్చింది కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి

మీది చాలా గొప్ప మనసు మిమ్మల్ని అపార్థం చేసుకున్నందుకు క్షమించండి

క్షమిస్తాను మీరు నాకో వరం యివ్వాలి

నేను వరాలు యిచ్చే దేవతను గాదు నా వునికి నాకు తెలుసు దయచేసి నన్ను కించపరచవద్దు'

'మిమ్మల్ని ప్రేమిస్తున్నాను అమ్మాయిగారూ అన్నాడతను ఉద్వేగంగా ఆమెకి దగ్గరవుతూ ఆమె బుగ్గల్లోని సిగ్గు కెంపులై శరీరమంతా ఆవరిస్తున్నది తడబడే స్వరంతో డిటో అబ్బాయిగారు అంటూ కళ్ళు మూసుకుంది

యిక్కడ అబ్బాయిగారు లేరు అబ్బాయి వున్నాడు కళ్ళు తెరవండి అమ్మాయిగారు

యిక్కడ అమ్మాయిగారు లేరు అమ్మాయి వుంది అంటూ ఫక్కున నవ్వేసింది అమ్మడు

వాళ్ళిద్దరూ ప్రేమ వ్రతం మనస్ఫూర్తిగా చేస్తూంటే అప్పుడే మేడ మీదికి వచ్చిన పరందాముడి నీడ గది గడపని దాటి లోపలికి వచ్చింది పిలువని పేరంటానికి వచ్చిన ఆ నీడని చూసి ప్రేమ మైకంలో వున్న అబ్బాయి కంగారుపడ్డాడు

రండి పరందాముడుగారూ రండి మీరింకా రాలేదని బెంగపెట్టుకున్నాను హేళనగానే ఆహ్వానించింది అమ్మడు

తన ఇంటి వోనర్ అమ్మడికెలా తెలుసని తెల్లబోయాడు అబ్బాయి పత్తేదార్‌లా పరంధాముడు వస్తాడని వూహించింది అమ్మడు

గదిలోకి వచ్చి ఆపాదమస్తకం వాళ్ళిద్దర్ని పరీక్ష చేస్తూ అంతా సవ్యమేనా అంటూ గురిపెట్టి అమ్మడు మీదికి బాణం వదిలాడు పరందాముడు

అపసవ్యంగా వున్న మీ జంద్యం మినహాయించి యిక్కడ అంతా సవ్యమే కిసుక్కున నవ్వింది అమ్మడు

నేను గమనించలేదు సుమీ అంటూ జంధ్యాన్ని సవ్యం చేసుకు అంతా ఆదుర్దా భయం మీ బాబయ్యతో వ్యవహారం చిన్న పొరపాటు జరిగినా తద్దినం పెట్టేస్తాడు నువ్వెంత మారిపోయావు సౌభాగ్యం ఎప్పుడో నీ చిన్నప్పుడు పదిహేనేళ్ళ క్రితం గుంటూరులో చూశాను బాగా మారిపోయావు నాలాగే నీకూ వయసు పెరిగి వుంటుంది గుంటూరులో అంతా క్షేమమేనా కుశలప్రశ్నలు వేయసాగాడు

సౌభాగ్యవతి వస్తుందని ఉబయం చెప్పడం వల్ల అమ్మడిని సౌబాగ్యంలా భావించాడు పరందాముడు

చల్లని మనసుగల మీరున్నంత కాలం వూటీని మైమరిపించిన గుంటూరు, మీరిక్కడికి రాగానే ఎండలతో మండిపోతున్నది యిప్పుడక్కడంతా క్షామమే

బంతి ఆట ఆడుతున్న వాళ్ళిద్దరి మధ్య నిల్చున్న అబ్బాయి మెదడు చురుగ్గా పనిచేసింది అమ్మడు విసిరిన బంతిని అందుకుని అన్నాడు

సార్ మీరు వెంటనే గుంటూరు వెళ్ళాలి గత పదిహేనేళ్ళుగా ఎండలతో మండిపోతున్నది

నేనిక్కడ ఉంటే ఎండాకాలంలా వుందా? అయితే వెళ్తాను అంటూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ నిష్క్రమించాడు పరందాముడు

తదుపరి నవ్వుతూ, తుళ్ళుతూ, ప్రేమించుకుంటూ, కాఫీ టిఫెన్ల కార్యక్రమం పూర్తి చేశారు అమ్మడూ, అబ్బాయి

అంతలో ఎవరండీ యింట్లో అంటూ గదిలోకి ప్రవేశించారు యిద్దరు యువకులు

నా పేరు చిరంజీవి వీడి పేరు సత్రకాయ నా భుజం ఫ్రెండ్ వచ్చే ఆదివారం ఉద్యోగ యాగం చేయాలనే దీక్షతో చందాల కోసం వచ్చాం అంటూ అమ్మాయీ, అబ్బాయిల ముఖ కవళికలని పరిశీలించసాగాడు చిరంజీవి

ఈ యాగం గురించి నేనెప్పుడూ వినలేదే అంది అమ్మడు

ఉద్యోగ యాగం చేసిన వూళ్ళో పుట్టగొడుగుల్లా ఉద్యోగాలు పుట్టుకొస్తాయనీ, నిరుద్యోగ సమస్య లేకుంటే దేశాన్ని ఏలడం కష్టమని బ్రిటిష్‌వాడు ఉద్యోగ యాగ తాళపత్ర గ్రంథాన్ని పిరంగులతో కాల్చిపారేశాడు

జరిగిన కథ–3 ..యర్ క్లర్క్స్ పరీక్ష రాయడానికి వెళుతున్న అమ్మాయికి అదే పరీక్ష రాయడానికి వెళుతున్న బక్కపాలెం అబ్బాయి ఎదురుపడి పరీక్ష సెంటర్‌కి దారి అడిగాడు అతనిని తప్పుత్రోవ పట్టించి పరీక్షకి వెళ్ళిన అమ్మాయికి పరీక్ష కాన్సిల్ అయ్యేటప్పటికి బక్కపాలెం అబ్బాయిని మోసం చేసినందుకు తనకి తగిన శాస్తి జరిగిందని అనుకుంటుంది 'ప్రజాసేవ కంపెనీ నడుపు తూంటాడు ఉబయానందం నాలుగు పుష్కరాలు దాటినా బ్రహ్మచారిగానే ఉన్న ఉబయం తన ఏనతల్లి మనుమరాలు సౌబాగ్యవతిని చేర తిసాడు సౌబాగ్యానికి పెళ్లి చేసి ఆమె బర్తని పత్తేత వేసుకోవాలని ఉబయం కోరిక సూర్యనారాయణ మనుమరాలు అమ్మాయి బి ఎ పాసై ఉద్యోగాన్వేషణలో ఉంది సౌబాగ్యం చిరంజీవి ప్రేమించుకున్నారు అమ్మాయి అబ్బాయి ప్రేమించుకున్నారు సౌబాగ్యవతి పేరుతో అబ్బాయి రూముకి వెళ్ళిన అమ్మాయి అతనికి ఉబయానందం పథకం వివరించింది అంతా విన్న అబ్బాయి ఇదంతా తన నాన్న ఆడుతున్న నాటకమేనని తన కథంతా చెప్పసాగాడు

సీమ టపాకాయలా ప్రేలాడు చిరంజీవి

కథలు చెప్పకండి కాలి బూడిదైన యాగ వివరాలు మీకెక్కడ దొరికాయి లా పాయింట్ లాగాడు అబ్బాయి

చిరంజీవి నీళ్ళు నములుతూ వాళ్ళిద్దరి వంక చూస్తూ అన్నాడు

భూలోకంలో ఉద్యోగాలు దొరకవని, ఆకాశ లోకం అందదని, పాతాళ లోకంలో జాబ్ సంపాదించాలని దురాశతో మా పెరట్లో తవ్వడం ప్రారంభించాను అప్పుడు నాకు బూడిద దొరికింది ఆ బూడిదని మా సత్రకాయ లిబొరెటరీలో అక్షరాలుగా మార్చాను యిప్పుడీ యాగం తలపెట్టాను చందా తొందరగా యివ్వండి యింకా చాలా కొంపలు తిరగాలి

అయితే పదండి మేంకూడా వస్తాం' అంటూ లేచాడు అబ్బాయి

'మేమే మీకు చందాలం రూపాయల కట్టలం మేంకూడా నిరుద్యోగులమే పదండి మేంకూడా వస్తాం తిలా పాపం తలా కాస్త అన్నారు అంటూ అమ్మడు గాత్రం అందుకుంది

మీరిద్దరూ కలిసే వస్తారా? నిజంగా మీరిద్దరూ కలిసే వస్తారా? హద్దూ పొద్దూ లేని ఆనందంతో ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి

మీ కెందుకింత అనుమానం మేమిద్దరం కలిసే వస్తాం అంటూ బృందగానం చేశారు అమ్మాయీ, అబ్బాయి

నన్ను సౌభాగ్యవతి పంపింది అమ్మడు గురించి ఆందోళన పడుతున్నది ఆమె ఆతృత చూడలేక నేనిలా వచ్చాను యిక్కడ షెట్టింగ్ సీన్ వుంటుందని, ఎందుకేనా మంచిదని ఈ సత్రకాయని తోకలా తగిలించు కున్నాను వీడేమో వస్తూ దులా హోటల్లో ఆరు రూపాయల టిఫెన్ వూదేశాడు సౌభాగ్యం దగ్గర ఆరు రూపాయలు వసూలు చేసుకోవాలి ఆమెకి ఎంత కావాలంటే, అంత డబ్బు యిస్తాడు ఉభయం అది వేరే టాపిక్ అనుకోండి అసలు విషయంలోకి వస్తున్నాను అమ్మాయిగారు ఆపదలో వున్నారా? లేదా? అని తెలుసుకోవడానికి రూంలోకి ప్రవేశించడానికి నోటికి వచ్చినట్లు వాగాను

చిరంజీవి ఢోరణికి అడ్డువస్తూ అన్నాడు అబ్బాయి

యింతకీ అమ్మాయిగారు ఆపదలో వున్నారా? లేదా?

అబ్బాయిగారి అండ వుండగా అమ్మాయిగారికి ఎటువంటి ఆపద రాదు

అబ్బాయీ, అమ్మాయిల ముసి ముసి నవ్వుల ముసురు మేనుకి సోకగానే మీ – మా ప్రేమలు సుఖాంతం కావాలంటే అంటూ అందుకున్నాడు చిరంజీవి

8

బాబయ్యగారూ మీరు చెప్పినట్లే తూచి తూచి అసలు మొగ్గనేది లేకుండా నటించి అబ్బాయిగారిని యింటర్వ్యూకి వెళ్ళకుండా చేశాను అంటూ యింట్లోకి ప్రవేశించింది అమ్మడు


అప్పటివరకు అదేపనిగా ఎడమపాదం దురదపుట్టగా. అమ్మడు తెచ్చే శుభవార్త కోసం ఎదురు చూస్తూ, ఎందుకైనా మంచిదని ప్రయాణానికి సిద్ధమై వీధి గుమ్మం దగ్గరే తచ్చాడుతున్నాడు ఉభయం ఆమె మాటలకి ఆనందంగా అన్నాడు

వెరీగుడ్ అబ్బాయి ఇంటర్వ్యూకి వెళ్ళలేదా?'

అతను అసభ్యంగా ప్రవర్తించ లేదుకదా అంటూ అమ్మడి వీపుని ఆప్యాయంగా నిమిరింది సౌభాగ్యవతి

అసలు అతనికి సభ్యతే తెలియదు ది గ్రేట్ కాలేజీ మాజీ బ్యూటీని నన్ను దారుణంగా ఇన్సల్ట్ చేశాడు అతని ముత్తాతకి ముత్తాత తాత ప్రవరాఖ్యుడని నా అనుమానం నన్ను అంటరాని దానిలా చూశాడు చట్టరీత్యా అతను నేరస్తుడు గుక్క త్రిప్పకుంది అమ్మడు

అంతేకదా నువ్వేమీ తొందరపడలేదుగా అన్నాడు ఉభయం ఆదుర్దాగా



జిగిబిగి

ఆ పుస్తకాల పురుగుకోసం వరూధిని వేషం వేయలేదు నాకేం అపాయం జరగదని రౌడీలని తోలేశాను అతనేమో యించక్కా రెండు గంటలసేపు ఏకబిగిని స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు అతి వివరంగా ఏకరువు పెట్టేసరికి నా తల గిరగిరా తిరిగింది

ఆ మైకంలో నువ్వేమీ పారేసుకోలేదుకదా!

అబ్బాయి రూంలోకి వెళ్తూనే ఎందుకైనా మంచిదని నా మనసుని, వయసుని చీరె కొంగులో మూటగట్టాను కుచేలుడు దాచిన కానుకని చేజిక్కించుకున్నాడు శ్రీ కృష్ణుడు నన్ను దోచుకోలేని అబ్బాయిని మాటలతో మభ్యపెట్టి రూంలో కట్టేసి యిలా చక్కా వచ్చేశాను

బేష్షైన పని చేశావు మొగ పీనుగుల మాట నమ్మకూడదు నమ్మినా మనసివ్వకూడదు మనసిచ్చినా శరీరానికి శ్రమ కలగనీయకూడదు శరీరానికి శ్రమ యిచ్చినా బయట పడకూడదు చీరెలు మార్చినంత సులభంగా తమ చిత్తాన్ని మార్చుకోగల శక్తిని స్త్రీలకి మాత్రమే వరంగా యిచ్చాడు భ ంతుడు యిప్పటికే చాలా ఆలశ్యమయింది ఈ చీరెని మార్చేసి అతన్ని స ంగా మరిచిపోతల్లీ అసలు నువ్వెక్కడికీ వెళ్ళలేదు ఏం జరగ లేదు అం మాయ మిథ్య యిప్పుడు నేనిచ్చే రెండు వేలే యాదార్థం మీ తాతయ్యని డాక్టర్‌కి చూపించమ్మా అంటూ మాటలగారడీ చేస్తూ ఆమెకి డబ్బిచ్చాడు ఉబయం

అమ్మడు తన పోర్షన్‌లోకి వెళ్తూ సౌభాగ్యం అని పిలిచింది సౌబాగ్యవతి ఆమెని అనుసరించింది

ఉభయం కింకర్తవ్యమని సంస్కృతంలో ప్రశ్నించుకుని తెలుగులో తెలివిగా ఆలోచిస్తూ ఆ గదిలో తిరగసాగాడు రాటన కట్టేసిన బర్రెలా గిరగిరా గుండ్రంగా తిరగసాగాడు అదే సమయంలో వచ్చాడు అబ్బాయి వస్తూనే అన్నాడు

ఉబయానందం గారికి నమస్కారం నా పేరు అబ్బాయి మాది బక్కపాలెం

నువ్వేనా బాబూ ప్రజాపతి అబ్బాయిగారివి అంటూ ఆశ్చర్యంగా ఆందోళనతో ఆనందపడ్డాడు ఉబయం, అబ్బాయి దారి వెతుక్కుంటూ తనింటి కెందుకు వచ్చాడో పాలుబోక

క్షమించండి నాకు జన్మ నిచ్చింది వారేగానీ వారి అబ్బాయినని చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్నాను ఆయన్ని తండ్రిగా గౌరవించే బయం, బక్తి నాకు లేవు

అతని మాటలకి గుద గుదలాడుతున్న సంతోషాన్ని వ్యక్తం చేయలేక కూర్చో బాబూ కూర్చో-- అంటూ కుర్చీని దులిపాడు ఉభయం అవశ్యంగా కావలసిన పనికి అవకాశాలు అరుదుగా లబించవు

సౌబాగ్యవతి సుఖంగా యింటికి చేరిందా? ప్రొద్దున్నే మీ ముఖం చూసి వుంటుంది అందుకే రౌడీ గండం యిట్టే తప్పి పోయింది అంటూ తన సంభాషణ పొడిగించాడు అబ్బాయి

యిప్పుడే వచ్చింది అంతా చెప్పింది మీకు కృతజ్ఞతలు కాకితో పంపించడం సబబుకాదని నేనిప్పుడే బయలుదేరు తున్నాను అంతలో నే తమరు వచ్చారు

తండ్రి లాంటి వారు నన్ను బహువచనంలో సంబోదించకండి అబ్బాయీ అని పిలవండి చాలు యితరుల సొమ్ముని మట్టిగెడ్డవలె చూడాలన్నారు సౌబాగ్యవతి నా రూంలో జేబురుమాలు పారేసుకుంది యిదిగో తీసుకోండి అంటూ జేబులోంచి రుమాలు తీశాడు అబ్బాయి

దాన్ని అందుకుంటూ అన్నాడు ఉబయం అరవైపైసల రుమాలు వాపసు యివ్వడానికి మా యిల్లు వెతుక్కుంటూ రావాలా బాబూ!

రత్నం మానవులని వెతకదు జనమే రత్నం కోసం వెతుకుతారు సౌబాగ్యవతి రత్నం లాంటిది ఆమె కోసం – మాటలు మింగేసి తలని వంచేశాడు అబ్బాయి

అదే సుముహూర్తంలో సౌబాగ్యవతిని ఉభయానందం పోర్షన్‌లోకి తరిమేసింది అమ్మడు బిత్తర చూపులతో అబ్బాయిని చూడసాగింది సౌబాగ్యం

చిరంజీవి సౌబాగ్యవతీ క్షేమంగా యింటికి చేరావా? తోడుగా వస్తానంటే అన్నా చెల్లెళ్ళని అపార్థం చేసుకునే ఈ పాడు లోకానికి దడిచి వద్దన్నావు ప్రొద్దున్న చామన చాయ వెలుగులో నిన్ను చూశాను అప్పుడే మర్చి పోయాను మతిమరుపు గొప్పవారి లక్షణమైనా నిన్నిప్పుడు పోల్చుకున్నాను `నువ్వు పారేసుకున్నది పెద్దల అనుమతి లేకుండా దాచుకోవడం అవివేకమని నాన్నగారికి యిచ్చాను

సౌబాగ్యవతి వంక స్నేహంగా చూస్తూ చెవిలో నూరిపోసిన చిరంజీవి నాటకాన్ని రక్తికట్టిస్తున్నాడు అబ్బాయి ఆమె చివాల్న ఉబయం చేతిలో నలుగుతున్న రుమాలు అందుకుని అబ్బాయి కిచ్చి తల వంచేసింది

థాంక్స్ నీతో చాలా మాట్లాడాలి చిరంజీవి దేవాలయానికి అదే మార్కండేయస్వామి టెంపుల్‌కి రాగలవా? నిర్భయంగానే అడిగేశాడు అబ్బాయి

మా మామయ్య యిష్టం అంటూ గునిసింది సౌబాగ్యం

నాన్నగారు కాదనరు బరోసా యిచ్చాడు అబ్బాయి

సాయంకాలం వస్తాను అంటూ చివ్వుమని యింట్లోకి పరిగెత్తింది అబ్బాయి కూడా బైటి కెళ్ళాడు

తన ప్రమేయం లేకుండా తన కంటి ముందే జరుగుతున్న షూటింగ్ చూస్తున్న రైటర్ కమ్ డైరక్టర్‌లా వున్నాడు ఉబయం

మగ గుఱ్ఱానికి ఆడగుర్రాన్ని చూడనంతవరకే మోహం పుట్టదు తొలి పొద్దులో అమ్మడిని చూసిన అబ్బాయి, సౌబాగ్యవతిని అమ్మడుగా పోల్చుకున్నాడు పుస్తకాల పురుగుకి పరాకు వుండటం సహజం అమ్మాయి తన పేరు సౌబాగ్యవతని చెప్పడం వల్ల అబ్బాయి తనింటికి వచ్చాడు కంటికి నదురుగా కనబడిన సౌబాగ్యవతిని ప్రేమించేస్తున్నాడు సౌబాగ్యం కూడా వో కే చేసింది అంటే దానికి కూడా నచ్చివుంటాడు నిన్న తన ఉపన్యాసం వ్యర్థం కాలేదు

ముందీ అమ్మడిని ఈ వూరినుంచి తరిమెయ్యాలి ఉద్యోగాలు పుష్కలంగా దొరుకుతాయని ఆమెని హైదరాబాద్ పంపాలి ఆడగాలి తగలగానే వూగిస లాడుతున్న అబ్బాయిని సౌబాగ్యవతికి అంటగట్టాలి తండ్రీ కొడుకుల మధ్య వైరం పెంచాలి ప్రజాపతిని మోసం చేసి అబ్బాయిని దత్తత చేసుకుని తద్దినాలు పెట్టించు కోవాలి

ఈ విదంగా పరిపరి విదాల ఆలోచిస్తూ యింటి నుంచి బయటపడి బక్కపాలెం వెళ్ళే బస్సెక్కాడు ఉబయానందం

9


గవర్నమెంట్ ఆసుపత్రిలో మీ తాతయ్యని యిన్‌పేషంట్‌గా అడ్మిట్ చేయించి, నా రికమండేషన్‌తో అన్ని టెస్టులు వుచితంగా చేయించి వైద్యం చేయడానికి వారానికి రెండు వందలివ్వాలి డబ్బివ్వకపోతే ఎర్ర నీళ్ళూ, తెల్ల బిళ్ళలతో మీ తాతయ్య అనారోగ్యం ఆరోగ్యంగా వుంటుంది యికపోతే మీరు టెస్టులు నేను చెప్పిన చోట చేయించి మా బావమరిది నర్సింగ్ హోమ్‌లో అడ్మిట్ చేయిస్తే రోజుకి పాతిక వసూలు చేస్తాను జబ్బు తగ్గినా తగ్గకపోయినా మీ తాతయ్యని బ్రతికిస్తాను ఎక్కడైనా మందుల ఖర్చు అదనం నర్సూ, ఆయాల మామూళ్ళ గురించి నేను వేరే చెప్పవలసిన పని లేదు యిక మీ యిష్టం అన్నాడు డాక్టర్ వ్యాపార సరళిలో

ముందు తాతయ్యగారిని పరీక్ష చేసి రోగ నిర్ణయం చేయండి వైద్యం గురించి ఆ తరువాత తాపీగా చర్చిద్దాం అన్నాడు అబ్బాయి అసహనంగా

నాడి చూసి వైద్యం చేయడానికి నేనేం డిగ్రీ లేని నాటు వైద్యుడిని కాదు దేశంకాని దేశంలో డొనేషన్ల కాలేజీలో అయిదేళ్ళు చదువుని పదేళ్ళు చదివాను మీ తాతగారికి బ్లడ్ యూరిన్, ఎక్సరే వగైరా టెస్టులు చేయించాలి స్పెషలిస్టుల్ని కన్సల్ట్ చేయాలి అప్పుడుగాని రోగ నిర్ణయం చేయలేను

మరింత పొడుగవండి

స్త్రీలకూ,
పురుషులకూ కూడా



కేవలం 2 వారాల తర్వాతనే మీ పొడవు కొలిచి చూసుకోండి. అది పెరిగిందని మీకే తెలుస్తుంది— ఆ పెరుగుదల 15 సెం.మీ. వరకూ ఉండొచ్చు. గుర్తుంచుకోండి, ఫలితాలు మీకు సంతృప్తి కలిగించకపోతే, మీ డబ్బు వెంటనే వాపసు చేస్తాం, ప్రశ్నలేమీ అడగం.

శ్రమ కలిగించే వ్యాయామాలు అవసరం లేదు. ఎలివేటర్ షూస్ లాంటి కృత్రిమ సహాయకాలతోగాని, మరే ఉపకరణాలతోగాని పనిలేదు.

న్యూ హైట్ కార్యక్రమం శరీరమంతటికీ తిరిగి ఉత్తేజం కలిగించే, ప్రత్యేకమైన స్విస్ సూత్రం మీద ఆధారపడ్డ శాస్త్రీయ పద్ధతి.

న్యూ హైట్ స్త్రీలకీ, పురుషులకీ కూడా ఎంతో బాగా పనిచేస్తుంది. ఈ విషయం యూరోప్ అంతటా వేలాదిమంది విషయంలో ఋజువైంది. ప్రతిరోజూ కొద్ది నిమిషాలపాటు ఈ కార్యక్రమం లోని సూచనలను ఒకదాని తర్వాత ఒకటిగా అనుసరించండి.


మీ ప్రస్తుత వయస్సు ఎంతైనా సరే, మీలో మంచి మార్పు కనబడుతుంది!

ఈ రోజే వాడి చూడండి

నిశ్చయమైన ఫలితాలు లేదా మీ డబ్బు వాపసు!

ఆత్మ విశ్వాసంతో నిటారుగా ఉండే వ్యక్తి సఫలతకు ప్రతిరూపం—మగ అయినా సరే, ఆడైనా సరే పొడవైన ఆకృతి ఆడవాళ్లనిగాని, మగవాళ్లనిగాని మరింతగా ఆకట్టుకొంటుందని పరిశోధనలో తేలింది. కేవలం సరైన ఆకృతి లేకపోవడంవల్ల జీవితంలో ఆనందాలెన్నింటినో కోల్పోతున్నారా? నిస్పృహ చెందకండి. మీ వయస్సు ఎంతైనా సరే, మీ ప్రస్తుత స్థితి ఏదైనా సరే—మీకో శుభవార్త ఇదుగో!

విఫలం నుంచి సఫలానికి కేవలం 14 రోజుల్లో



న్యూ హైట్ ఉపయోగించినవారి నుంచి ప్రశంసా పరంపర

"న్యూ హైట్ వాడటం వలన నాకు మంచి ఫలితాలొచ్చాయి నా పొడుగు రోజుకు రోజు పెరుగుతోంది నా పొడుగును పెంచేలా చేసినందుకు మరొక్కసారి మీకు నా ధన్యవాదాలు"
జె బి లుధియానా

"నా వయసులోవున్న చాలా మంది మిత్రులు నాకన్న 5 నుంచి 6 అంగుళాలు పొడుగ్గా వున్నారు మరి నేను న్యూ హైట్ వాడి 3¼" పొడుగు అయ్యానిక"
ఆర్ ఎస్ హైదరాబాదు




న్యూ హైట్ కార్యక్రమం కొన్ని శాస్త్రీయ వ్యాయామాల సహాయంతో మరింత పొడుగు పెరగడం, ఆకృతిని సరిచేసుకోవడం అన్నదాని మీద ఒక సూచనల పుస్తకం. అది మందు గాని, మాకు గాని కాదు.

న్యూ హైట్
మెహతా మహల్, 15 మాథ్యూ రోడ్, బొంబాయి 400 004.

ఈ రోజే కూపన్ పోస్టు చేయండి

న్యూ హైట్ మెహతా మహల్, 15 మాథ్యూ రోడ్, బొంబాయి 400 004 NH 201-TEL SW-38

దయచేసి నాకు న్యూ హైట్ పంపండి ఫలితాలు నాకు పూర్తిగా సంతృప్తి కలిగించకపోతే 14 రోజుల్లోగా ఈ కార్యక్రమాన్ని తిప్పి పంపితే, వెంటనే డబ్బు వాపసు (ప్యాకింగ్, పంపకం మొదలైన ఖర్చులు మినహాయించి) పంపుతారని గ్రహించాను.



దయచేసి తగిన గడిలో ☑ టిక్కు పెట్టండి.

☐ వి పి పి ద్వారా పంపండి సరకు అందిన మీదట పోస్టుమన్‌కు రూ 94/— చెల్లిస్తానని మాట ఇస్తున్నాను

☐ రిజిస్టర్డ్ పోస్టు పార్శిల్ ద్వారా పంపండి రూ 94/— డ్రాఫ్టు/ఐ పి ఓ /ఎమ్ ఓ ద్వారా పంపుతున్నాను దాని నంబరు... .. తేదీ... ... ... (బుల్ వర్కర్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి చెల్లించవలసినది)

పేరు... ... ...

చిరునామా ... ...

... ... పిన్‌కోడ్... ... ... సంతకం ... ...

జిగిబిగి

అలోపతి వైద్యం అంటే అల్లాటప్పా కాదు అంటూ కుర్చీలో కూర్చునే డాన్స్ చేయసాగాడు డాక్టర్

అమ్మడు పంక చూశాడు అబ్బాయి అప్పటికే ఆమె కూడికలు హెచ్చవేతలతో తాతయ్య వైద్యానికి ఖర్చెంతవుతుందో అంచనా వేస్తున్నది

అబ్బాయి అమ్మాయిని పెళ్ళాడబోతున్నాడని తెలియగానే సూర్యనారాయణ గారి ఆరోగ్యానికి రెక్కలు వచ్చాయి ఆనందం ఆయనలో వెల్లువలా పొంగేసరికి అనారోగ్యం పూచిక పుల్లలా కొట్టుకుపోయింది అసలాయన బెంగంతా అమ్మడి బద్రత గురించే అబ్బాయి అండలో అమ్మడు సుఖంగా వుంటుందని ఆయన సంతృప్తిగా వున్నారు

నాకేం రోగంలేదు నిక్షేపంగా వున్నాను వేళకింత నాలుగు మెతుకులు తింటే చాలు అంటూ అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా సూర్యనారాయణ గారు గింజుకుంటూనే వున్నారు తాతయ్యా నువ్వూరుకో అంటూ ఆయన మాటల్ని కొట్టిపారేస్తున్నది అమ్మడు

మీకు రోగం వుందో లేదో నేను చెప్పాలి బ్రతికి వున్నట్టు గెజిటెడ్ ఆఫీసర్ సర్టిఫికెట్ యిస్తే చెల్లుతుంది డిసీజ్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్ డిగ్రీ వున్న డాక్టరే యివ్వాలి అది రూల్ మొన్నటికి మొన్న ఓ పెద్దాయన తనకేమీ జబ్బు లేదని నీలిగాడు ఆయన నలుగురు కొడుకులు చందా వేసుకుని నాలుగు వందలు నాకిచ్చి వైద్యం చేయమన్నారు నా స్వహస్తాలతో ఆ ముసలాయన నోట్లో వొకే వొక మాత్ర వేశాను అయిదు నిముషాల అనంతరం 'నారాయణా నారాయణా అని కేకలు వేస్తూ తండ్రిని మోసుకుపోయారు నలుగురు కొడుకులు అంటూ వొక్క క్షణం ఆగి తన గుండెని తడుముకున్నాడు డాక్టర్

ఆ ముసలాయన చచ్చిపోయాడా డాక్టర్ అతి అమాయకంగా ప్రశ్నించింది అమ్మడు

మీరు అడగకపోయినా చెప్పవలసిన బాధ్యత నాపై వుంది నేనిచ్చిన మందువల్ల ఆ ముసలాయన 'హరీ అన్నాడని నా వైద్యాన్ని శంకించకండి ఆయన మరణానికి కారణం నేను కాదు కల్తీ మందు నేనిచ్చిన మాత్రలో సెంట్ పర్సెంట్ కల్తీ వుంది భక్త శబరిలా ప్రతీ మాత్రా, క్యాప్సిల్, ఇంజక్షన్ వగైరాలు ఎంగిలిచేసి పేషంట్ కివ్వాలంటే డాక్టర్‌కెంత కష్టమో మీ వూహకి అందదు అందుకని అటువంటి కష్టం రాకుండా మా మావ చేత మందుల కంపెనీ పెట్టించాను నా స్వంత మందులతో నా స్వంత వైద్యం చేస్తాను యిప్పటికే చాలాసేపు వాగాను మీ నిర్ణయం చెప్పారుగాదు అంటూ ఆయాసపడుతూ ఆశగా చూడసాగాడు డాక్టర్



అంతలో కొంపలు మునిగినట్టు ఇంజక్షన్ రెడీ సార్ అంటూ ఎక్కుపెట్టి వదిలిన బాణంలా వచ్చాడు కాంపౌండర్

నాకు ఇంజక్షన్ వద్దు వీడి వైద్యం వద్దు నన్నిలా బ్రతకనీయండి అని కేకలేస్తూ తుపాకీ గొట్టం నుంచి వెలువడిన బులెట్‌లా బయటికి పరిగెత్తారు సూర్యనారాయణగారు 'తాతయ్యా' అంటూ ఆయన వెంటపడింది అమ్మడు 'అమ్మడూ' అంటూ ఆమె కొంగు పట్టుకున్నాడు అబ్బాయి

నా పేషెంట్ పేషెంట్ అంటూ మారం చేస్తున్న డాక్టర్‌ని గదమాయించినట్టు మీరిలా పేషంట్స్ కోసం బెంగెట్టుకుని ఆరోగ్యం చెడగొట్టుకుంటే మీకు వైద్యం చేయడానికి నాకు డిగ్రీ లేదు నన్ను హంతకుడిలా మార్చకండి మీ గుండె, బి పీ రేసుగుర్రాల్లా పరుగెడుతున్నాయి అంటూ గబగబా ఆయనకి ఇంజక్షన్ చేయబోయి తానే చేసుకున్నాడు కాంపౌండర్

అమ్మడూ నాకేం ఫరవాలేదు నేను బాగానే వున్నాను ఈ రోజుతో నా బెంగ తీరింది కాసేపు మీరిద్దరూ కులాసాగా తిరిగిరండి అన్నారు సూర్యనారాయణ గారు ఆయన నేత్రాలు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి

మీ మనుమరాలి గురించి వర్రీ పడకండి అంటూ ఆయన చేయి పట్టుకుని అభయమిచ్చాడు అబ్బాయి

తాతయ్యా అంది ఆర్ద్రంగా అమ్మడు

ఆయన వాళ్ళిద్దరి భుజాలపై చేతులు వేసి ఆప్యాయంగా నొక్కారు

అమ్మడు మనసు తేలికపడింది అబ్బాయి ఆనందం దూదిపింజలా ఎగిరింది

ఫుట్‌పాత్ కార్నర్‌లో జరుగుతున్న రాజకీయ చర్చలో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి అతి ఉత్సాహంగా వెళ్ళారు సూర్యనారాయణ గారు

అమ్మడూ, అబ్బాయి కబుర్లు చెప్పుకుంటూ నడుస్తుంటే చెట్టాపట్టాలేసుకుని ఎదురొచ్చారు చిరంజీవి, సౌభాగ్యవతి

ప్రేమ జంటలు యదేచ్ఛగా ప్రేమించుకుంటూ పార్కులో చాలాసేపు కాలక్షేపం చేశాయి

10

ప్రజాపతి యింటి గడపలో కాలు పెట్టే వేళకి అక్కడి వాతావరణం ఉభయానికి అనుకూలంగా వుంది

పన్నెండో వార్డులో తవ్వించిన బావి గురించి తర్జన భర్జన పడుతున్నారు ప్రజాపతీ, పంచాయితి క్లర్క్ దానయ్య

అసలేం జరిగిందంటే పన్నెండో వార్డులో మంచినీళ్ళ బావి పడదని హెల్త్ డిపార్ట్‌మెంట్ ఘోష పెడుతున్నా వినకుండా అక్కడే పదివేలతో బావి తవ్వించాడు ప్రజాపతి ఆ బావిలో బట్టలు వుతకడానికి కూడా పనికిరాని నీళ్ళు పడేసరికి, పదివేలు కక్కమని ఆయనకి తాఖీదు పంపారు ఇనస్పెక్షన్ అదికారులు

యిదంతా అపోజిషన్ కుట్ర వాళ్ళ దగ్గర డబ్బు తిన్న ఆరోగ్యశాఖ మన బావిలో నీళ్ళు త్రాగడానికి అయోగ్యమని ధృవపరిచింది నన్ను అన్ పాపులర్ చేయడానికి అపోజిషన్ వారి పన్నాగమే యిది రోషంగా ఆయాసపడుతూ మాత్రలు వేసుకుంటూ అంటున్నారాయన

తమరెంత ఆయాసపడినా పంచాయితి డబ్బు పదివేలు కట్టక తప్పదు. సన్నాయి వూదాడు దానయ్య

పది కాదు పాతిక వేలు కడతాను మన పార్టీ జండాలు ఎగురుతున్న పన్నెండో వార్డులో మంచినీళ్ళ బావి లేదంటే మనకెంత నామర్దా పైగా ఎలక్షన్ టైంలో ఆ వార్డులో మంచినీళ్ళ బావి తవ్విస్తానని ప్రామిస్ చేశాను నా వాగ్దానం భంగమయింది ఎంత అప్రదిష్ట మనం తవ్వించిన బావిలో నీళ్ళు కొబ్బరి నీళ్ళలా వున్నాయని సర్టిఫై చేయమను పదికాదు పాతిక వేలిస్తాను అని విపరీతంగా వాపోతూ, అవమాన భారంతో, భారంగా వున్న తలని ఎక్కడ పెట్టుకోవాలో తెలియక తెగ యిదైపోతున్నాడు ప్రజాపతి

సర్పంచ్ గారికి నమస్కారం మీరేమీ అనుకోనంటే నాదో చిన్న వుచిత సలహా ఆ బావి నీళ్ళతో పప్పు వుడుకుతుందని మన పార్టీ ప్రజల దగ్గర

వరకట్నం మొదలైన వాటిని గురించి అక్కడ సంబాషణ మొదలైంది అని చెప్పుకోవటం కన్నా ఆ తరువాత జరిగిన సంఘటనలే ఇక్కడ ముఖ్యం

★ ★ ★ ★

రెండు రోజులు గడిచాయి ఆ రోజు రామం ఆఫీసుకి అతని పేరు మీదుగా లేఖ వచ్చింది విప్పి చూసాడతను ముద్దొచ్చే గుండ్రటి అక్షరాలో వుంది లేఖ వచ్చింది సీత నుంచి – రామానికి అతడు చదవటం ప్రారంభించాడు ఆశ్చర్యంతో, ఆనందంతో

రామంగారికి

నమస్తే మీతో ఒకసారి మాట్లాడాలి '–' తేదీ సాయంత్రం పార్కుకి రాగలరా? ప్లీజ్

మీ,

సీత

తేరుకుని కొద్ది క్షణాల తర్వాత ఆ రోజు తేదీ చూసాడు రామం రెండూ ఒక్కటే!

సాయంకాలం అయ్యింది

పార్కులో నిలబడ్డ రామానికి భువనమోహనంగా ఎదురైంది సీత అని అంటే దాంట్లో అతిశయోక్తి ఏమీ లేదని నిరామా టంగా చెప్పవచ్చును

అలా కూర్చుందామా! అడిగింది సీత

రండి

మౌనంగా సమయం గడిచింది వారిద్దరి మధ్యా కొన్నిక్షణాల పాటు

చెప్పండి గడ్డి పరకను త్రుంచుతూ అన్నాడు రామం, సంబాషణకు నాందీ వాచకం పలుకుతూ నిశ్శబ్దాన్ని బేదిస్తూ

సీత తలెత్తి చూసింది

ఐ హేట్ యూ ఐ హేట్ యూ రామం తడబాటు లేకుండా సూటిగా వచ్చిందా మాట

మిన్ను విరిగి మీద పడ్డట్టు అయ్యింది రామానికి

సీత తిరిగి కొనసాగించింది ఆమె ఒక్కొక్క మాటా ఒక్కొక్క వాక్యం తూటాగా మారి అతని హృదయంలోకి దూసుకు వెళ్ళింది

పెళ్ళి చూపుల దినాన ఎంతగా సంతోషించానో తెలుసా రామం? కాలేజీలో వరకట్నం దురాచారాన్ని తీవ్రంగా ఖండించిన రామం నా భర్త కాబోతున్నా



డంటే ఎంతగా సంతోషించానో? కానీ నా సంతోషం ఒక్కక్షణం పాటు కూడా నిలవలేదు ఆతర్వాత కట్నం చాలదని ఇంకా ఎక్కువ కావాలని అడుగుతూంటే మీరు నోరు మూసుకుని దిష్టి

‘ఆడవాళ్ళూ మీకు జోహార్లు’

బొమ్మలా కూర్చున్న దృశ్యం ఇంకా నా కళ్ళ ముందు తిరుగులాడుతూంది రామం

రామానికి కళ్ళు తిరిగినాయి

సీతా! నేను కట్నం విజ

ప్లీజ్! రామం, నన్ను రెండు నిముషాల పాటు మాట్లాడనివ్వండి యువతీయువకుల సహకార సహృద్భావంతో నే ఈ సమస్యని రూపుమాపగలమని సభల్లో బల్ల గుద్దేవారో? దీరోదాత్తంగా మాట్లాడేవారో? సమాజ వికాసానికి యువతరం యుగవైతాళికులన్నారో? యువత లేనిదే నవత లేదన్నారో? మానవత అసలే లేదన్నారో? జీవితంలో వసంతం లేదన్నారో? ఎక్కడండీ మీ నవత? మానవత? సభల్లో ప్రతిజ్ఞ పట్టారే కట్నానికి అమ్ముడు పోనని?

సీతా ప్లీజ్ నన్ను మాట్లా

' ఆగండి ఇంకా నేనడిగిన రెండు నిముషాలు పూర్తి కాలేదు మీ మాటలను నమ్మి వుదాత్త వ్యక్తి అనుకున్నాను కాని నా నమ్మకం పటాపంచలైపోయింది సార్! కాలేజీల్లో మీరిలా మాట్లాడే వారని ముందే తెలియక పోయినా, మా అమ్మానాన్నల మాటలకు తల ఒగ్గి పెళ్ళికి తలవంచి వుండేదాన్నేమో! కాని ఇప్పుడు మాత్రం కాదు రామం ఆచరణలో పెట్టలేని ఆశయాలను ఇకమీదటైన విడిచి పెట్టండి- దయచేసి ఐ హేట్ యూ ఫార్ దిజ్ రీజన్ బట్ ఫార్ నతింగ్

సీతా! నా మాట విను నేను కట్నం తీసుకుంటూన్నది

సారీ రామం నేనడిగిన రెండు నిముషాలు ముగిసిపోయాయి గుడ్ బై చక చకా అడుగులు వేసింది సీత, వెనుక నుంచి రామం ఎంతగా పిలుస్తున్నా వినిపించుకోకుండా

రామం ముఖాన కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు

ఒక్క నిముషం

ఒక్క నిముషం సమయమామె యిచ్చి వుంటే అతను చెప్పగలిగి వుండేవాడు తానెందుకు కట్నం కోరుతున్నాడో

★ ★ ★ ★

వివరంగా లేఖ రాసాడు రామం సీతకి పంపించాడు ఆ లేఖని లెటర్ చదివైనా తనని అర్థం చేసుకుంటుదేమోనన్న ఆశకి ప్రయత్నరూపం అది ఆ ఆశా అడియాసే అయ్యింది

అతడు పంపించిన లెటర్ విప్పి చదవకుండానే తిరిగివచ్చేసింది అతడి మనసు కకావికలమై పోయింది

తన మనస్సు, తప్పొప్పుల్ని పట్టించుకునే స్థితిని దాటిపొయ్యేదాకా ఆలోచించాడు వాడు

ఇంక ఒక్కటే మార్గం మిగిలి వుంది అదీ ప్రయత్నించి చూడదలిచాడు స్త్రీ హృదయం స్త్రీకైనా అర్థమవుతుందేమోనన్న ఆశ

రమారమి ఒకే ఈడు కలిగిన స్త్రీలకైనా

అతడు చేసిన పని పట్నంలో వున్న చెల్లెలికి లేఖ రాయటం

విజయా!" అంటూ ప్రారంబించి విషయాలను తెలియబరుస్తూ దీంట్లో నేను తప్పుగా ఆశించిందేమిటి తల్లీ? చెల్లెలు పెళ్ళి, కట్నం మూలంగా ఆగిపోకూడదన్న నా వాంఛ తప్పా? నా ఆశయాలను చెల్లి శ్రేయస్సు కోసం మార్చుకున్నాను నీ పెళ్ళి కోసం, నీకు వచ్చే మొగుడికి కట్నం యివ్వడం కోసం ఇలా కోరానే తప్ప, వేరే ఏ విధమైన లాభాన్ని ఆశించికాదు వరకట్నం దురాచారమన్న అభిప్రాయం నాకిప్పటికీ వుంది ఎప్పటికీ వుంటుంది కానీ నా చుట్టూ వున్న పరిస్థితులకి, సమస్యలకి నేనెలా పరిష్కారాన్ని చూపించగలను?

నన్ను అర్థం చేసుకోవూ? అని రాసాడు వివరంగా

వారం రోజుల తరువాత సమాధానం వచ్చింది లేఖకి ఈ వారం రోజులుగా మదనపడుతున్న రామం తటాలున విప్పి చదివాడు లేఖని

అన్నయ్యా,

నీ లెటర్ చూసి ఎంతగా దిగ్భ్రాంతిచెందానో తెలుసారా? అసలు నువ్వు ఇన్నేళ్ళ సహచర్యంలో నన్ను ఏమని అర్థం చేసుకున్నట్రా? ఓ విషయం తెలియకడుగుతాను ఆశయాలన్నవి మీ మగ వాళ్ళకేనా? ఆడవాళ్ళకూ వుండవా? నేనూ నీ చెల్లినేరా నీకున్నపాటి ఆశయాలు నాకెందుకు వుండకూడదు? కట్నం తీసుకోనన్నది మగవాడి ఆశయమైతే కట్నం తీసుకునే వ్యక్తిని పెళ్ళాడనన్నది స్త్రీల ఆశయం కావాలని సభల్లో ప్రసంగ చేసేవాడివి ఆ ధైర్యం ఎక్కడ్రా నీలో ఇప్పుడు?

ఇప్పుడు చెబుతాను విను కట్నం తీసుకోబోయే మగవాణ్ణి నేను ఏ కోశానా పెళ్ళిచేసుకోను ఇది నీ కోసం తీసుకున్న నిర్ణయమ్మాదు ఇది నా జీవితాశయం నేను ఎప్పుడో తీసేసుకున్న నిర్ణయం కూడా

ఇప్పటికైనా తెలుసుకోరా అన్నయ్యా మాకూ కొన్ని ఆశయాలు వుంటాయని

ఒక్కసారి ఈ విషయమై నన్ను కలిసి వుంటే ఇంత ట్రేజడీకి అంకురార్పణే జరిగి వుండేది కాదు అడగరు మీరు చిన్నమ్మాయి ఆమెకేం తెలుసులే అనుకుంటారు సీత వదిన చేసింది రైటే నా వరకు

ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు సీతకి నేనే లెటర్ రాస్తాను నువ్వూ ఆమెతో మాట్లాడు ఎలాగైనా ఆమె అడ్రస్ రాస్తావు కదూ? కట్నం సంగతికే గుడ్‌బై కొట్టేయ్

ఇక మీదటైనా ఇలాంటి కుంటి సాకులకు దూరంగా వుంటావు కదూ? అదిగో నీ కళ్ళలో నీళ్ళు సుడి తిరుగుతోంది తుడుచుకోరా వాటిని

ఐ విష్ యూ ఎ హేపీ మారీడ్ లైఫ్

నీ ప్రియమైన చెల్లి,

విజయ


అవి ఆనంద బాష్పాలె కదూ రామం కంటినుండి జాలు వారుతున్నది?

నిజమే! ఆశయాలన్నవి తనకొక్కడికే వుండాలనుకోవటం శుద్ధ పొరపాటు ఎంత బాగా అర్థం చేసుకున్నావు విజయా నన్ను మనసులో అనుకున్నాడు రామం ఒక్క కన్నీటి బిందువు ఆ లేఖ మీదికి జాలువారింది


దృఢ చిత్తంతో లేచాడు రామం

–కాబోయే శ్రీమతితో మాట్లాడడానికి

–కళ్ళు తెరిపించిన చెల్లికి లేఖ రాయడానికి. □




ప్రేమ్ సబ్బుతో స్నానం
రోజంతా ఉల్లాసం
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చి సహజ
సౌందర్యమును పెంపొందించు సబ్బు ప్రేమ్.
దీని స్వచ్ఛమైన నురగ, పరిమళము
మీ మనసును పులకింపజేయును.
Prem
THE REFRESHING SOAP
గులాబి మఱియు ఆకుపచ్చ
రంగులలో లభించును.
Prem
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
Imageads 2005 Tel



"కృష్ణగారడి" లో జయప్రద, కృష్ణ

హీరో కృష్ణ కొత్త చిత్రాలు

స్క్రీన్‌ప్లే సమకూర్చి, ప్రధాన పాత్ర నిర్వహిస్తూ కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మించే పద్మాలయ స్టూడియోస్ 'సింహాసనం చిత్రం జి హనుమంతరావు, జి ఆదిశేషగిరిరావు నిర్మాణ సారధ్యంలో జారీ ఎత్తున హిందీలో కూడా తయారవుతుంది హిందీ సింహాసన్ లో జితేంద్ర హీరో

డాక్టర్ ఎం ప్రభాకరరెడ్డి కథ, స్క్రీన్‌ప్లే సమకూర్చి తొలిసారిగా దర్శకత్వం నెఱపే ఎస్ ఆర్ ఫిలిమ్స్ చిత్రానికి ఎస్ రామచంద్రరావు నిర్మాత

దాసరి రచన, దర్శకత్వంలో దాసరి పద్మ సమర్పించే తారకప్రభు ఫిలిమ్స్ సాహసమే నా ఊపిరి

ఎన్ వి సుబ్బరాజు నిర్మించే శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్ ఉగ్రవాది

అనిల్‌కుమార్ దర్శకత్వంలో నందిగం దేవీప్రసాద్ సమర్పించే రాంప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ 4వ చిత్రానికి ఎన్ రామలింగేశ్వరరావు నిర్మాత

బి గోపాల్‌ను దర్శకుడుగా నిర్మాత డి రామానాయుడు పరిచయం చేసే సురేష్ ప్రొడక్షన్స్ వారి చిత్రంలో కృష్ణ సరసన శ్రీదేవి నాయిక

మోహన్‌కుమార్ నిర్వహణలో బి వి ఎస్ ఎన్ ప్రసాద్ నిర్మించే శ్రీకృష్ణ ప్రసన్న పిక్చర్స్ తొలి చిత్రానికి కె బాపయ్య దర్శకుడు

ఎ కోదండరామిరెడ్డి దర్శకత్వంలో టి త్రివిక్రమరావు నిర్మించే విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ 9వ చిత్రంలో కృష్ణ సరసన శ్రీదేవి నాయిక

జి రామమోహనరావు దర్శకత్వం నెరపే శ్రీ ధైర్య లక్ష్మీ పిక్చర్స్ తొలి చిత్రానికి సత్యమూర్తి రచన చక్రవర్తి సంగీతం, వి ఎస్ ఆర్ స్వామి చాయ, కోటగిరి గోపాలరావు కూర్పు తెరవెనుక హంగులు

కృష్ణ సరసన సుహాసిని తొలిసారి నాయికగా

సినిమా

నటించే శ్రీ రాజలక్ష్మి మూవీస్ 4వ చిత్రానికి ఎ కోదండరామిరెడ్డి దర్శకత్వంలో అంగర విజయ కుమార్ సమర్పిస్తారు పరుచూరి సోదరుల రచన, చక్రవర్తి సంగీతం, వి ఎస్ ఆర్ స్వామి చాయతో అంగర సత్యం నిర్మాత

విజయ నిర్మల దర్శకత్వంలో ఎం మల్లికార్జునరావు సమర్పించే ప్రసూన ఆర్ట్ పిక్చర్స్ చిత్రానికి ఎం వి కృష్ణారావు నిర్మాత చక్రవర్తి సంగీత దర్శకుడు సూరపనేని బావనారాయణ నిర్మాణ సారధి

భారతీ రాజా దర్శకత్వంలో కృష్ణ నటించే ప్రథమ చిత్రానికి ఆగస్ట్‌లో పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరుగుతుంది ఇళయరాజా సంగీతం, కణ్ణన్ చాయతో చుక్కపల్లి వేణుబాబు నీలకంఠ నిర్మాతలు

"సజీవ మూర్తులు" లో



శేషాలు

-జి. వి. జి.

కృష్ణ జయప్రద జంటతో కె పి శూర్మారావు ఆద్వర్యంలో కుండల బీమజ్యోతి వరప్రసాద్ బాబ్జ సమర్పించే విజయపావనీ ఎంటర్ ప్రైసెస్ సూపర్ స్టార్ చిత్రానికి సలాది సూర్య ప్రకాశరావు సహనిర్మాత యార్లగడ్డ ఉమామహేశ్వరరావు (చిట్టిబాబు) నిర్మాత ఆర్ కె కృష్ణ కథ, సత్యానంద్ సంబాషణలు, సత్యం సంగీతం, వి ఎస్ ఆర్ స్వామి చాయతో జగదీశ్ సంకలన కర్త, దర్శకుడు


ఎం బాలయ్య స్క్రీన్ప్లే, దర్శకత్వంలో యు సూర్యనారాయణ బాబు నిర్మించే శ్రీ పద్మావతీ పిలిమ్స్ చిత్రానికి మహామనిషి అని పేరుపెట్టారు

"కృష్ణ గారడి"

రెండు పాటలను ఊటీలో ఎక్సరైజ్ చేశాం అన్నారు విజయబాపినీడు స్పేట్స్‌కు బయలుదేరే

జయమాలిని పద్మజ





"ఇల్లాలికో పరీక్ష"లో మోహన్‌బాబు, భానుప్రియ

ముందు ఈయన దర్శకత్వంలో అట్లూరి రాదా కృష్ణమూర్తి కొమ్మన నారాయణరావు నిర్మించే శ్రీనివాసా ప్రొడక్షన్స్ కృష్ణగారడ వినోదా త్మక కుటుంబ గాదా చిత్రంలో సత్యనారాయణ, జగ్గయ్య రావు గోపాలరావు, నూతన్ప్రసాద్, బాలాజీ, రాళ్ళపల్లి మాడా జానకి నిర్మల జయమాలిని తక్కిన తారాగణం విజయబాపినీడు సమకూర్చిన కథ స్క్రీన్ప్లేకు కాశీ విశ్వనాద్ సంబాషణలకర్త చక్రవర్తి సంగీతం, ఎస్ ఎస్ రాజు చాయ బాస్కరరాజు శిల్పం ఆత్మారావు కూర్పు, గుత్తా మదుసూదనరావు- బత్తుల నాగేశ్వరరావు ప్రొడక్షన్ ఆర్ వెంకటేశ్వర రావు- తాడి రంగ వరప్రసాద్ సహకార దర్శకత్వం నిర్వహిసున్నారు

పద్మజా పిక్చర్స్ "అంకితం"

కె ప్రత్యగాత్మ గారు మహాద్భుత మైన కథను ఇచ్చారు, అన్నారు సి హెచ్ నరసింహారావు ఈయన డిర్రర్ అనంతరం నిర్మించే పద్మజా పిక్చర్స్ అంకితం చిత్రానికి మే 31న పాటల రికార్డింగ్‌తో ప్రారంబోత్సవం జరిగింది భానుచందర్, బానుప్రియ రాజేష్, రాళ్ళపల్లి, వేలు, వీరబద్రరావు, చలపతిరావు వై విజయ, అనూరాద, సిల్క్‌స్మిత ఆదిగాగల వారు పాల్గొంటారు పరుచూరి సోదరుల సంబాషణలు వేటూరి గీతాలు నరసింహన్ సంగీతం ప్రసాద్‌బాబు చాయ గౌతంరాజు కూర్పుతో స్క్రీన్ప్లే దర్శకత్వ బాద్యతలు వహించే ఎ మోహన్‌గాంది జూలై ఆగస్ట్ నెలల్లో షూటింగ్ ముగిస్తాం అన్నారు


రాఘవేంద్ర సినీ క్రియేషన్స్ చిత్రంలో శోభన్‌బాబు, విజయశాంతి

జూన్ 21 నుంచి జూలై 10 వరకు ఫస్ట్ షెడ్యూల్ జరుగుతుంది అన్నారు కె వి వి సత్యనారాయణ ఈయన కొంగు ముడి అనంతరం సమర్పించే రాఘవేంద్ర సినీ క్రియేషన్స్ ద్వితీయ చిత్రంలో శోభన్‌బాబు, విజయశాంతి నాయకా నాయికలు ఆనం గోపాలకృష్ణారెడ్డి కందేపి సత్యనారాయణ నిర్మాతలు బి భాస్కరరావు దర్శకుడు గొల్లపూడి రచయిత

సుమన్ రిమాండ్

జూన్ 1 వ తేదీ మధ్యాహ్నం 12 గం 25 ని లు 103 డిగ్రీల తాపం, పెరిగిన గెడ్డం, నీలిరంగ్ జీన్స్ టి షర్ట్‌తో బోనులో తల వంచుకొని నిలుచునున్న సినీ నటుడు సుమన్‌ను ఉద్దేశించి 9వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు మీ మీద ఇక్కడ రెండు ఆరోపణలు ఉన్నాయి దర్యాప్తు ఇంకా కొనసాగుతూన్నందున మరో రెండు వారాలు –అంటే, జూన్ 14 వరకు మీ రిమాండ్‌ను పొడగించడమైనది అన్నారు మేజిస్ట్రేట్‌కు నమస్కరించి సుమన్ బోన్ నుంచి దిగగానే తాగడానికి నీళ్ళు కావాలని అడిగారు పక్కనే ఉన్న సైదాపేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఒక గ్లాసులో నీళ్ళు తెప్పించి ఇచ్చారు ఆ తర్వాత సుమన్‌ను పక్కనే ఉన్న 17వ మెట్రోపాలిటన్ కోర్టుకు తీసుకెళ్లారు అక్కడ వీణా అనే యువతి చేసిన ఫిర్యాదు నమోదు చేయబడి ఉంది

కొందరు యువతుల బ్లూ చిత్రాలు తీసి వారి పెద్దలను బ్లాక్ మెయిల్ చేసి వేదించాడనే విడియో



మొదటి సగం నీతి, రెండో సగం బూతు కాబట్టి సినిమా విజయవంతం అవుతుందని అనుకుంటున్నాం'

సినిమా

లైబ్రరీ యజమాని దివాకర్ కేసుతో సంబంధం ఉందనే ఆరోపణ మీద సుమన్ అరెస్టవడం గొప్ప సంచలనం కలిగించింది ఆ నాడు సైదాపేట కోర్టు వద్ద సుమన్‌ను చూడడానికి కొందరు నిర్మాతలు ఎందరో అభిమానులు గుమికూడారు

షావుకారు జానకికి 'డాక్టరేట్'

తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాలలో విభిన్నమైన భూమికలను నైపుణ్యంతో నిర్వహించి, గత 35 ఏళ్ళుగా చలన చిత్ర రంగానికి చేసిన సేవకు గుర్తింపుగా షావుకారు జానకికి అమెరికాలోని అరిజోనా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పట్టా ఇచ్చింది

విడుదలకు సిద్ధమవుతూన్న "అగ్గిపిడుగు"

పూర్తిగా తలకోన, ఛెంగల్పట్టు, నెరబైలు అడవుల్లో షూటింగ్ జరిపాం ఈ యాక్షన్ ఎక్చర్‌లో ఫైట్స్ సరికొత్త తరహాలో ఉంటాయి, అన్నారు గిరిధర్ ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో రాశీ ఆర్ట్ మూవీస్ రూపొందించిన **అగ్గిపిడుగు** చిత్రంలో **అగ్గి**-పిడుగులుగా గిరిబాబు, నవనటుడు రవి **నటించారు** వనితశ్రీ ఈశ్వరరావు, ప్రభాకరరెడ్డి, **హరిబాబు**, ఏ ఎల్ నారాయణ త్యాగరాజు, **సుదర్శన్**, గొకిన రామారావు, ఎల్ స్మిత, కె విజయ **పండరీబాయి** వగైరా నటవర్గం పేరాల **సంభాషణలు**, చక్రవర్తి సంగీతం విజయ్ చాయ **చంద్రశేఖర్** ప్రొడక్షన్, భాస్కరరాజు శిల్పం జె **నరసింహారావు** కూర్పు, గణేశ్ సహకార దర్శకత్వంతో **మంతెన దేవేంద్రరాజు** నిర్మాత

భయానక చిత్రం "కాష్మోరా"

జూ**న్‌లో** పాటల రికార్డింగ్ ఆ తర్వాత ఒకే షెడ్యూ**ల్‌లో** షూటింగ్ పూర్తవుతుంది అన్నారు ఎన్ బి చక్రవర్తి ఈయన దర్శకత్వంలో బాబాయ్-అబ్బాయ్ అనంతరం ఉషోదయా మూవీస్ అధినేత ఎస్ సుధాకరరెడ్డి నిర్మించే కాష్మోరా చిత్రానికి యండమూరి వీరేంద్రనాద్ రచన తులసి ఆదారం సత్యానంద్ సంభాషణలకర్త చక్రవర్తి సంగీత దర్శకుడు

ఉక్కు సంకెళ్ళు"లో సుమన్, అర్చన



మా మంత్రగాళ్ళి 3-డి చిత్రంలో కుష్బూ, అరుణ్





కె. బాపయ్య దర్శకత్వంలో కృష్ణంరాజు

"షూటింగ్ ఆగస్టులో ఉంటుంది," అన్నారు కె. బాపయ్య. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో "ఈ పిల్లకు పెళ్ళవుతుందా?" అనంతరం బి. హెచ్. విజయనరసింహరాజు నిర్మించే ఎస్. బి. బి. ప్రొడక్షన్స్ చిత్రంలో కృష్ణంరాజు నాయకుడు. పరుచూరి సోదరుల రచన, చక్రవర్తి సంగీతంతో బి. వరహాలరాజు సమర్పిస్తారు.

విడాకులు


రెండేళ్ళ క్రితం దంపతులైన నటీనటులు రాధిక, ప్రతాప్ పోతన్‌లు భేదాభిప్రాయాల వల్ల విడిపోయారు.

నటి కాంచన వివాహం

నటి కాంచనకు అమెరికాలోని ఒక ఉన్నతోద్యోగితో త్వరలో వివాహం జరుగబోతోందని ఆమె తండ్రి శ్రీ పురాణం రామకృష్ణశాస్త్రి తెలిపారు.

అనిల్ కుమార్ దర్శకత్వంలో వెంకన్నబాబు చిత్రం "బంగారు చిలక"

"ఇదొక వెరైటీ సబ్జెక్టు. ఆగస్టు నుంచి షూటింగ్," అన్నారు మహేశ్వరీ మూవీస్ అధినేత ఎస్. పి. వెంకన్నబాబు. ఈయన నిర్మించే చిత్రంలో అర్జున్, భానుప్రియ నాయకా నాయికలు. అనిల్ కుమార్ దర్శకుడు.



"దాంపత్యం"లో సుహాసిని, నాగేశ్వరరావు, జయసుధ

జూన్ నెలాఖరులోగా "ఇల్లాలికో పరీక్ష"

"మోహన్‌బాబు ద్విపాత్రాభినయం హైలైట్," అన్నారు కె. వెంకట్రామరాజు. ఈయన తాతినేని ప్రసాద్ స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో సమర్పించే ఎ. ఆర్. ఆర్. పిక్చర్స్ "ఇల్లాలికో పరీక్ష" చిత్రంలో శారద, భానుప్రియ నాయికలు. ఇంకా సత్యనారాయణ, త్యాగరాజు, సారధి, సి. హెచ్. కృష్ణమూర్తి, టెలిఫోన్ సత్యనారాయణ, పద్మరాజు, అనూరాధ, సిల్క్ స్మిత తక్కిన పాత్రధారులు. మోదుకూరి కథకు గణేష్‌పాత్రో సంభాషణలకర్త. రాజ్‌కోటి సంగీతం, విపిన్‌దాస్ ఛాయ, కొండపనేని రామలింగేశ్వరరావు శిల్పం, గూనా నాగేంద్రప్రసాద్ సహదర్శకత్వం, నాయని మహేశ్వరరావు కూర్పు, కె. వెంకట్రాముడు నిర్వహణ, బి. నాగేశ్వరరావు సహకార దర్శకత్వంతో కె. ధ్రువకుమార్ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. కె. ఎస్. ఎస్. రామచంద్రరాజు నిర్మాత.

గుప్తా క్రియేషన్స్ కొత్త చిత్రం

"ఆడపిల్లలకు ఉన్నత విద్యలు అక్కరలేదని భావించే ఒక తండ్రికి, అతని కూతుళ్ళకు మధ్య జరిగే ఘర్షణమే 29 నుంచి 31 వరకు మొదటి షెడ్యూల్ జరిగింది. సెప్టెంబర్‌తో షూటింగ్ పూర్తవుతుంది," అన్నారు కె. సత్యం . ఈయన కూర్పు, సమర్పణలో "ఈ చరిత్ర ఇంకెన్నాళ్ళు" అనంతరం కె. వి. నారాయణగుప్త నిర్మించే పై సంస్థ ద్వితీయ చిత్రంలో సుహాసిని, కె. ఆర్. విజయ, సత్యనారాయణ, భానుచందర్, అర్జున్, రాజా, నూతన్ ప్రసాద్, రాజ్యలక్ష్మి, వై. విజయ, రాళ్ళపల్లి ప్రభృత తారాగణం. కృష్ణ చక్ర సంగీతం, డి. ప్రసాద్‌బాబు ఛాయతో మౌళి దర్శకుడు. □

"ఉక్కు మనిషి" లో కె. ఆర్ విజయ, కృష్ణంరాజు




సముద్రాల జూనియర్ అస్తమయం


"ఇదివరకు కథాబలం మీదే చిత్రాలు ఆధారపడి ఉండేవి . ఇప్పుడా అవసరం లేకుండా పోతోంది. దీనికి కారణం 'వేగం'. ఆ వేగంలోనే ఎన్నో చిత్రాలు కొట్టుకుపోతున్నాయి. చక్కని స్క్రిప్టుతో ప్రేక్షకులు తాదాత్మ్యం పొందేలా చేయగలిగిన చిత్రాలు ఎప్పటికైనా విజయం సాధిస్తాయి," అన్నారు మిత్రులు సముద్రాల రామానుజం కొన్ని మాసాల క్రితం డాక్టర్ భానుమతీ రామకృష్ణగారింట్లో కలిసినప్పుడు.... ఇటీవలే షష్టిపూర్తి చేసుకున్న సముద్రాలకు అంతలోనే నూరేళ్ళు నిండుతాయని ఎవ్వరూ అనుకోలేదు. శ్వాస కోశంలో క్యాన్సర్ వల్ల మే 31 రాత్రి మద్రాసులోని స్వగృహంలో పరమపదించారు. 1923 ఏప్రిల్



15న జన్మించిన 'జూనియర్' ఒకటో ఫామ్ చదువుతూన్నప్పుడే పద్యాలు రాయడం ఆరంభించారు. "మాయాలోకం" చిత్రంలో 'సముద్రుడు' పేరుతో తొలి సినిమా పాట రాశారు. రేడియో సర్వీసింగ్ అండ్ మైంటినెన్స్ కోర్సు చదివి 1946లో డిప్లొమా పొందారు. కొంత కాలం పాటు వాహినీ స్టూడియో సౌండ్ డిపార్ట్‌మెంట్‌లో నేటి సుప్రసిద్ధ డైరెక్టర్ కె. విశ్వనాథ్‌తో కలిసి పని చేశారు. ఈయనకు 'జూనియర్ సముద్రాల' అని పేరు పెట్టింది ప్రముఖ హాస్యనటుడు స్వర్గీయ కస్తూరి శివరావు. ఆ పేరుతో ఈయన పాటలు రాసిన చిత్రం వినోదా వారి "శాంతి". సంభాషణలు రాసిన తొలిచిత్రం "తోడు దొంగలు" . దాదాపు 110 చిత్రాలకు పైగా పని చేశారు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈయన కొంత కాలంగా ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో స్క్రిప్ట్ రైటర్‌గా ఉంటూ వచ్చారు. □



కేవలం ఫోర్‌హేన్స్ మాత్రమే చిగుళ్లను గట్టి పర్చగల ప్రత్యేక అస్ట్రింజంట్ కల్గివున్నది. చిగళ్లు గట్టిగా వుంటే పళ్లు ఎక్కువ కాలం నిలుస్తాయి.



అమెరికాదేశపు ప్రఖ్యాత దంత వైద్యుడు డా. ఆర్.జె. ఫోర్‌హెన్ తాను తయారుచేసిన టూత్‌పేస్టులో ఒక ప్రత్యేక అస్ట్రింజంట్ చేర్చాడు.

1. ఇది నేరుగా చిగుళ్ల మీద పనిచేసి, వాటిని బిగుతు చేసే ఒక విశిష్ట పదార్థము.
2. చిగుళ్లను బలపర్చి, పళ్ల మీద వాటికి మంచి పట్టునిస్తుంది.
3. ఇలా మీ పళ్లకు దృఢమైన ఆధారం, దీర్ఘ ఆయుస్సు ఇస్తుంది.



ఫోర్‌హెన్స్ — ఇది పళ్ల డాక్టరు సృష్టించిన టూత్ పేస్టు.

339F 234

సీరియల్

ముసురు వెలిసింది

కళ్యాణీ సోమరాజ్

(గత సంచిక తరువాయి)

మర్నాడు మూర్తి చేత, రమ చేత సత్యన్నారాయణ వ్రతం చేయించారు ఆ పీటల మీదే మూర్తి చేత రమకు మూడు ముళ్ళు వేయించారు

దగ్గర దగ్గర వూళ్ళల్లో వున్న బంధువర్గం అంతా వచ్చారు ఇల్లంతా పెళ్ళి ఇల్లు కంటే ఎక్కువ సందడిగా వుంది అందరూ వస్తూనే జరగరాని ఘోరం జరిగిపోయినట్లు సత్యనారాయణమూర్తి గారిని, సుందరమ్మని పలకరించారు కొంతమంది సూటిగా మూర్తినే అడిగేసారు

ఏరా మా కందరికి పప్పన్నం పెట్టాల్సి వస్తుందనా, గుట్టు చప్పుడు కాకుండా పెళ్ళి చేసుకొచ్చావ్!

ఇప్పుడు తినబోతున్నావుకదా బామ్మ ఏ పప్పమన్నం అయితే ఏం అంటూ సర్దేశాడు మూర్తి

పోనిలేవే సుందరి! నీ కోడలు కట్నం-కానుకలు తీసుకు రాకపోయినా మహాలక్ష్మిలా వుంది చిదిమి దీపం పెట్టుకోవచ్చు అంటూ సుందరమ్మని ఓదార్చాలని చూసారు కొందరు

ఆ మహాలక్ష్మి! రూపం చూసుకొని కడుపు నింపుకోవాలి ఓ అచ్చటా- ఓ ముచ్చట ఏం సరదా తీరిందని అందరూ వేలకు వేలు కట్నాలు గుంజుతుంటే వీడు ఆదర్శానికి పోయి మా కొంప ముంచాడు రేపొద్దున నలుగురు మీ కోడలు ఏం తెచ్చింది, అబ్బాయి కేం ఇచ్చారు, అత్తగారికి మీకేం పెట్టారు అని అడిగితే ఏం చెప్పాలి ఎంత తలవంపులు

రమ శ్రోతలా నిలబడి ఆ మాటలు వింటోంది ఆమెకు తల్లిదండ్రుల మాటలు అనుభవంలోకి వచ్చాయి! కొడుకును కన్నప్పటి నుంచి అతని మీద ఖర్చు పెట్టిన ప్రతి నయాపైసా కట్నం ద్వారా గుంజాలనుకునే ఇలాటి తల్లిదండ్రులున్నంత వరకు ఆడపిల్లలు ఇలా కట్నాలకు బలికాక తప్పదు అదవా తమలా ధైర్యం చేసి పెళ్ళి చేసుకున్నా ఈ శరాల్లాంటి మాటలకు గురికాక తప్పదు!

ఒరే! మూర్తి ఆడబడుచుకు మంగళహారతి పళ్ళెం పెట్టాలి ఆడబడుచు లాంచనాలు ఎలాగు దక్కలేదు ఇదైనా మాకు ఇవ్వాలి అంటూ అందరికి విన్పించేలా పెద్దగా అంది కాంతం

మూర్తి! ఆడబడుచులకు తలా వెయ్యి నూటపదహార్లు ఇచ్చెయ్యి వాళ్ళకు లోటు జరిగితే మనకు క్షేమం కాదురా! అంటూ సుందరమ్మ కొడుకును హెచ్చరించింది

అలాగే నమ్మా!" అన్నాడు మూర్తి బ్యాంక్ బ్యాలెన్స్ ఎంతుందా అని ఆలోచిస్తూ

తనను పెళ్ళి చేసుకున్నందుకు మూర్తి పెనాల్టి బాగానే చెల్లిస్తున్నాడు అనుకుంది రమ

మేము రేపు పొద్దున్నే బస్ కెళ్ళిపోతున్నాం రమా! మిమ్మల్ని డిస్టబ్ చేయటం ఎందుకని ఇప్పుడే చెబుతున్నాను వీలు చూసుకొని విజయవాడ మా ఇంటికి రండి నాలుగు రోజులుండి పోదురు గాని అంటూ చిన్న తోడి కోడలు యశోద, రమని ఆహ్వానించింది

అప్పుడే వెళ్ళిపోతున్నారేం అంది రమ

వెళ్ళాలమ్మా పిల్లలిద్దర్నీ ఈ ఏడు పబ్లిక్ స్కూల్లో చేర్పించాం వాళ్ళకి ఒక్కరోజు వెళ్ళకపోయినా బోలెడు హోమ్‌వర్క్

రమ ఏం మాట్లాడలేదు

యశోద గొంతు తగ్గించి, రమా! మూర్తిని చేపట్టి మా ఇంట్లో ఒకదానివిగా మా మధ్యకు రావటం చాలా ఆనందంగా వుంది ఈ కాలంలో మీ పెళ్ళిలా సింపుల్‌గా కట్నాలు లేకుండా ఎన్ని పెళ్ళిళ్ళు అవుతున్నాయి? మా మూర్తిలో ఇంతటి చొరవ, సాహసం వుందంటే వాళ్ళ అన్నగారే ఆశ్చర్యపడ్డారు ఏది ఏమైనా మా ఇద్దరికి మీ పెళ్ళి బాగా నచ్చింది

"థాంక్స్ అండీ"

"అయితే ఈ ఉమ్మడి కుటుంబంలో ఈ గాలి దుమారం త్వరగా తగ్గదు. నువ్వు కాస్త ధైర్యంతో తట్టుకోవాలి"

"చాలమందికి నిరాశ కలిగించాం కదా!

"నిరాశ సంగతి ఎలా వున్నా ఆ అసంతృప్తితో నిన్ను వాళ్ళేమి విసిగించకుండా వుంటే అంతే చాలు నా పెళ్ళికి మా నాన్న ఇస్తానన్న కట్నంలో రెండు వేలు సర్దలేకపోతే, నన్ను నాలుగేళ్ళ వరకు పుట్టింట్లోనే వుంచారు. అలాటి వాళ్ళకు ఇప్పుడు మీరు చేసింది 'గుణపాఠం' అని నేను అనుకుంటే జరగరాని మహా ఘోరం' అని వాళ్ళనుకుంటున్నారు. సరే ఇవన్నీ చెప్పి నీ మనసును అనవసరంగా చికాకు పెట్టటం ఎందుకులే! అన్నట్లు అక్కయ్య చాలా మంచిది. ఆవిడతో స్నేహంగా వుండు." అంటూ ఎన్నో సలహాలు చెప్పింది యశోద.

3

రమ కొత్త కోడలిగా ఆ ఇంట్లో ప్రవేశించి అప్పుడే మూడు వారాలయింది

పొద్దున భోజనం చేసి మూర్తి తెనాలి వెళితే మళ్ళీ వచ్చేది రాత్రి 7 గం.లకే. ఈలోగా రమ పుస్తకాలు తోటి, రేడియో తోటి సహచర్యం చేస్తూ కాలం దొర్లించాల్సిందే! అప్పుడప్పుడు మూర్తితో పాటు తను కూడ అతని స్కూటర్ మీద తెనాలి వెళ్ళేది! ఇంచుమించు రమ కోసం కొన్న కారు ఎండకి వానకి తడుస్తూ మూలపడింది.

రమ ఇంట్లో బోర్ భరించలేక తెనాలి వెళ్ళినా, మూర్తి పేషెంట్స్‌తో బిజీగా వుండేవాడు. మధ్యలో గంటో, రెండు గంటలో అతను ఖాళీగా వున్నా, ఇద్దరూ కలిసి వెళ్ళే చోటు కన్పించేది కాదు. రమ రోజుకో రకం షాపింగ్ చేసేది. ఒకరోజు బెడ్‌షీట్స్ అని, ఒకరోజు కర్టెన్స్ అనీ. రాను రాను ఆమెకు వాటి మీద ఇంట్రెస్ట్ పోయింది.

పోనీ ఇంట్లో నలుగురి మధ్య సరదాగా తిరుగుదామన్నా, అందరిది

జరిగిన కథ-1 కట్నం ప్రసక్తి లేకుండా మూర్తి రమ రిజిస్టర్ మేరేజి చేసుకుంటారు రమని వెంట పెట్టుకుని వచ్చిన మూర్తిని తల్లి తండ్రి తూలనాడినా పెద్దన్న, పెద్ద వదిన సీత ఆదరిస్తారు రమని చూడటానికని వచ్చిన మూర్తి పెద్దక్కయ్య, చిన్నక్కయ్య రమని ఈటెల లాంటి తమ మాటలతో బాదిస్తారు

తలో రకం మనస్తత్వం.

పెద్దకోడలికి తెల్లవారి లేచిం దగ్గర నుంచి 'పని కోసమే పుట్టాను' అన్నట్టు 'కుడితి తొట్లో పడ్డ ఈగలా' ఎప్పుడూ ఏదో చేస్తూనే వుంటుంది.

"నాకు ఏదైనా చెప్పండక్కయ్యా!' అంటూ రమ చొరవగా కత్తిపీట అందుకోబోతుంటే సీత వారించేది-

"కొత్త కోడలివి. అప్పుడే ఈ పనులెందుకమ్మా నీకు" అంటూ

"ఇంకా ఏమిటక్కయ్యా కొత్త? తోచక బోరు కొడుతుంది'

"ఏవైనా పుస్తకాలు చదువుకో!"

"ఆ పుస్తకాలు చదివి చదివి తలనొప్పి వస్తోంది."

"అయితే అలా కూర్చుని కబుర్లు చెప్పు

రమకేం కబుర్లు చెప్పాలో తెలిసేది కాదు. తన ప్రపంచం వేరు వీళ్ళ ప్రపంచం వేరు. తనకు తెలిసిన విషయాలన్ని ఇతర్లతో చెప్పాలని వుంటుంది కాని సీత అన్నిటికి 'ఆహా' 'ఆ(' 'అలాగా' అంటూ నిర్లిప్తంగా 'రెస్పాన్స్' ఇస్తుంది సీత వారపత్రికలు కూడ చదువుతుందని అనుకోదు రమ

ఇక ధనం ఎప్పుడూ ఖాళీగానే వుంటుంది ఈ చెంబు తీసి అవతల పెట్టదు ఎప్పుడు ఎడపిల్లనో, చంటిపిల్ల వాడినో ఏడ్చినా, ఎడవకబోయిన చంకనేసుకొని తిరుగుతూ వుంటుంది ఆవిడతో మాట కలపాలన్న భయం 'రమ'కు వచ్చిన కొత్తల్లో రమ చొరవగా,

అదేమిటక్కయ్యా! ఈ చీర అంత పైకి కట్టారేం, దాని మీద ఆ గ్రీన్ కంటే ఎల్లో జాకెట్టు బాగా సూట్ అవుతుంది అంటూ అడక్కపోయినా సలహా ఇచ్చింది

"ఏమోనమ్మా! పల్లెటూరి వాళ్ళం పట్నం సోకులు మాకు తెలియవు ఏదో సంసార పక్షంగా వుండటమే మాకు నేర్పారు మావాళ్ళు అంది పెళుసుగా

ఆ మాటలకు రమ మనసు చిన్నబోయింది అందంగా ఫేషన్‌గా కన్పించటం తప్పా!

ఇక ప్రసూన రమ వయసు పిల్లే అయినా రమతో ఏనాడు సరదాగా కూర్చుని కబుర్లు చెప్పేది కాదు ఎంత సేపు అద్దెకి తెచ్చే చౌకబారు సాహిత్యం చదువుతూ, ఇరుగింటికి, పొరుగింటికి వెళ్ళి గంటలు గంటలు కబుర్లు చెప్పటం, ఆమెకు తోచనప్పుడల్లా ఎవరితోనో ఒకళ్ళతో తగువులాడటం ప్రసూన హాబీలు రమ స్నేహంగా పల్కరించినా, తల తిప్పుకొని వెళ్ళిపోయేది ప్రసూన ఇలా కావటానికి కారణం ఆమెను చదువు మాన్పించి ఇంట్లో కూర్చోపెట్టటమే పెళ్ళి చేయదలచుకుంటే మాత్రం ఏ వ్యాపకం లేకుండా ఇంట్లో కూర్చో పెట్టటం ఏమిటి? అనుకొని రమ ఒకసారి మూర్తి దగ్గర ఈ ప్రస్తావన ఎత్తింది

"అదేమిటి మూర్తి మీ చెల్లెల్ని చదివించకుండా ఇంట్లో కూర్చో పెట్టారేమిటి? ఒకసారి తప్పితే మాత్రం మరొకసారి ట్రై చేయకూడదా

"ప్రసూన చదువు విషయమా నువ్వనేది అమ్మా, నాన్నలకి దానికి త్వరగా పెళ్ళి చేయాలని వుంది సంబంధాలు కూడా చూస్తున్నారు వాళ్ళ సంగతి అలా వుంచు అసలు దానికి చదువు ధ్యాస వుంటే కదా! నేను ఒకసారి పుస్తకాలన్ని కొని తీసుకొచ్చి "మళ్ళ చదువు ప్రసూనా!" అంటూ ఎంతో చెప్పి చూసాను అది నా మాటలు ఎలా అర్థం చేసుకుందో అమ్మతో ఏదో చెప్పింది దాంతో అమ్మ వచ్చి నాతో కోపంగా 'ఆడపిల్ల, అదిప్పుడు చదివి ఉద్యోగాలు చేసి సంపాదించాలా! పెళ్ళి అయ్యాక కంటికే కన్పించరు దాన్నిలా హాయిగా వుండనీ!' అంది

"నయం చెప్పారు నేను ఆ ప్రయత్నం చేద్దామనుకున్నాను" అంటూ నిటూర్చింది రమ

★ ★ ★ ★ ★ ★

"రమా! ఈ రోజు రత్నా టాకీస్‌లో ఏదో మంచి సినిమా వుందిట వెళదాం రెడి అవు' అంటూ హడావిడిగా వచ్చాడు మూర్తి

పెళ్ళి అయిన నెల రోజులకు భర్త నోటి నుంచి వచ్చిన మొదటి ఆహ్వానం అది. రమ ఉషారుగా చూస్తూ-

"మరి మీ హాస్పటల్"



ముసురు వెలిసింది

ఈరోజు పెద్ద కొంపలేమీ మునిగిపోవులే. అయినా నీ తరువాతే కదా ఏదైనా"

"కొయ్యకండి. పెళ్ళి అయ్యాక ఇది మొదటి సినిమా తెలుసా?"

"సారీ రమా. ఇక నుండి ప్రతి సన్‌డే మనం సినిమాకి వెళదాం. ఊ క్విక్‌గా రెడీ అవ్వాలి."

"ఏం చీర కట్టుకోను. నా మంచి చీరలన్నీ బూజు పడుతున్నాయి వాడటం లేక" అంది ముద్దుగా నవ్వుతూ.

"మరి ఏరికోరి ఈ పల్లెటూళ్ళో వుండే వాడిని చేసుకున్నావేం" రమను ఉడికిస్తూ అన్నాడు.

"చీర సంగతి చెప్పలేదు బెనారెస్ ఆర్గంజా కట్టుకోనా, ఆర్గండీ, కోటా మైసూర్ జార్జెట్. "

"స్టాప్ స్టాప్. నీకు చాల చీరలున్నాయని నాకు తెలుసు కాని బట్టల షాపువాడు చెప్పినట్లు చెప్పకు. నాకు నచ్చిన చీర తీసి వుంచుతాను. నువ్వు వెళ్ళు."

రమ 'లావెండర్ డ్యూ' వాసనతో ఘుమఘుమ లాడుతూ వచ్చేసరికి మూర్తి నావీ బ్లూ మైసూర్ జార్జెట్ చీర, జాకెట్టు తీసి వుంచాడు.

"బాగా ఆకలిగా వుంది మూర్తి. ఇంట్లో సాయంకాలం టిఫిన్ వుండదు మరి."

"త్వరగా వెళదాం. అక్కడ వున్న వాటిల్లో మంచి హోటల్‌కి తీసుకెళతాను."

ఇద్దరూ ఏవో కబుర్లు చెప్పుకుంటూ దిగి వచ్చారు.

"ఎక్కడికిరా బయల్దేరారు" అంటూ తండ్రి ఎదురై ప్రశ్నించాడు.

"సినిమాకి నాన్న" అన్నాడు మొహమాటంగా

వంచలో కూర్చుని ఎదురింటి వాళ్ళింట్లో నుంచి తెచ్చుకున్న సినిమా పత్రిక తిరగేస్తున్న ప్రసూన వెంటనే "సినిమాకా! దేనికన్నయ్యా?" నేను వస్తాను" అంటూ ఎగిరి గంతు వేసింది

"దానికేముందే! అందరూ కలిసి కారులో వెళ్ళండి" అంటూ తండ్రి బయటకు వెళ్ళిపోయాడు

మూర్తి, రమ నిస్సహాయంగా లోపలికి నడిచారు అప్పటికే ప్రసూన ద్వారా ఆ వార్త ఇంటిల్లిపాదికీ తెలిసిపోయింది.

'ఏరా! సినిమాకి వెళుతున్నారటగా!" అంటూ వంటింట్లో నుంచి సుందరమ్మ వచ్చింది

"ఏమిటో మరది గారేదో సినిమా ప్రోగ్రామ్ పెట్టారుటగా మేము రావచ్చా!" అంటూ ధనం జుట్టు విప్పి తీస్తూ అడిగింది.

"కొత్త సినిమా అయితే రావటానికి నాకేఁ అభ్యంతరం వుండదురా" అంటూ కాశీపతి మూర్తిని ఉక్కిరిబిక్కిరి చేసారు.

'అందరూ త్వరగా రెడీ అవండి ఇంక టైమ్ లేదు " అన్నాడు నీరసంగా.

"నేనెందుకురా మూర్తి మీరంతా వెళ్ళండి సరదాగా!" అన్నది సుందరమ్మ మనసులో వెళ్ళాలని వున్నా.

"ఫరవాలేదు లేమ్మా! నువ్వు రా!" అని మూర్తి చేత మరోసారి చెప్పించుకొని ముస్తాబు కావటానికి లోపలికి వెళ్ళింది

రమ కింక సినిమా చూడాలన్న ఉత్సాహం అంతా హారతి కర్పూరంలా ఇగిరిపోయింది

'మీరు రండక్కయ్యా! అందరం వెళుతున్నాం సినిమాకి!" అంది సీతతో రమ

"అదెక్కడికి వస్తుంది ఇంట్లో వంట కాలేదింకా! సినిమా నుంచి రాగానే పిల్లలు ఆకలికి ఏడుస్తారు ఇంకోసారి వెళుతుందిలే" అంది వెంటనే సుందరమ్మ.

'ఔను రమా! మీరు వెళ్ళిరండి నా వంట ఇంకా కాలేదు కూడాను. మీ బావగారు ఇంకా పొలం నుంచి రాలేదు " అంటూ సీత మృదువుగా తిరస్కరించింది

ఆడవాళ్ళంతా పేరంటానికేమో నన్నట్టు పట్టుచీరలతో, నగలతో తయారై వచ్చేసరికి చాలా సేపే పట్టింది అప్పటికే పిల్లలంతా కారు ఎక్కేసి కిటికీ దగ్గర సీటు కోసం దెబ్బలాడుకుంటున్నారు

బహుశ హోటల్‌కి వెళ్ళే టైమ్ వుండదేమో రమా!' అన్నాడు ఆమెకే విన్పించేంత నెమ్మదిగా

ఇంక అక్కర్లేదు కడుపు నిండిపోయింది" అంది విసుగ్గా

కారు ఒక ఫర్లాంగ్ దూరం వెళ్ళిందో లేదో, 'ధనం' ఒక్కసారి కెవ్వున కేక వేసింది కారు కీచ్ మంటూ ఆగింది

"అయ్యో! మూర్తి చంటివాడి పాల సీసా కిటికీలో పెట్టి మర్చి పోయాను నీకు పుణ్యం వుంటుంది ఒక్కసారి వెనక్కు పోనివ్వు అంటూ అర్థించింది

మూర్తి కారు వెనక్కు తిప్పాడు

నీ మొహం మండ ఎప్పుడూ ఒకటే మతిమరపు" కాశీపతి సినిమా ఎక్కడ మొదలు పెడతారో నన్న ఆదుర్దాలో అన్నాడు.

వదిన ఎప్పుడూ అంతే! విసుగ్గా ప్రసూన

'బాగుందమ్మా! నీకేం పిల్లా - పీచూ అంత మందిని తయారు చేయాలి. అన్నీ నేనే చూసుకోవాలి "

"వదినా! ఇల్లు వచ్చేసింది త్వరగా పట్టుకురా!"

"ఆఁ వెళుతున్నా!" అంటు ఖంగారుగా దిగుతూ చీర కాలి కడ్డం పడి దబ్బున పడింది ధనం.

"అయ్యో. దెబ్బ తగిలిందా!" సుందరమ్మ సానుభూతికి సమాధానం చెప్పకుండానే ధనం వస్తున్నంత స్పీడ్‌గా లోపలికి వరిగెత్తి పాల సీసాతో వచ్చింది

"దెబ్బలు తగిలాయా! వెధవ ఖంగారు నువ్వూను. ఏంఁ ఆ చీరంత జీర్ణాదేలా కట్టకపోతే ఏంఁ" కాశీపతి భార్యను తిట్టాడు.

"నేను ఫాషన్‌గా లేనని రమ అంటేనూ...."

రమ షాక్ తిన్నట్టు చూసింది, తిరిగి తిరిగి తన మీదకు వచ్చిందేమిటా అని

కారు సినిమా హాలు దగ్గర కొచ్చేసరికి అది కొత్త సినిమా ఏమో జనం చాలా మందే వున్నారు.

"అబ్బ ఇంత రష్‌లో మనకు టిక్కెట్లు దొరుకుతాయా? అన్నాడు మూర్తి

"అయ్యో! ఈ సినిమా చాలా బాగుందని అన్నారు. దీనికే వెళదాం' అంది ప్రసూన పెంకిగా.

"ఫరవా లేదురా! టిక్కెట్లు నేను తీసుకు వస్తాను నాకు తెలిసినతను వున్నాడు మూర్తి పర్స్ ఇలా ఇవ్వు!" అంటూ కాశీపతి ఆ జనంలోకి వెళ్ళాడు అందరు ఆతృతగా చూస్తూ వుండగా కాశీపతి చెమట్లు కక్కుతూ టికెట్లు తో తిత్తితో బయటవచ్చాడు.

"సినిమా మొదలై చాలా సేపైందటరా! రండి, రండి" అంటూ తొందర పెట్టాడు కాశీపతి.

చీకట్లో తడుముకుంటూ వాళ్ళ కాళ్ళు వీళ్ళ కాళ్ళు తొక్కుతుంటూ, మొత్తానికి వాళ్ళ కోసం వేసిన రేకు కుర్చీల్లో అక్కడో కళ్ళు ఇక్కడో కళ్ళు చప్పున కూర్చున్నారు.

ఆఖరికి భర్త పక్కన కూర్చుని సినిమా చూద్దామన్న కోరిక కూడ తీరకుండా అత్తగారు ఒక పక్కన, తోడికోడలు ఒక పక్కన కూర్చున్నారు రమకి!

"బాబాయ్! దాహం. బాబాయ్ బాత్‌రూమ్!" అంటూ మూర్తిని తలో కరు తలో కసారి బయటకు తీసుకెళుతునే వున్నారు.


"పాపం, పిల్లలెవ్వరూ సినిమా చూడనివ్వటం లేదు మూర్తిని' అని జాలి పడింది రమ.

సినిమా మంచి సీరియస్ ఘట్టంలో వుండగా, కెవ్వున ఏడుపు ప్రారంభించాడు ధనం కొడుకు.

"అయ్యో! పాలసీసా పెట్టిన సంచి మీ బావగారి దగ్గరే వుంది రమా! నేను వెళ్ళి పట్టుకొస్తాను కాని కాస్త బాబును ఎత్తుకో" అని పురమాయించి రమకి బాబుని అందించి తడుముకుంటూ వెళ్ళింది ధనం

రమ ఒడిలోకి తీసుకోగానే చీరంతా తడిపేసాడు పసివాడు రమ ఉస్సూరుమని నిట్టూర్చింది. పసివాడు ఎత్తుకున్నా శృతి తగ్గించకుండా





ఏడుస్తున్నాడు. చుట్టుపక్కల వాళ్ళు సన్నగా సణుక్కుంటున్నారు

"ఏమ్మా! అలా చూస్తూ వూరుకోకపోతే బయటకు తీసుకెళ్ళరాదు మేమైనా సినిమా చూస్తాం" అంటూ ఎవరో నిర్మొహమాటంగానే విసుక్కున్నారు రమ ఉక్రోషంతో బాబుని తీసుకొని విసవిస బయటకు వచ్చేసింది

"అదేమిటి, నువ్వు ఇక్కడున్నావా! లోపలంతా నీ కోసం వెతుక్కొంటూ వచ్చాను" అంటూ పావుగంట తరువాత ధనం వచ్చింది

బయట చల్లని గాలికి బాబు ఏడుపు మాని చుట్టు ప్రక్కల చూస్తూ ఆడుకుంటున్నాడు

'ఆ పాలసీసా ఇటు ఇచ్చి మీరు వెళ్ళండి'

"అదేం నువ్వు రావా!"

"ఊహు (మరీ రావాలనిపిస్తే వస్తాలెండి

"సరే. నీ ఇష్టం అంటూ ధనం వచ్చినంతవేగంగా వెళ్ళిపోయింది

రమ ఒడిలో బాబు నిద్రపోయాడు ఆ తరువాత మళ్ళ లోపలికి వెళ్ళలేదు రమ

"రమా! కోపం వచ్చిందా!' మూర్తి ఇంటి కొచ్చాక డ్రస్ మార్చుకుంటూ అన్నాడు.

"లేదు" అంది ముభావంగా.

"మరి అన్నం తినలేదేం ("

"ఆకలి లేదు"

"సారీ రమా! మన మొదటి సినిమా ఈ విధంగా అవటం నాకు బాధగానే వుంది" అతని గొంతులో సిన్సియారిటి వుంది

* * * * * *

"మీరు విజయవాడ వెళుతున్నారట కదా! వెళుతూ గుంటూరు వెళ్ళి అక్కయ్యను కూడ తీసుకెళ్ళండి. అదీ అందరితో కలిసి సరదాగా వుండి వస్తుంది" అంది సుందరమ్మ మూర్తికి పెరుగు వేస్తూ.

పక్కనే వున్న రమ మూర్తి ఏమంటాడో అన్నట్టు చూసింది అతని వంక.

"గుంటూరు వెళ్ళి విజయవాడ అంటే చుట్టు తిరుగుడు అవుతుంది. అదైనా పిల్లలతో అప్పటికప్పుడు రావటం కష్టం." అన్నాడు.

"మీ బావ ఎటూ దాన్ని ఎక్కడికి తీసుకెళ్ళడు. మీరు కూడ అలా అంటే ఎలాగురా! ఏదో మీ వంకనైనా అది చూసి వస్తుందని సంబరపడ్డాను. చిన్నన్నయ్యా గారింటికి వెళ్ళాలని చాలా సార్లు అంది నాతో.

"మేము ఒకటి రెండు రోజులుందామనుకుంటున్నామమ్మా! ఇంకోసారి తీసుకెళతాంలే దాన్ని" అంటూ మూర్తి మరో మాటకు తావివ్వకుండా చేయి కడుక్కుని వెళ్ళిపోయాడు.

"మీకంత కష్టంగా వుంటే వద్దులే! అయినా పెళ్ళాం వచ్చాక తల్లి మాటకు విలువేముంటుంది" మూర్తికి విన్పించకపోయినా, ఈ మాటలు రమను వచ్చి చేరాయి!

సాయం సంధ్య దాటుతుండగా రమ, మూర్తి కారులో బయలుదేరారు ఒక ప్రక్క పంట కాలువ, మరో ప్రక్క పచ్చని చెట్లు ప్రయాణమంతా కబుర్లతో, ఆహ్లాదంగా గడిచింది.

విజయవాడ చేరుకోగానే నటరాజ్ రూఫ్‌గార్డెన్‌లో భోజనం చేసి, ఒక రూమ్ బుక్ చేసాడు మూర్తి.

"అదేమిటి. మనం ఇలా వేరుగా హోటల్లో దిగితే వాళ్ళేం అనుకుంటారు' రమ సంశయంగా అంది.

"అన్నయ్య వాళ్ళిల్లు చాలా చిన్నది రమా! మనం వెళ్ళి వాళ్ళని ఇబ్బంది పెట్టటం నాకిష్టం లేదు."

మూర్తిని, రమని చూడగానే ఆనందపడిపోయారు యశోద, విశ్వనాథ్‌లు.

"అదేమిటిరా మీ వదిన శ్రమపడి పోతుందనా, హోటల్లో భోజనం చేసి వచ్చారు."

"లేదన్నయ్యా! భోజనాల పేరుతో టైమ్ వేస్ట్ చేయటం ఇష్టంలేదు. అందరం సరదాగా కబుర్లు చెప్పుకుందామని."

యశోద అప్పటికప్పుడు గుప్పెడు సగ్గుబియ్యం ఉడకపెట్టి 'పరవాణ్ణం' కాచి అందరికి ఇచ్చింది.

"ఇప్పుడెందుకండి. అనవసరంగా శ్రమ" అంది రమ.

"అయినవారి కోసం శ్రమ పడటంలో ఆనందం వుంది రమా! అందులో మొదటిసారి వచ్చిన నూతన జంట. భోజనం ఎటూ చేసే వచ్చారు "

అందరూ కబుర్లు చెప్పుకుంటూ అరుబయట కుర్చీలేసుక్కూర్చున్నారు. పిల్లలిద్దరూ చదువుకుంటూనే నిద్రల్లోపోయారు.యశోద పక్కలు వేసి పడుకోబెట్టి వచ్చింది.

ఉన్న రెండు గదులనే పొందిగ్గా, అందంగా సర్దుకున్న యశోద నేర్పరితనానికి రమ ఆశ్చర్యపోయింది. అంతే కాదు, వాకిట్లో వున్న కాస్త జాగాలో నే బోలెడు పూల మొక్కలు పెంచింది.

"నీ ఉద్యోగంతో పాటు ఈ తోట పనికి తీరుబడి ఎక్కడది వదినా!" అన్నాడు మూర్తి జంటగా వూగుతున్న తెల్ల గులాబీలను చూస్తూ.

"నాకీ పూల మొక్కల్ని చూస్తుంటే సున్నితంగా పెరిగే ఆడపిల్లలు గుర్తుకు వస్తారు మూర్తి! ఆ లోటు ఈ విధంగా తీర్చుకుంటున్నాను." యశోద మాటలకు అంతా నవ్వారు.

(ఇంకా ఉంది)

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

బి. ఎస్. ఎన్. రాయచూరు.

★ వివాహమై పాతికేళ్లయినా, సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగం చేస్తున్నా - అల్లుళ్లు ఆఫీసర్లయినా, కొడుకు ఇంజనీరు అవుతున్నా తను పుట్టినింటి నుంచి తెచ్చుకున్న ఆస్తే గొప్పది కాని నా ఆస్తి నా సంపాదన లెక్క లేదన్నట్టు మాట్లాడుతుంది. పేద కుటుంబంలోని పిల్లనే చేసుకుని వుంటే హోదా ఆస్తి అంతస్తు గల వ్యక్తి భార్యగా ఆమె మనస్తత్వం ఎలా వుండేది?

● ఆమెది కాదు – మీదెలా వుండేదీ. 'ఏగానికి దిక్కులేని నిన్ను ఎంత దాన్ని చేశానో చూసావా? అని క్షణం క్షణం జ్ఞాపకం చేసి వుండవా? ఆడదానికి డబ్బుకంటే – మీరామెకిచ్చే ఆదరాభిమానాలు గౌరవం చాలా ముఖ్యం. మీరామెని డబ్బుతో కొలిస్తే ఆమె మిమ్మల్ని డబ్బుతో నే కొలుస్తుంది.... మీ భార్యకు మీరిచ్చిన ప్రత్యేకత ఏమిటి?!

డి. ఎస్. కె. మల్లేపల్లి.

★ నా వయసు 20. నేను ఒక అబ్బాయిని ప్రేమించాను. అతను నన్ను ప్రేమించాడు. ఒకరినొకరం ప్రేమించుకున్నాం. కాని మా పెద్దలు అతనికి ఆస్థి లేదు అని యింకో సంబంధం నాకు ఖాయం చేశారు.

● ఏం? అతని సంపాదనతో మేం బ్రతకగలం అన్న ధైర్యం లేదా?! ప్రేమ గొప్పదే గాని అది పెరిగి విస్తరించడానికి ఆర్థికమైనదన్నా కావాలి – అది స్వశక్తి మీద వచ్చినదై వుండాలి. లేకుంటే – ప్రేమా లేదు గీమా లేదు –

జి. వి. జి. హైదరాబాదు.

★ కంటికి కనిపించేది నిజం కాదా?

● కంటికి కనిపించేదేదీ – కనిపించేలాంటి నిజం కానక్కరలేదు. నిజం అనిపించేది కొన్ని కొన్ని సార్లు నిజానికి బహు దూరం కావచ్చు.

వి. బి. ఆర్., వి. ఎస్. ఆర్., వి. బి. ఎల్. గంభీర రావుపేట


★ మీరు రాసిన 'దిన దిన గండం' నాటిక విన్నాం. దాని ఆధారంగా సినిమా తీయదల్చు కుంటే మీ అనుమతి లభిస్తుందా?

● ఎలా? దాన్లో శృంగారపు కుస్తీ పట్లు, భీకర పోరాటాలు ఎలా పెట్టడం?!

పి. ఎస్. ఎస్. కిచ్చాడ.

★ నేడు స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలు వేరే చెప్పక్కరలేదు. వరకట్నం నిర్మూలిస్తామని, శిక్ష వేస్తామని సవాల్ చేసిన ప్రభుత్వం ఏం చేస్తోంది?

● మంత్రాలకు చింతకాయలు రాలవని తెలుసుకుంటోంది. చట్టం మనిషికి ధైర్యాన్ని యిస్తుందే గాని –సమస్యని పరిష్కరించదే. దాని సహాయం అర్థించిన వారి కది ఉపయోగ పడుతుందే గాని...అందర్నీ ఏం చెయ్యలేదు. మనం చట్టాన్ని చుట్టి చాకచక్యంగా- నడచుకోడం నాగరికులం...మన తెలివి ముందు దాని బలం వమ్ము అవుతోంది.



డి. ఎన్. ఆర్. సూళ్ళూరుపేట

★ నేటి రాజకీయాలపై మీ అభిప్రాయం? మీది ఏ పార్టీ?

● 'సాపాటు' పార్టీ నాది! భోంచేసి కూర్చుని గాని రాజకీయాలిని చర్చించలేను! అంచేత ఎలా అభిప్రాయం చెప్పేది స్వామీ?!

వి. ఎస్. కరీంనగర్

★ ఆడది స్వార్థం గురించి ఆలోచిస్తుందే గాని సమాజం గురించి ఆలోచించదు. మీరేమంటారు?

● ఏముంది సంజీవా, ఆమె భర్త, ఆమె పిల్లలు, ఆమె చుట్టపక్కాలు, స్నేహితులు –వాళ్లే కద సమాజం?! లేక వేరే వుందా?!

వి. వి. ఆర్. భువనేశ్వర్

★ నేను ప్రేమించిన అమ్మాయి నన్ను మరిచిపోయింది. నేను ఏమి చేయాలి! నేను ఆమెని మరిచిపోలేను. అసలు ప్రేమంటే ఏమిటో తెలియని ఆడపిల్లలు మగపిల్లలని ఎందుకు ప్రేమిస్తారు? వారిని దేవదాసులను చేయాలనా?

● ప్రేమంటే ఏమిటి? మీ దృష్టిలో. అబ్బాయి ప్రేమించానంటే- పాదాల దగ్గిర వాలే అమ్మాయిలకే ప్రేమంటే తెలుసుననా? దేవదాసు ఎస్కేపిస్టు. అందుకే అలా తయారయ్యాడు.

ఎస్. వి. వడ్లమూడి

★ నేను ఒకచోట ఆడవాళ్ల మనసు తెలుసుకోవడం కష్టం అని విన్నాను. నా దృష్టిలో మగవారి మనసు తెలుసుకోవడమే కష్టం. మరి మీ దృష్టిలో?

● నేను మనసులు చదవను! మనిషినే అంచనా వేస్తాను.

ఎన్. ఆర్. విజయవాడ

★ నేను ఇంటర్ చదివాను. ప్రస్తుతం ఇంటి దగ్గిర ఖాళీగా వున్నాను. కథలు, కవితలు రాద్దామని వుంది. దీనికి డిగ్రీ కావాలా?

● కథలు కవితలు అల్లడానికి డిగ్రీ అక్కర లేకపోవచ్చు. కాని జీవితంలో కాస్త ధైర్యంగా నిలబడడానికి కావాలి. అవకాశం వున్నప్పుడు చదువు మానడం–తప్పు.

ఎన్. ఎల్. ఆర్. వేంద్ర

★ ఈ లోకంలో నిజం చెప్తే నమ్మడం లేదు. అబద్ధం ఆడ బుద్ధి కాదు. ఏం చేయాలి?

● మీ చుట్టూ నిజం నమ్మని వాళ్లే వుంటే నిజాన్ని అబద్ధం అని చెప్పండి. నమ్మరా?! మీకు నిజం చెప్పినట్టూ వుంటుంది. వాళ్లకి ఓ అబద్ధం విన్న ఆనందం మిగులుతుంది. □


మాటలకు మౌనానికి
మధ్య మధురక్షణాలు
ఏదియేమయినా ఫరవాలేదనుకొనే మధుర క్షణాలు
మీ జీవితంలో ఎన్నో. మౌనసామ్రాజ్యం వాడిలో
ఉద్వేగపూరితమైన నవ్వుతో—ఏకమైన వేళ.
ఇంకెవ్వరూ, కాదు ఈ ప్రపంచమే ఏమైనా ఫరవా
లేదు నిజమే. మీకు ఈ మధుర క్షణాలకు మధ్య
ఏదీ అడ్డురాకుండా ఉండేందుకు అవసరమైనది
కోహినూర్ లేత ఎఱుపు మీ మృదువైన ఆలో
చనలకు సున్నితత్వానికి రక్షణనిస్తుంది. శ్రేష్ఠమైన
లేటెక్స్‌తో తయారుచేయబడినది. పూర్తి రక్షణ
నివ్వడానికి ఎలెక్ట్రానిక్ సాధనాలతో పరీక్ష చేయ
బడినది. మృదువుగా ఉండేందుకు ల్యూబ్రికేట్
చేయబడింది.
KOHINOOR
లేత ఎఱుపు సుకుమారమైన కండోం
సరిక్రొత్త
ప్యాకింగ్‌లో
ముచ్చటగా
మూడు
ttk తయారీ.

తిరిగివచ్చిన వసంతం

'కిశోరి'



పడక గదిలో పట్టె మంచంపై మెత్తటి పరుపు మీద తెల్లని మల్లెపూవు వంటి దుప్పటిపై మేను వాల్చిన శ్రీకాంత్‌కు రాత్రి పది గంటలు కావస్తున్నా పడకగది చేరని భార్య శాంతిపై కోపం వచ్చింది అంతలోనే ఆ కోపం కరిగిపోయి జాలి వేస్తోంది వంట తప్ప పైపనంతా పని మనిషిని కూడా లేకుండా చేసి కోడలితో చేయించే అమ్మపైన ఆగ్రహం కూడా కలుగుతుంది కానీ తల్లిని ఏమీ అనలేని అసమర్థుడు [illegible] ఉల్పి తాయారమ్మ నోటికి కొడుకే కాదు భర్త ఇరుగు పొరుగు వారు కూడా జడుస్తారు ఇంటి పనంతా కోడలిచేత చేయించే తాయారమ్మ తన కూతురు రూపను మాత్రం అపు రూపంగా చూసుకుంటుంది కాఫీ గ్లాసు నుంచి అన్నం తిన్న కంచం కూడా తీయనిచ్చేదికాదు కోడలు కాపురానికి వచ్చిన మూన్నెళ్ళ నుంచి ఇదంతా చూసీ చూడనట్లు వుండిపోతాడు శ్రీకాంత్ తల్లిపైన ఎంత కోప మొచ్చినా చేసేదేమీ లేక బాధపడేవాడు

పసిమి చాయతో సన్నగా, నాజూగ్గా, అందంగా, విశాలమైన నేత్రాలతో అమాయకమైన ముఖంతో అందమంతా పోతపోసిన విగ్రహంలా వున్న శాంతికి పెళ్ళి చూపులనాడే మనసర్పించేశాడు శ్రీకాంత్ పెళ్ళిలో ఐదు వేలు కట్నం తక్కువై దని, నిదానంగా సర్దుతామని శాంతి తండ్రి కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమిలాడగా ఎంతో రాద్ధాంతం చేసి చివరి కెలాగైతేనేం కొడుకుచేత తాళిబొట్టు కట్టించడానికి ఒప్పుకుంది తాయారమ్మ అది కూడా అయిదువేలూ ఆరు మాసాలలోగా తెచ్చి ఇచ్చే ఒప్పందంపైన ఇవన్నీ చూస్తున్న శ్రీకాంత్‌కు సిగ్గుతో తల కొట్టేసినంత పనైంది కానీ ఆ సమయంలో తనేదైనా కల్పించుకుంటే పెళ్ళి కూడా ఆపించేస్తుంది తల్లి అంతటి మొండి మనిషామె అందుకే తనకు ఎంతో నచ్చిన శాంతిని పోగొట్టుకోవడం ఇష్టంలేక నోరు మూసుకుని వున్నాడు తను

శాంతి కాపురానికి వచ్చిన తర్వాత అతని జీవితం స్వర్గతుల్యమైనా ఆమె మాత్రం పగలంతా చాకిరీతో అలసి రాత్రి అందరూ పడకలు చేరాక, ఆమె పడకగది చేరబోయేసరికి రాత్రి తొమ్మిదిన్నరకు తక్కువకాదు అంట్లు గిన్నెలు కూడా కోడలిచేత రాత్రే తోమించేది తాయారమ్మ పగలంతా పనితోటి అలసిపోయినా రాత్రివేళ భర్త ప్రేమానురాగాల మధ్య పరవశించి పోయేది శాంతి

పనితో అలసి సొలసిన శాంతిని సుకుమారంగా దగ్గరకు తీసుకునేవాడు

శాంతీ! ఇంటెడు చాకిరీ అమ్మ నీచేత చేయిస్తుంటే నా మనసెంతో బాధకు గురౌతుంది కానీ ఆమెకు ఎదురు చెప్పలేని అసహాయుణ్ణి అంటూ ఆమె చేతుల్లో ముఖం దాచుకునేవాడు

బాధగా

అతనలా అంటుంటే ఆమె అలసటంతా ఎగిరి

పోయేది అతని నోటికి సున్నితంగా తన చేయి అడ్డు పెడుతూ

అలా అనకండి! అత్తగారి మనస్తత్వం అంత అయినా ఇందులో మీరు బాదపడవలసిందేముంది? మన ఇంటి పని మనం చేసుకుంటున్నాం అంతేకదా అనేది నవ్వుతూ

ఎంత తేలిగ్గా అన్నావు శాంతీ! మా చెల్లాయి చూప కూడా నీయీడుదేగా! దానితో ఒక్క పని కూడా చేయించదు అమ్మ ప్రతి పనీ నీచేతే చేయిస్తుంది ఇది న్యాయమేనంటావా? ఆమె కళ్ళలోకి సూటిగా అడిగేవాడు

అతని మాటలకు తేలిగ్గా నవ్వేసేది శాంతి

ఎవరి బిడ్డలు వారి కపురూపం ఇందులో తప్పేముంది ఇంటి కోడలిగా నాకామాత్రం బాద్యత లేదంటారా? అయినా నేనేమంత కష్టపడి పోవడం లేదు లెండి అంటూ ఆ మాట మార్చివేసేది శాంతి

శాంతి కెంత సహనం! అనుకుని ఆశ్చర్యపోయే వాడు శ్రీకాంత్ ఆమె విశాల మనస్తత్వం సహనం ఆమె అందానికి మరింత మెఱుగులు దిద్దేవి అందుకే శాంతి కాపురానికి వచ్చి మూడు నెలలే అయినా ప్రాణ సమానమైంది శ్రీకాంత్‌కు ఎంత ఆమె అతనికి ప్రాణప్రదమైనా పదిమంది తెల్లవారి అయిదు గంటల వరకే ఆమె సాన్నిధ్యం అతనికి లభించేది తెల్లారి అయిదు నుండి మళ్ళీ రాత్రి దాకా అతని కంట బడేదికాదు ఒకవేళ కంటబడినా ఏదో ఒక పనిలో పూర్తిగా నిమగ్నురాలై వుండేది చివరికి బోజనాల వద్ద కూడా అతనికి తల్లే వడ్డించేది తండ్రితో పాటు అతనికేమో భార్య ఆప్యాయంగా కొసరి కొసరి వడ్డిస్తుంటే తినాలని కోరిక కానీ ఆ ముచ్చట తీరేది కాదతనికి తల్లి వాకిట వున్నపుడు కూడ చెల్లెలినే వడ్డించమనే తల్లిపై పీకల దాకా కోపమొచ్చే దతనికి అయినా ఏమనేవాడుకాదు

ఆఫీసు నుండి వస్తూ మూడు మూరలు జాజి పూలు తెచ్చేవాడు తలా ఒక మూర పెట్టు కుంటారని జాజిపూలంటే అతనికి ప్రాణం తలనిండా పూలతో బార్య కనిపించాలని అతని ఆరాటం కానీ అతని తల్లి జానెడు దండ మాత్రం కోడలి కిచ్చి మిగిలినవి తల్లీ కూతురు అలంక రించుకునేవారు అది చూసి అతని ప్రాణం వుసూరు మనేది పోనీ తగ్గించి తెస్తే ఇంకా తగ్గించి శాంతికిస్తారేమోనని బయపడి రోజా మూడు మూరలే తెచ్చేవాడు ఆ రోజు ఆఫీసు నుండి వస్తూ చక్కని గులాబీ పూలు కనపడితే మూడు తీసుకు వచ్చాడు అతను ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి బావమరిది పదహారేళ్ళ ప్రకాశం కనిపించేసరికి ఆనందంతో ఏమిటోయ్ ప్రకాశం! ఇదేనా రావడం? అయినా చెప్పా పెట్టకుండా వచ్చేశావేమిటి? కాలేజీకి స్ట్రైకా? అని అడిగాడు

స్ట్రైక్ కాదు బావా! అమ్మకు ఆరోగ్యం బాగా లేదు అక్కను చూడాలనీ అంటుంటే పిలుచుకు రమ్మని నాన్న నన్ను పంపారు అన్నాడు బాదగా ఆ మాటలకు హతాశుడయాడు శ్రీకాంత్

శాంతిని పంపడమే? శాంతిని చూడకుండా తను వుండలేని స్థితికి వచ్చాడు అందుకే ప్రకాశం శాంతిని పిలుచుకెడతానంటే అతనికి ఎదల్లో ముల్లు గుచ్చుకున్నట్లయింది కానీ అంతలోనే అత్తగారికి బాగా లేదని గుర్తుకు వచ్చి బాద కలిగింది ఎంతైనా శాంతిని కన్నతల్లి శాంతికి మాత్రం చూడాలని వుండదూ! అని ఆలోచిస్తున్న శ్రీకాంత్


ఏం బావా! మాట్లాడవు? అక్కను పంపవా? అని దీనంగా అడిగాడు

మాట్లాడేందు కేముంది? పిలుచు కెడుదువు గానిలే అన్నాడు శ్రీకాంత్

మరి అత్తమ్మ పంపనంటున్నారు అతని కళ్ళల్లో అక్కను పంపనన్నందుకు తీలగా బాధ కదులాడింది

అమ్మకు నే చెపుతాలే నీవేం బాధపడకు అని అన్నాడే కానీ తల్లి నెలా ఒప్పించాలో బోధ పల్లే దతనికి బావమరది ముందు తన పెద్దరికం నిలబెట్టుకోడానికి డంబంగా చెప్పేశాడు

వంటింట్లో తల్లి వంట ప్రయత్నం చేస్తుంటే శాంతి కూరలు తరిగి పెడుతుంది తల వంచుకుని తరుగుతున్న ఆమె ముఖం చూడడానికి ప్రయ త్నించాడు కానీ ఆమె వంచిన తల ఎత్తలేదు తన రాకను గమనించి తన వైపు చూస్తుందన్న అతని ఆశ నిరాశ అయింది భోజనాలయిన తరువాత బావమరిదితో కాసేపు కబుర్లు చెప్పి తొమ్మిదిన్నర కంతా పడక గది చేరి శాంతి కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు పదిన్నర కావస్తుండగా మంచి నీళ్ల చెంబుతో గదిలోకి వచ్చి టేబుల్ పైన పెట్టి, అలాగే వంచుకుని నిలబడిపోయింది



ఆమె రాకతో అతని కోపం మంచులా కరిగి పోయింది అదేమిటి శాంతీ! అలా నిలబడి పోయావు? ఇలారా! అంటూ ఆహ్వానించాడు పడక పైకి

కానీ ఆమె కదలక తల వంచుకుని అలాగే నిలబడి పోయింది టేబుల్ క్లాత్ అంచులు సవరిస్తూ

ఏమిటి శాంతీ! కోపం వచ్చిందా? అంటూ లేచి ఆమె చెంత కెళ్ళాడు ఎడమ చేతో ఆమెను చుట్టివేసి, కుడి చేతో చుబుకం బట్టి తన వైపు తిప్పుకున్నాడు ఆమె ముఖాన్ని

శాంతి కళ్ళ నిండా నీళ్ళు అవి బయటకు రాకుండా శత విదాలా ప్రయత్నిస్తున్నట్లు క్రింది పెదవి ముని పంటితో నొక్కి పట్టింది

అది చూసి కలవర పడ్డాడు శ్రీకాంత్

శాంతీ! ఏమైందీ? ఆదుర్దాగా అడుగుతూ ఆమెను హృదయానికి చేర్చుకున్నాడు

ఆమెకు ముఖం వెల్లువలా పొంగి ఇక ఆ కన్నీళ్లను ఆపలేక అతని గుండెలకు మరింతగా హత్తుకుపోయింది

ఏమిటి శాంతీ! చెప్పవూ? ఆందోళనగా అడు గుతూ ఆమెను నెమ్మదిగా నడిపించి మంచం వద్దకు తీసుకెళ్ళాడు

ఆమె వెక్కి వెక్కి ఏడ్చిందే గాని ఏమీ చెప్పలేక పోయింది ఆమె ఏడుపు అతన్ని మరింతగా బాధ కలిగించింది

చెప్పు శాంతీ! ఏమైందీ? మీ అమ్మగారి ఆరోగ్యం బాగా లేదనేనా? చెప్పు నేను అమ్మకు చెపుతాను వెళ్ళువు గానీలే వూరుకో లాలనగా అంటూ ఆమె తలపై చేయి వేసి నిమరసాగాడు అయిదు నిముషాలకుగాని మామూలు మనిషి కాలేక పోయింది శాంతి

అతను మళ్ళీ అడిగాడు ఎందు కేడ్చావని?

ఏమీ లేదన్నట్లుగా తల తిప్పింది

కాదు చెప్పు ఏం జరిగిందో? అమ్మ నిన్నేమైనా అందా? చెప్పు శాంతీ! చెప్పకుంటే నా పైన ఒట్టు అన్నాడు ఎలాగైనా ఆమె నుండి సమాదానం రాబట్టాలని బలమైన కారణం లేందే ఆమె అంతగా ఏడవదని అతనికి తెలుసు

అతను ఒట్టు పెట్టుకోగానే ఆమెకు చెప్పక తప్పలేదు కాలం ఎంతగా మారుతున్నా ఒట్టంటే చాలా మందికి భయం ఒట్టు అనగానే నిజం చెప్పేస్తారు అలాటి వారిలో శాంతి ఒకటి అని గ్రహించిన శ్రీకాంత్ ఒట్టు పెట్టుకున్నాడు

ఆ రోజు సాయంత్రం ప్రకాశం రాగానే జరిగిన సంఘటన ఆమె కళ్ళ ముందు మెదిలింది

* * * * *

ప్రకాశం తల్లికి బాగా లేదని అక్కను పిలుచు కెళదామని వూరి నుండి వచ్చాడు అతను కాళ్ళు కడుక్కుని రాగానే

ఏం నాయనా! అందరూ బాగున్నారా? అని అడిగింది తాయారమ్మ

ఆ బాగున్నారు అత్తమ్మా! కాని అమ్మ కీమధ్య ఆరోగ్యం బాగా లేదు అక్కయ్యను చూడా లంటుంది మిమ్మల్నడిగి అక్కయ్యను పిలు చుకు రమ్మని పంపారు నాన్న అన్నాడు చిన్నగా

తిరిగి వచ్చిన వసంతం

ఆ మాటలకు గయ్యిమని లేచింది తాయారమ్మ

ఏమిటేమిటీ? పిలుచుకు రమ్మని పంపారా మీ అక్కయ్యనూ? మాకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చాకే మీ అక్కను మీ యింటికి పంపేది అందాకా పంపేది లేదు పెళ్ళప్పుడు కట్నం మొత్తం పాతిక వేలంటే ఏదో పిల్ల బాగుంది కదా! అని ఒప్పుకున్నాం కానీ ముష్టి పాతిక వేలేం ఖర్మ! ముప్పై వేలిస్తామని వచ్చారు అది కాదని మీ సంబంధం ఖాయం చేసుకున్నాం తీరా పెళ్ళప్పుడు అయిదు వేలు తక్కువిచ్చారు త్వరగా ఇస్తామంటే ఏదో లెమ్మని ఒప్పుకున్నాం మీ అక్క కాపురానికి వచ్చి మూణ్ణెళ్ళయినా డబ్బు గురించి ఎక్కడ మేము అడుగుతామోనని తిరిగి చూశ్శేదు మీ నాన్న ఇప్పుడు నిన్ను పంపారా? చాకిరీ కోసం పిలుచుకుని రమ్మని? అంటూ పసివాడని చూడకుండా దులిపి వేసింది తాయారమ్మ

చాకిరీ కోసం పిల్చుకు రమ్మనలేదు నాన్న అమ్మ అక్కను చూడాలని కలవరిస్తుంటే అంటూ అత్తగారి మాటలకు ఆ పసి మనసు గాయపడగా నసిగాడు

అవునవును మీ అక్కను చూడాలని ఎందు కుండదూ? మా కివ్వాల్సిన డబ్బు మా కిచ్చేస్తే మీ అక్కను పంపమన్నామా? అంటూ దీర్ఘం తీసింది

నాన్నగారు మీ డబ్బు ఇవ్వాలనే అనుకున్నారు అత్తమ్మా అప్పు కోసం చాలా చోట్ల ప్రయత్నించారు కానీ ఎక్కడా అప్పు దిక్కలేదు అందునా అమ్మకు ఆరోగ్యం బాగాలేక మందులకే ఐదు వందల దాకా ఇక్కడా అక్కడా బాకీలు చేశారు మీ డబ్బు త్వరలో ఇస్తామని చెప్పమన్నాడు నాన్న

ఏమిటేమిటీ? మీ అమ్మగారి మందులకైతే అప్పు పుడుతుంది మా కివ్వాల్సిన డబ్బుకు మాత్రం అప్పు పుట్టదు బలేగా మాట్లాడుతున్నావురా అబ్బాయ్! అయినా ఆ డబ్బు ఇచ్చేదాకా మీ అక్కను పంపమని ఖచ్చితంగా చెప్పేశాముగా! మళ్ళీ ఏ ముఖం పెట్టుకుని పంపారు నిన్ను

తలుపు మాటున నిలబడి వింటున్న శాంతిక మనసుకు బాణాల్లా తగిలాయా మాటలు ప్రకాశం అత్తగారితో మాట్లాడుతుంటే చిన్నవాడు దురుసుగా ఏమైనా అంటాడేమోనని భయపడి తలుపు చాటే నిలబడిపోయింది శాంతి అత్త గారి మాటలకు ప్రకాశం మనసు కూడా గాయపడింది అక్కను చూడాలనే ఆత్రంతో నాన్న పొమ్మనగానే వచ్చాడు గాని రాక్షసి లాటి అత్త గారిని తలచుకుంటే మాత్రం భయం వేసింది అక్కను చూడక చాలా

ఏళ్ళినట్లనిపించి నాన్న వెళ్ళమనగానే ఒప్పుకున్నాడు తను ఇప్పుడు అత్తగారి మాటలు వింటుంటే "ఎందుకు వచ్చానా?" అని బాధ పడసాగాడు అయినా మొండిగా మళ్ళీ అడిగాడు

"అయితే అక్కను పంపరా అత్తమ్మా?" అని

"పంపను గాక పంపను ఖచ్చితంగా చెప్పిందావిడ

ఆమె అంత ఖచ్చితంగా చెప్పేసరికి "ఒట్టి డబ్బు మనుషులు" అనుకుంటూ వెంటనే వెళ్ళిపోతానని అక్కతో చెప్పాడు లోనికి వెళ్ళి బాధగా కోపంగా

"వద్దు నాన్నా! మీ బావగారు వచ్చిన తర్వాత రాత్రి నేనడుగుతాలే ఆయనను రేపు వెళ్దాము అత్తమ్మ తీరే అంత నీవు బాధపడకు" అంటూ తమ్ముణ్ణి ఓదార్చింది శాంతి

తమ్ముణ్ణయితే ఓదార్చగలిగింది గానీ భర్త మాట ఆ యింట్లో చెల్లదని ఆమెకూ తెలుసు అత్తగారు ఇందాక తమ్ముడితో అన్నమాటలకు ఆమె తల గిర్రున తిరిగినంత పనైంది మరీ ఇంతగా డబ్బు మనిషి అనుకోలేదు తను నోటి దురుసు మనిషి మాత్రమే అనుకొంది ఇప్పుడు ఆవిడ మాటలు వింటుంటే చాలా బాధ కలిగింది ఆవిడ మాటలకు నొచ్చుకుని "పూరెళ్తానన్న" తమ్మునికి నచ్చచెప్ప డానికి ఆ మాటలు అంది కానీ ఆ మాటలు ముందు గదిలో వున్న అత్తగారు వింటారన్న మాట మరిచిపోయింది

"ఏమిటీ అన్నావ్? నా మాటను కాదని వాడిని అడుగుతావా? నా మాటకంత విలువ లేదనుకున్నావా నా యింట్లో?" నా తీరే అంత అని ఆ కుర్రాడితో అంటావా? నా తీరేం చూశావే నువ్వు? నిన్నేదో రాచి రంపాన పెడుతున్నట్టు మాట్లాడు తున్నావే? అమ్మో!అమ్మో! ఇంకేముంది? ఏదో మూంగిలాగా ఎవరితోనూ మాట్లాడకుండా వుంటే అమాయకురాలివే అనుకున్నాను ఎంత లేసి మాట లన్నావే? పైగా నా కొడుకు నడిగి వెళ్తావా?వాడు నీకు మొగుడైతే కావచ్చుగానీ నాకు కొడుకని నే గీచిన గీటు దాటడని మర్చిపోకు నీ కులుకూ, వగలూ చూపి వాడిని వళ్లో వేసుకుందామని చూస్తున్నావేమో? అదంతా కుదరదు మీ నాన్న ఆ ఐదు వేలూ ఇచ్చేదాకా నీవా యింటి గడప త్రొక్కడానికి వీల్లేదు బిడ్డ కావాలనుకునే వాళ్ళయితే డబ్బు ఇచ్చి నిన్ను తీసికెళ్ళమని చెప్పి పంపు నీ తమ్ముడితో అంతేగానీ అమ్మకు బాగా లేదనీ, అయ్యకు బాగాలేదనీ అంటే జాలి తలచి పంపే జాలి గుండెలు ఇక్కడెవరికీ లేవని చెప్పి పంపు" అంటూ ఊంకెలు వేసింది

అత్తగారి మాటలకు హతాశురాలై గుడ్ల నీరు కుక్కుకుంటూ అవతలి గదిలో కెళ్ళిపోయింది శాంతి ఇదంతా చూస్తున్న ప్రకాశానికి మనసు కలిచి వేసినట్లయింది తను చిన్నవాడు ఏదీ మాట్లాడలేక ముందు గదిలోకి వెళ్ళిపోయాడు

★ ★ ★ ★ ★

శాంతి చెప్పిందంతా విన్న శ్రీకాంత్ నిట్టూర్చాడు ఆమె తల నిమురుతు

"శాంతీ! అమ్మ మాటలకు నీవు బాధపడకు ఆమె ఒక చాదస్తపు మనిషి డబ్బుకే ఈ ప్రపంచంలో విలువ వుందనుకుంటుంది కానీ, ఆప్యాయత, ఆదరణకు విలువ నివ్వదు దీనికేమైనా పరిష్కార మార్గం నేనాలోచిస్తాను నీ విలా బాధ పడుతూ కూర్చుంటే నా మనసెంత వేదన పడుతుందో తెలుసా? నేను నిన్నేమైనా అంటే నీవు బాదపడాలి కానీ అమ్మ మాటలు పట్టించుకోకు" అంటు ప్రేమగా ఓదార్చాడు భార్యను

అతని ప్రేమతో, లాలనతో తన బాధనంతా మరిచిపోయింది శాంతి నిజమే మరి అతనేదైనా అంటే తను బాద పడాలి కానీ మిగిలినవారితో నాకేమి పని? ఇంత సహృదయుడూ, ప్రేమమూర్తి అయిన భర్త లభించడం నా అదృష్టం అనుకుంటూ ప్రశాంతంగా, నిశ్చితంగా అతని ఎదపై తలవాల్చి నిద్రపోయింది

చాలాసేపు శాంతినే చూస్తూ ఆలోచనలో పడిపోయాడు చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాక మనసు తేలికైందతనికి 'రేపు అలా చేయాలి" అనుకుంటూ శాంతిని సరిగా పడుకోబెట్టి లైట్ ఆఫ్ చేసి బెడ్‌లైట్ వేసి పడుకున్నాడు ప్రశాంతంగా నిద్రపోతున్న భార్యను దగ్గరకు లాక్కుని

★ ★ ★ ★ ★ ★

మర్నాడు ఉదయం ఆఫీసు కెళ్ళే ముందు డైనింగ్ టేబుల్ ముందు భోజనానికి కూర్చున్న శ్రీకాంత్

"అమ్మా!" అని ఆప్యాయంగా పిలిచాడు వడ్డిస్తున్న తల్లిని

"ఏం బాబూ " అని అడిగింది ప్రేమగా, కొడుకు వంక చూసింది కంచంలో అన్నం పెడుతూ

శాంతిని ప్ర కాశంతో పంపేద్దామిరోజు" అన్నాడు అన్నంలో కూర కలుపుకుంటూ

అందాకా ప్రశాంతంగా వుండిన తాయారమ్మ ఆ మాటలకు రుద్రకాళి అయి కొడుకు వంక తీక్షణంగా చూస్తూ

"ఏరోయ్? రాత్రి బాగా తలకెక్కించిందే అది నీకు ఫర్వాలేదు ఏమో అనుకున్నాను" అంది

"అది కాదమ్మా

ఏది కాదురా? " తీక్షణంగా అడిగింది

"నే చెప్పేది సాంతం వింటావా?" వినవా?" అన్నంలో అలాగే చేయి వుంచి తల్లి ముఖంలోకి చూస్తూ అడిగాడు

"ఏమిటో చెప్పు?" ఎంత శాంతంగా మాట్లాడా లనుకున్నా ఆమె గొంతులో కోపం ధ్వనిస్తూనే వుంది

శాంతిని ఇప్పుడు పంపేస్తూ మనకివ్వాల్సిన డబ్బు ఇచ్చేదాకామన ఇంటికి రావద్దంటే అప్పుడు చచ్చినట్లు తెచ్చిస్తారు పెళ్ళయిన ఆడపిల్లను ఎన్నాళ్ళని పుట్టింట్లో వుంచుకుంటారు? ఇరుగు పొరుగుల మాటలు భరించలేకనైనా వాళ్ళ నాన్న మనకివ్వాల్సిన డబ్బు తెచ్చిస్తారు ఏమంటావ్? అన్నాడు "నా అయిడియా ఎలా వుంది?" అన్నట్టుగా తల్లివైపు చూస్తూ

ఆ మాటలకు తాయారమ్మ కళ్ళలో తళుక్కున మెరుపు మెరిసింది ఆనందం తాండవించింది

"మా నాయనే! ఎంత బాగా ఆలోచించావురా?" అంటూ కొడుకు తలను రెండు చేతులతో నిమిరి మెటికలు విరుచుకుంది

"నిజమే నీవన్నట్టు ఎంత కాలమని పుట్టింట్లో ఆడపిల్లను పెట్టుకుంటారు? అప్పో సొప్పో చేసి ఆ డబ్బు తెచ్చిస్తారు నాకీ ఆలోచనే రాలేదు ఎంత బాగా ఆలోచిస్తావురా నాయనా! నీవు నా



కొడుకువనిపించుకున్నావు దాని మాయలో పడేసుకుందామనుకుంటుందది నిన్ను" అంటూ ప్రేమగా కొడుకు వంక చూసి పెరుగు మరింతగా వడ్డిస్తూ

తల్లి ఒప్పుకోవడం చూసి అమ్మయ్య' అని నిట్టూర్చాడు శ్రీకాంత్ మనసులో వంటింట్లో నుంచి ఈ సంభాషణ అంతా విన్న శాంతి అవాక్కయింది

ఎంత నయగారాలు? తన భర్త ఎంతో సహృదయుడని, తనను అర్థం చేసుకున్నాడని, తన తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి తెలిసినవాడనీ ఇలా ఎన్నో ఎన్నెన్నో వూహించుకుందితన మనసులో కానీ ఇలా అతనుకూడా డబ్బు మనిషని అనుకోలేదు

హు ఎంతైనా ఆ తల్లి బిడ్డేకదా ఈయన అంతకన్నా పెద్ద బుద్ధులు ఎక్కడనుండి వస్తాయి? ఏదో తన శారీరక వాంఛలు తీర్చుకోవ డానికి నయగారాలు పలికాడు తనవద్ద అదంతా నిజమేనని ఎంతో ప్రేమను పెంచుకొంది తను అతనున్నాడన్న ధైర్యంతో రాత్రినుండి ఈ క్షణం దాకా మనసెంతో తేలిగ్గా వుంచుకుంది కానీ ఈ క్షణం అతని మాటలు వింటుంటే అథఃపాతాళానికి కృంగిపోతున్నట్టనిపించింది అతనంటే ఇంతవరకు వున్న పేమ స్థానే కోపం, బాధా కలిగాయామెకు

ఈ రోజుతో ఈ యింటితో బంధం తనకు తెగి పోతుంది తన తండ్రి ఆర్థిక పరిస్థితి ఏమిటో తనకు తెలుసు తన పెళ్ళికి చేసిన అప్పే తలకు మించినంత వుంది మళ్ళీ అయిదువేలు అప్పు పుట్టటమంటే మాటలు కాదు తన పెళ్ళి అయిపోయాక నిదానంగా తీరుస్తామని చెప్పి వప్పించ వచ్చునుకున్నాడు తనతండ్రి కానీ పెళ్ళి పీటల మీదనే డబ్బు గురించి గొడవ పెట్టింది అత్తగారు ఆ క్షణాన ఆరు నెలల్లో

సర్దుతామని చెప్పాడేగాని అది తన కసాధ్యమని తెలుసు నాన్నకు ఈ విషయమంతా పెళ్ళి కాగానే పూసగ్రుచ్చినట్టు చెప్పింది భర్తకు అమ్మావాళ్ళు డబ్బు గురించి అడిగినప్పుడు చూసుకోవచ్చులెమ్మన్నా డతను క్రమంగా ఆ విషయమే మరిచాడతను అప్పుడపుడు అత్తగారు మాత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొణుగుతుంది అది చెప్పి బర్త మనసు చిన్నబుచ్చడ మిష్టం లేక మౌనంగా వుండి పోయింది తను ప్రత్యక్షంగా అత్తగారు డబ్బు గురించి అడిగినపుడు చూసుకోవచ్చుననుకుంది ఇంతలో తమ్ముడు రావడం ఇలా జరగడం అతను రాత్రి తనతో అలా చెప్పి ఇప్పుడు తల్లితో ఇలా చెప్పడంతో ఆమె తల గిర్రున తిరిగినట్టయింది కానీ, ఇంత జరిగాక ఆయనే తనను పంపమని చెప్పాక తను మాత్రం ఇక్కడ ఎందుకుం డాలి? పుట్టింటికెళ్ళిపోతుంది మళ్ళీ ఈ గడప త్రొక్కదు ఒకవేళ నాన్న అప్పు తెస్తానెలాగైనా అని అన్నా తను ఒప్పుకోదు వద్దని చెబుతుంది అంతేకాదు తను వాళ్ళకు బరువుగా వుండకూడదు తమ ఇంటర్ పూర్తిచేసింది కాబట్టి

తిరిగి వచ్చిన వసంతం

టీచర్ ట్రైనింగ్‌కెళుతుంది ట్రైనింగ్ అయిపోయిన ప్రైవేటు స్కూళ్ళలో నైనా వుద్యోగం సంపాదించి తన కాళ్ళ మీద తను నిలబడుతుంది పూర్తిగా కాక పోయినా ఆర్థికంగా కాస్తయినా తల్లిదండ్రులకు సహాయపడుతుంది అంతే అలాగే చేయాలి అని గట్టిగా నిర్ణయించుకుంది మనసులో శాంతి

* * * * *

ఆ రోజు సాయంత్రం మూడున్నర గంటలకంతా స్టేషన్‌కు చేరుకున్నారు శాంతి, ప్రకాశం, శాంతి మామగారు అనంతరామయ్యా మూడున్నరకు బండి వచ్చేది అందుకని దూరంగాచెట్టు కింద సిమెంటు బెంచీమీద కూర్చోబెట్టారు అనంతరామయ్య కోడల్ని, ప్రకాశాన్ని ఆయన టికెట్ తీసుకురావడానికి బుకింగ్ వద్దకు వెళ్ళాడు ఇంకా టిక్కెట్లిచ్చే టైం కాలేదంటే ఎవరితోనో మాట్లాడుతూ అక్కడే నిలుచుండి పోయా రాయన

గంభీరంగా కూర్చున్న అక్కను పలుకరించా లంటేనే భయం వేసింది ప్రకాశానికి అందుకే దిక్కులు చూస్తూ మౌనంగా వుండిపోయాడు శ్రీకాంత్ స్టేషన్‌కు కూడా రానందుకు బాద పడ సాగింది శాంతి మధ్యాహ్నం రెండు గంటలకు భోజనానికి కూడా రాలేదతను శాంతి మనసంతా చేదుతిన్నట్టయింది ఏమైనా యీ మూడు నెలలూ అతని ప్రేమ, అతని సహచర్యం తన మనసుకెంతో తృప్తిని ఆనందాన్ని కలిగించాయి యీ రోజు వుదయం డైనింగ్ టేబుల్ వద్ద తల్లీ కొడుకుల సంభాషణ వినకపోయి వుంటే, కనీసం ఆ మాట తన బర్త కాక మామగారు అని వుంటే తనకింత బాధ అనిపించేది కాదు ఆ మాట తన భర్త నోటి వెంట వినటంతో ఆమెకు ప్రపంచమే తల క్రిందులైన ట్టనిపించింది ఇన్ని రోజుల అతని ప్రేమ నటన మాత్రమే అని గ్రహించింది కానీ కానీ మనసు పొరలలో ఏ మూలనో అతనిది నటన కాదని యదార్థమైన ప్రేమేనని అనిపిస్తుంది తను స్వయంగా తన చెవులారా విన్నది కనుక ఆ యదార్థాన్ని అంగీకరించడం లేదామె మనసు

ఇంతలో ఆమె ఆలోచనల కంతరాయం కలిగిస్తూ బండి వచ్చే సూచనగా బెల్లు కొట్టారు ఇంకా శ్రీకాంత్ వస్తాడేమోనన్న ఆశతో నలుదిక్కులా చూస్తూ లేచి నిలబడింది బండి వచ్చి ఫ్లాట్‌ఫారం మీద ఆగింది ఆమె ఆశ నిరాశే అయ్యింది అనంత రామయ్యగారు పరుగున వచ్చి వారిని పిలుచుకెళ్ళి సీటు చూసి ఎక్కించాడో పెట్టెలోకి కిటికీ వద్ద కూర్చున్న శాంతికి చివరిసారిగాకూడా భర్తను చూడకుండా వెడుతున్నందుకు బాధా, దుఃఖం రెండూ కలిగాయి తిరిగి తను ఈ వూరు రాదు ఇక అతన్ని చూసే ఆశకూడా లేదు ఈ మూడు నెలలూ తన సంసార జీవితం పూచిన వసంతంలా కళకళలాడింది అనుకోకుండా తన జీవితంలో శిశిరం ప్రవేశించింది ఇక మిగిలిన తన జీవితం మోడులా గడవాలిసిందే ఈ మూడు నెలలూ మధుర స్వప్నంలా గుండెల్లో భద్రంగా దాచుకుంటుంది ఇలా అనకుంటున్న ఆమెకు అంతలోనే రోషం కూడా వచ్చింది అంత నంగనాచిలా మాట్లాడిన భర్త కోసం తను మాత్రం ఎందుకు బాధ పడాలి?

ఇలా పరిపరి విధాల ఆలోచిస్తున్న ఆమె మనసు ఒకవైపు బాధతో, మరోవైపు రోషంతో నిండిపోయి కళ్ళ నుంచి అశ్రువుల రూపంలో దుమకబోతుండగా బలవంతంగా నిగ్రహించుకుంటున్న శాంతికి

శాంతీ! అంటూ ఆప్యాయంగా పిలిచిన పిలుపుకు వులికిపడి చూసింది అప్పటికే పరుగెత్తుకుంటూ కంపార్టుమెంటును చేరబోతున్న శ్రీకాంత్‌తో

అదేమిట్రా నేను లేనూ వాళ్ళను బండెక్కించే దానికి? ఆఫీసు నుండి పని వదులుకుని వచ్చావా? అంటున్న తండ్రి మాటలు వినిపించుకునే స్థితిలో లేడతను

శాంతీ! మీరింకా స్టేషన్‌కు వెళ్ళి వుండరేమోనని ఇంటికి వెళితే అప్పటికే మీరు వెళ్ళిపోయారు ఇదిగో ఈ వారం ఆంధ్రసచిత్రవారపత్రిక వచ్చింది నీ అభిమాన రచయిత్రి సీరియల్ మిస్ అవుతావేమోనని పట్టుకొచ్చాను అంటూ ఆ వారం ఆంధ్రసచిత్ర వార పత్రికను కిటికీలో నుండి ఆమె వడిలో వుంచాడు

శాంతి అమితమైన ఆశ్చర్యానందాలతో అతని వైపే చూస్తుండి పోయింది గానీ ఏమీ మాట్లాడలేక పోయింది

ఇంతలో రైలు కూత వేసి బయలుదేరింది

అతని కళ్ళల్లో తను వెళుతున్న బాధ స్పష్టంగా కనిపించింది శాంతికి కదిలి వెళుతున్న రైలులోని శాంతినే చూస్తూ వడివడిగా నడుస్తున్న శ్రీకాంత్ రైలు వేగాన్ని పుంజుకోవడంతో చేయి వూపుతూ నిలబడిపోయాడు

స్టేషన్ కనుమరుగవగానే కాస్త తేలిక పడ్డ మనసుతో, వడిలోని పుస్తకాన్ని చేతిలోకి తీసుకుంది పుస్తకం మధ్యలో ఏదో పెట్టినట్టుగా ఎత్తుగా కనిపించి పుస్తకం విడదీసి చూసింది మధ్యలో కవరు కనిపించగానే ఆత్రంగా కవరు చింపింది కవర్లులో వంద రూపాయల నోట్లు, ఉత్తరం కనపడగానే దిగ్భ్రాంతురాలై డబ్బు కవరులోనే వుంచి, ఆ పుస్తకంలోనే పెట్టి వడిలో వుంచుకుని ఆత్రంగా ఉత్తరం మడత విప్పింది

ప్రియాతి ప్రియమైన నా శాంతీ!

ఆ సంభోదన చదువగానే అందాకా శోక పరితప్తమైన మనసు ఒకింత సేద దీరింది ఆత్రంగా మళ్ళీ చదువడం మొదలుపెట్టింది

రాత్రి నీవు చెప్పిన విషయాలు విన్న తరువాత నా మనసెంతో మధనపడింది నీవు నిద్రపోయినా నాకు నిద్ర రాలేదు చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయం తీసుకున్న తరువాత మనసు తేలిక పడింది అప్పుడు

ప్రశాంతంగా నిద్రపోగలిగాను ఈ రోజు ఉదయం అమ్మ అన్నం వడ్డిస్తుంటే నేను అమ్మతో మాట్లాడిన విషయాలు వంటింట్లో వున్న నీవు విన్నావని తెలుసు అయితే అమ్మకు అలా చెపితే కానీ నిన్ను వూరికి పంపదు అందుకని అలా మాట్లాడ వలసి వచ్చింది నేను ఆఫీసుకి వెళ్ళి శలవు పెట్టి మా ఫ్రెండ్ రాఘవ ఇంటికెళ్ళాను వాడు నాకు ప్రాణస్నేహితుడని ఒకమారు మన యింటికి వస్తే పరిచయం చేశాను గుర్తుంది కదా'డబ్బుందన్న గర్వమే లేదు వాడికి నేనంటే ప్రాణమిస్తాడు అందుకే వాడి వద్ద కెళ్ళాను ఆఫీసు నుండి వాడితో మన సమస్య గురించి చర్చించాను వాడేమన్నాడో తెలుసా శాంతీ?


ఒరే కాంత్' డబ్బు కేమి జీవితంలో ఎప్పుడైనా సంపాదించుకోవచ్చు మనసు విరిగితే అతికించతే

మురా మా చెల్లా యెంతో సౌమ్యురాలనీ, గుణవతి అని నీవు నాతో చెప్పే దాన్ని బట్టి అర్థమౌతుంది అలాటి ఉత్తమురాలి మనసు డబ్బు మిషతో విరచరాదు మీ అమ్మగారి మాటలకు బాదపడి ఏ అఘా యిత్యమైనా చేసుకుంటే చివరికి బాధపడేది నీవే ఇలాటి కేసు లెన్ని చదవడం లేదు పేపర్లల్లో ఎన్ని వినడం లేదు? డబ్బు దేముంది ఈ రోజు వస్తుంది రేపు పోతుంది డబ్బు పోయినా సంపాదించుకోగలము గానీ మనిషి పోతే సంపాదించుకోలేము గదా' ఆ డబ్బేదో నీవు చెల్లాయి కివ్వు ఆమె పుట్టింటి వాళ్ళిచ్చినట్లుగా మీ అమ్మా వాళ్ళకిమ్మను ఇలా ఆమె నీ నుండి డబ్బు తీసుకోవడంలో భర్త దగ్గర అభిమాన పడడంలో అర్థం లేదని నీవు చెల్లాయికి చెప్పు ఇది నా సలహా మరి నీ యిష్టం అన్నాడు

వాడి మాటలకు నాకెంతో సంతోషమైంది ఎందుకంటే నిన్న రాత్రి నేను అనుకున్నదే వాడు నాతో చెప్పాడు అయిదు వేలూ వాడే ఇచ్చాడు నిదానంగా తీర్చమని ఇద్దరం కలిసి బ్యాంకుకు వెళ్ళి డబ్బు డ్రా చేసి ఇంటికెళ్ళి వచ్చేసరికి లేటైంది స్టేషన్లో నాన్నగారి ముందు నీకీ విషయాలన్నీ తెలిపేందుకు వీలుకాదని బండికి ఇంకా టైం వుండడంతో మీకు కనపడకుండా కూర్చుని ఈ వుత్తరం వ్రాస్తున్నా

శాంతీ' వూరికి వెళ్ళగానే జవాబు వ్రాస్తావుగా' ఉదయం నేను అమ్మతో మాట్లాడిన మాటలు విన్నప్పటి నుంచి నీవు నా మీద దురభిప్రాయం ఏర్పరచుకొని మధనపడుతుంటావు కదూ' ఈ ఉత్తరం చదివాక' నీవు నన్నర్థం చేసుకుంటా వనుకుంటాను అత్తగారికి బాగయ్యే దాకా అక్కడే వుండి వచ్చే ముందు మీ నాన్నగారికి ఈ డబ్బు ఇచ్చి విషయమంతా చెప్పి పిలుచుకునిరా అత్తగారికి ఎంత త్వరగా ఆరోగ్యం కుదుట పడుతుందా? నీవు ఎంత త్వరగా నా దగ్గరకు వస్తావా? అని ఆత్రుతతో

అనుక్షణం ఎదురు చూసే
నీ ప్రియమైన కాంత్




మరిచాను శాంతీ! మా ఫ్రెండ్ నా విషయమంతా విని నా ట్రాన్స్ఫర్ కోసం ట్రై చేస్తానన్నాడు వాడికి మా హెడ్డాఫీసులో కాస్త పలుకుబడి వుంది ట్రాన్స్ఫర్ వచ్చాక మన మిద్దరం హాయిగా వుండొచ్చు ఇక్కడ సొంత యిల్లు, పొలమూ వుంది కనుక అమ్మావాళ్ళు ఎలాగూ రారు ఏమంటావ్ శాంతీ?ఇప్పటికైనా ఉదయం నుండీ నీకు నా మీద కలిగిన కోపం పోయిందని వెంటనే ఉత్తరం వ్రాస్తావుగా?నీ వుత్తరం వచ్చేదాకా నా మనసు ప్రశాంతంగా వుండదు శాంతీ' మరి వుండనా'

నీ
కాంత్

ఆ ఉత్తరం చదివిన శాంతి మనసు ఆనందంతో పురివిప్పిన నెమలిలా నాట్యమాడింది ఆ వుత్తరాన్ని ఒకటికి పది మార్లు చదువుకుంది

అటు తల్లిదండ్రులను ఎదిరించి నొప్పించకుండా, ఇటు తను బాధ పడకుండా ఎంత మంచి నిర్ణయం తీసుకున్నారు? మీరు నాకు బగవంతుడిచ్చిన వరం" అని మనసులో అనుకుంటూ బక్తిగా, ప్రేమగా ఆ వుత్తరాన్ని కళ్ళ కద్దుకుని ముద్దు పెట్టుకుంది శాంతి

అంతవరకు మేఘా వృతమైన ఆకాశం మబ్బులన్నీ తేలిపోయి నిర్మలమైనట్లుగా వుంది ఆమె అంతరంగ మిప్పుడు కొద్దిక్షణాల క్రిందట శిశిరంలా మోడైందనుకున్న తన బ్రతుకున తిరిగి వసంతం వచ్చింది ఆనందంతో తేలిపోయే మనసుతో భర్త పైన ప్రేమానురాగాలు మరింతగా ముప్పిరి గొనగా సూట్కేసులో డబ్బున్న కవరు వేసి, కాగితం, కలం తీసుకుని, తాళం వేసి వుత్తరం వ్రాయడానికి వుపక్రమించింది శాంతి □



మధురలో బాంబు ప్రేలుడు!

మధుర బస్టాండులో 21 వ తేదీ ఉదయం వో షాపులో ఒక బాంబు ప్రేలి ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోవడం, ముగ్గురు అతి తీవ్రంగా గాయపడి, ఆసుపత్రి పాలవడము జరిగిందట ఈ బాంబు అసలా షాపులో ఎలా వుంది ఎవరు పెట్టారు ఎలా పేలింది అని ఆరాలు తీస్తున్నారట

విమానాశ్రయంలో గల్లంతయిన పార్సిల్

ఇండియన్ టూరిజం జపాను దేశం నుంచి 5 లక్షల 63 వేల కిమ్మత్తు చేసే 370 చేతి గడియారాలను తెప్పించుకున్నదట ఈ పార్సిలు విమానంలో బొంబాయికి వచ్చిందట. అనక అదృశ్యమయిందట పోలీసుల ఆరాల్లో ఆ విమానాశ్రయంలో పెయింటరుగా పని చేస్తున్న 27 ఏళ్ళ జీవన్ అనే అతను నేర్పుగా ఆ పార్సిలు తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకున్నట్టు తేలిందట.

చిత్రహింసలు భరించలేక ఆత్మహత్య!

మద్రాసుకు చెందిన మహమ్మద్ షరీఫ్ అనే అతని కూతురు 18 ఏళ్ళ జమిలాబీబీ అనే అమ్మాయికి ఏప్రియల్ 7న పెళ్ళయిందట పెళ్ళికొడుకు కావల్‌కారన్ అని చెప్పారట. పెళ్ళయ్యాక అతను కావల్‌కారన్ (పోలీసు ఉద్యోగి) కాదనీ, కేవలం వో బంగళాకు కాపలా పని చేస్తున్నాడనీ తెలిసిందట అయినా షరీఫ్ సరిపెట్టుకున్నాడట కట్నంలో కొంత డబ్బు బాకీ వున్నందు వల్ల ఆ పిల్ల అత్తమామలు 'ఆమెను నానాబాధలూ పెట్ట నారంభించారట దానికి తోడు ఆమె భర్త కూడా ఆరారా చావగొట్టేవాడట ఈ విషయం ఆమె తన తండ్రితో చెప్పి ఏడ్చిందట ఆమె భర్త మహమ్మద్ యాకూబ్ తన మామగారిని హీనంగా తిట్టి కట్నం డబ్బు లేకుండా నీ కూతుర్ని చూడనివ్వం అని గెంటేశాడట ఈ చిత్రవధలు భరించలేని ఆ జమిలా నిప్పంటించుకు చనిపోయిందట

ప్రాణాలు బలిగోరిన ఏంటినా!

మద్రాసు కొట్టూర్‌పురం అనే ప్రాంతానికి చెందిన 19 ఏళ్ళ ధర్మలింగం అనే అతను తాను కొనుక్కున్న టి వి కి ఏంటినా కట్టడానికి అయిదో అంతస్థుపైకి వెళ్ళి అక్కడ పిట్టగోడ మీద నిలబడి దానిని కట్టి, సరిచేస్తుండగా కాలుజారి అక్కణ్ణుంచి క్రిందపడి చనిపోయాడట అతన్ని రక్షింప పోయిన అతని స్నేహితుడు 23 ఏళ్ళ చిట్టిబాబుకు తీవ్రంగా గాయాలు తగిలాయట

నటి జానకికి గౌరవ డాక్టరేట్!

నటి జానకి కళాసేవని మెచ్చుకుంటూ అమెరికా అరిజోనా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు ఆమెకు యిస్తామని ప్రకటించారట ఆ బిరుదు వెళ్ళి తీసుకోడానికి జానకి తనకు తీరుబడి లేదని చెప్పడం వల్ల ఆ విశ్వవిద్యాలయానికి చెందిన వో అధికారి ఆ పట్టం శ్రీమతి జానకికి అందజెయ్యడానికి భారతదేశం వస్తున్నారట

పెళ్ళిళ్ళ పేరయ్యల హత్యోదంతం!

హైదరాబాదు బేగంపేటకు చెందిన రాజేంద్ర అనే హమాలీ పని చేసుకునే అతనికి వో చక్కని సంబంధం కుదిర్చిన వో యిద్దరు పెద్ద మనుష్యులు ఆతనివద్దనుంచి వీలయినంత డబ్బు బిడిసి పుచ్చుకుని, ఆనక ఆ పిల్లకు వేరే సంబంధం ఖాయం చేశారట దాంతో రాజేంద్రకు కోపం వచ్చి వారిద్దర్నీ గన్‌ఫవుండ్రి ప్రాంతానికి పిలిచి సూర్యలోక్ బిల్డింగ్‌లోని ఏడో నెంబరు షాపువద్దకు తీసుకు వెళ్ళి, అక్కడ కత్తితో కసితీర కసకస పొడిచి చంపేశాడట

కట్నానికి బలైన మగువల ఉదంతం!

పశ్చిమ ఢిల్లీకి చెందిన అశోక్‌కుమార్ అనే అతను తన భార్య పుష్పాదేవి కట్నం బాగా తేలేదని అనునిత్యం చిత్రహింసలు పెట్టి, అప్పటికీ సంతృప్తి చెందక, చివరి కామె మీద కిరసనాయిలు పోసి, నిప్పంటించాడట ఈతనికి కోర్టు యావజ్జీవ శిక్ష విధించిందట

★ ★ ★ ★

సిద్ధిపేటకు చెందిన 19 ఏళ్ళ పద్మావతి అనే ఆమెను ఆమె భర్త, అతని తల్లి కలసి కట్నం తక్కువ తెచ్చిందని చావబాదేవారట ఒప్పుకున్న 19 వేలలో 10 వేలే తెచ్చావ్ అంటూ రోజూ ఆమెను హింసించి, ఓ రోజు ఆ హింసాకాండలో ఆమెన్ను నూతిలోకి తోసేశారట

వ్యభిచారిణులని పరామర్శించిన మహిళా మంత్రి!

బొంబాయిలోని ఎర్ర దీపాల స్థలంలో ఉదరపోషణార్థం వ్యభిచారం చేస్తున్న అమ్మాయిలను మహారాష్ట్ర ప్రభుత్వ మహిళా మంత్రి సెలిన్ డి సెల్వా కలుసుకుని, వారి కష్టసుఖాలను విచారించి తెలుసుకున్నారట ☐



'మోర్' డిటర్జెంట్ సబ్బు

'మోర్' కొనండి. మీ రూపాయికి మరింత విలువ రాబట్టండి.

మరింత తెలుపు. మరింత మెరుపు.
మీ రూపాయికి మరింత తెలుపు చేసే శక్తి.

'మోర్' ధర మరే మంచి డిటర్జెంట్
సబ్బుకన్న కొద్దిగానే ఎక్కువ. అయితేనేం,
ఇది సైజులో రెండింతలు పెద్దది.
దీంతో మరి రెండింతలు బట్టలు
ఉతికే వీలు వుంది!

రెట్టింపు సైజు: అయినా ధర కేవలం
రూ.3.25 పైసలే (పన్నులు అదనం)

Trikaya BL 2 55 TEL



(గత సంచిక తరువాయి)

యాం త్రికంగా కారు ఇంటిముందాగే వరకూ బార్గవ్ ఆలోచనలలా సాగుతూనే వున్నాయ్ కారాగిన కుదుపుకి మల్లిక వులిక్కిపడి కళ్ళు తెరిచింది

అప్పుడే వచ్చేశామా? అనుకుంటూ కారు దిగింది

బార్గవ్ మెయిల్ బాక్స్ దగ్గరకెళ్ళి ఆ రోజు మెయిల్ తీసుకొచ్చాడు

బార్గవ్ మెయిల్ చూస్తుంటే మల్లిక కాఫీ పెట్టి తెచ్చింది

పెద్ద ఆసక్తికరమైన వుత్తరాలు లేకపోవటంతో తీసి ప్రక్కన పెట్టేశాడు

డాక్టర్ చెప్పిందంతా ఆలోచించావా మల్లీ? ఏం చెద్దామంటావూ? కాఫీ తాగుతూ, ఇంతసేపటికి ఆ విషయం ఎత్తాడు

కాఫీ కప్పు చేతిలోకి తీసుకుంది మల్లిక ఒకసారి సిప్ చేసింది

డాక్టర్ ఇచ్చిన లిటరేచర్ నువ్వూ చదివావ్ కదా? 'ఇన్ విట్రో' ఫర్టిలైజేషన్‌కి ప్రతి నెలా లాపరోస్కపే చేసి అండాన్ని బైటికి తియ్యాలి అసలు ప్రెగ్నెంట్ అయ్యే గ్యారంటీ వుంటే ఆ బాధంతా ఎలాగోలా భరించవచ్చు డాక్టర్ ఆ భరోసా ఇవ్వటంలేదు అదీగాక నెలకు అయిదారు వేలు ఖర్చవుతుందట మూడు నాలుగు నెలలైనా చెయ్యాలి ఇన్సూరెన్సు వాళ్ళు దీనికి పే చెయ్యరట మన దగ్గరకూడా రెడీ క్యాష్ లేదు

ఇక 'సర్రగేట్' విధానం – 'సర్రగేట్ మదర్'గా ఇక్కడ అమెరికన్స్ తప్ప ఎవరు దొరుకుతారు? అదీగాక, ఎంత కృత్రిమంగా ఇన్‌సెమినేట్ చేసినా నీకూ ఇంకొక స్త్రీకీ పుట్టే బిడ్డ అనుకుంటే నా మనస్సెందుకో చేదుగా అవుతోంది

దత్తత విషయంలో నాకొక అభిప్రాయమంటూ లేదు నీకెలా ఇష్టమైతే అలా చేద్దాం" కాఫీ తాగేసి కప్పు కింద పెట్టింది

సోఫాలో వెనక్కి వాలాడు భార్గవ్ కాళ్ళు సాచి ముందున్న కాపి టేబుల్ మీద పెట్టి విశ్రాంతిగా కూర్చున్నాడు

నా అభిప్రాయాన్ని చెప్పే ముందు ఒక విషయం చెప్పాలి మల్లీ! మనకి పిల్లలు పుట్టరనే విషయం నేనింకా నమ్మటంలేదు ఇది మాత్రం గుర్తుంచుకోవాలి నువ్వు

సరే, పై రెండు విదానాలూ నాకూ పెద్ద సమ్మతంగా లేవు డబ్బు విషయం వదిలెయ్! మన దగ్గర కాష్ లేకపోతే స్టాకులు అమ్మెయొచ్చు లేదా అప్పు తీసుకోవచ్చు సమస్య అది కాదు గ్యారంటీ లేకుండా మల్లీ నిన్నంత కష్టానికి గురిచెయ్యటం నాకిష్టంలేదు సర్రగేట్ విదానం నీకే కాదు నాకూ నచ్చలేదు

డాక్టరన్నట్లు, లోకంలో అంతమంది దిక్కులేని పిల్లలుండగా ఇంకొక స్త్రీని దేవిరించటం ఎందుకు?

ఇక, ఇక్కడ పిల్లల్ని పెంపకం తీసుకోవటంలో నాకు పెద్ద ఇంటరెస్ట్ లేదు. ఈ దేశంలో ఎన్నో రిసోర్సెస్ వున్నాయి పిల్లలకు ఎన్నో ఫాస్టర్ హోమ్స్ ఉన్నాయి. ఎవ్వరూ తిండి బట్ట లేక చచ్చిపోరు యిక్కడ. మనదేశంలో తినటానికి ఒక్క ముద్ద లేక మాడిపోయేవాళ్ళు ఎందరో!

చిట్టిగాడి విషయం నీకొకసారి చెప్పాను గుర్తుందా? ఎందుకో ఈ రోజు వాడే గుర్తొస్తున్నాడు. వాడి నలుగురు పిల్లలూ ఏమయ్యారో? వాడి భార్య అప్పుడు గర్భిణీ కూడాను! అయిదో బిడ్డకూడా పుట్టి వుండాలి.

మా నాన్నకి వుత్తరం వ్రాసి చూస్తాను వాళ్ళు ఎక్కడున్నారో మా నాన్నకి తెలిసే వుంటుంది మీ ఇంట్లోనూ, మా ఇంట్లోనూ మన సహాయం కోసం ఎదురు చూసే వాళ్ళు ఎవ్వరూ లేరు కదా? చిట్టిగాడి పిల్లలకి ఏదో ఒక దారి చూపించాలని వుంది. ఏమంటావు మల్లీ?"

మల్లిక భార్గవ్ ముఖం వంక తేరిపార చూసింది. అతని ముఖం ప్రశాంతంగా వుంది. కళ్ళు ఏదో వెలుగుతో ప్రకాశిస్తున్నాయి అతని ముఖంలో రవ్వంత కూడా దిగులు, బాధలేదు తనకోసం అతను బాధ దిగమ్రింగుకుంటున్నాడా? లేక అతనిలోని నమ్మకమా?

ఎందుకో మల్లిక మనస్సులో అతని మీద ప్రేమ వెల్లువలా తన్నుకు వచ్చింది.

అతని తలను హృదయానికి హత్తుకు కళ్ళు మూసుకుంది 'ఐ లవ్ యు మై డార్లింగ్! ఐ లవ్ యూ! నీ ప్రియాతి ప్రియమైన ఆ ఒక్క కోరికా తీర్చలేని నా అసహాయతకు ఎంత విచారపడుతున్నానో నీకు తెలియదు' మనస్సులో అనుకుంది.

"నీ ఇష్టమే నా ఇష్టం భార్గవ్! మీ నాన్నకి వుత్తరం వ్రాయి' అంది

* * * * *

భార్గవ్ వుత్తరానికి వాళ్ళ నాన్న వెంటనే జవాబిచ్చాడు

"చిట్టిగాడి పెళ్ళాం నువ్వమెరికా వెళ్ళగానే కాన్పు కష్టమై మగబిడ్డను కని చచ్చిపోయింది ఇప్పుడు వాడికి పదిహే డేళ్ళు. వాడు గాక చిట్టిగాడికింకా నలుగురు పిల్లలున్నారు మొత్తం ముగ్గురాడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు పెద్ద పిల్లకు పెళ్ళయి ఇద్దరు పిల్లలు. మిగతా పిల్లలు కూలీనాలీ చేసుకునిబ్రతుకుతున్నారు చిట్టిగాడికి క్షయని ఈ మధ్యే తెలిసింది అస్థిపంజరంలా తయారయ్యాడు అది సరే, ఇప్పుడు నీకు వాడి సంగతులెందుకు కావలసి వచ్చాయి?"

ఆ వుత్తరం చదువుకొని చాలాసేపు అట్లాగే కూర్చుండిపోయాడు భార్గవ్.

"చూశావా మల్లికా! లోకంలో ఎన్ని భయంకరమైన కష్టాలుంటాయో? విచిత్రమేమిటంటే ఎవరి కష్టాలు వాడికి మేరు పర్వతాల్లాగానూ ఇతరుల కష్టాలు చీమల పుట్టల్లాగానూ కనబడుతుంటాయి. వాడ్ని, వాడి స్థితిని కళ్ళారా చూసినా ఇంతకాలమూ వాడి సంగతే గుర్తు రాలేదు. నేను, నా భార్య, నా పుట్టబోయే పిల్లలు అంటూ ఆలోచించానేగాని చిన్ననాటి నా నేస్తం అట్లాంటి నికృష్టపు స్థితిలో వుంటే కనీసం చిటికెన వేలైనా ఎత్తలేదు ఎవరో ఏదో చెయ్యటం లేదని, వున్నవాళ్ళంతా స్వార్థపరులని ఏవేవో ఆవేశాలు పోయేవాడ్ని.

జరిగిన కథ–8 బార్గవ్ అమెరికాలో ఒక చిన్న ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు భార్గవ్‌కి మల్లిక పరిచయం అయ్యింది ఆమె ఉద్యోగంలో చేరినాక వారిద్దరు పెళ్లి చేసుకున్నారు వారి జీవితం సాఫీగా సాగిపోతున్నా పిల్లలు మాత్రం కలుగలేదు అందుకై ఆ దంపతులు డాక్టర్ల చుట్టూ తిరగటం ప్రారంభించారు వారికి పిల్లలు పుట్టక పోవడానికి కారణాన్ని ఏ డాక్టర్లూ చెప్పలేక పోయారు కానీ బార్గవ్‌కి మాత్రం తమకు తప్పక పిల్లలు పుడుతారని నమ్మకం ఒంటరితనంతో బాధ పడుతున్న మల్లికకి చిన్ననాటి స్నేహితురాలు అంజలి తారస పడటం ఆనందాన్నిచ్చింది ఎదురింటి పాప స్టెఫనీ అంటే మల్లికకు తగని ప్రేమ పిల్లల్ని పెంపకం తీసుకునే విషయంలో తమకి ఆసక్తి లేదని డాక్టర్‌తో చెపుతాడు భార్గవ్ డాక్టర్ మాటలు విన్న భార్గవ్‌కి తనింట్లో చిన్నప్పుడు పాలేరుగా ఉండిన చిట్టిగాడు, వాడి పిల్లలు జ్ఞప్తికి వచ్చారు

నేను చేసింది మాత్రం ఏముంది?"

ఆవేదనగా అంటున్న భార్గవ్ వంకే చూస్తూ కూర్చుంది మల్లిక.

ఈ మధ్య భార్గవ్‌లో మార్పొచ్చింది. స్వతహాగా భార్గవ్ మానవత్వం వున్న మనిషే! ఇతరులకు చెయ్యగలిగిందేదయినా వుంటే కాదనకుండా చేసే మనిషి కానీ ప్రస్తుతం అతను ప్రతి చిన్న విషయానికీ కదిలిపోతున్నాడు. తను చెయ్యాల్సిందేదో చెయ్యటం లేదని, మనిషిగా పుట్టినందుకు శాయశక్తులా అదృష్టహీనులకు ఏదో విధంగా చేయూతనివ్వాలనీ – ఇలా పెద్ద పెద్ద వుపన్యాసాలిస్తున్నాడు.

6

ఆ రోజు భార్గవ్ ఆఫీస్‌కొచ్చేసరికి కాస్త ఆలస్యమైంది.

మామూలుగా ఆ టైంలో ఎవరి పనుల్లో వాళ్ళుండేవాళ్ళల్లా అందరూ లైబ్రరీ రూంలో గుమిగూడి గోల గోలగా మాట్లాడుకుంటున్నారు

భార్గవ్‌ని చూసి జిమ్ గబ గబా అతని దగ్గరకొచ్చాడు.

ఏం జరిగిందని భార్గవ్ అడిగే లోపలే అతనే చెప్పాడు.

"కంపెనీలో సగం మందికి 'లే ఆఫ్' ఆర్డర్స్ వచ్చాయి. నీ ఆఫీసుకి వద నీ టేబుల్ మీద కూడా ఏదైనా నోటీసు వుందేమో!" గబగబా అటు లాక్కెళ్ళాడు

భార్గవ్ ఇమీడియట్ బాస్ ఆఫీసు రూంలో కూర్చొని ఏదో వ్రాసుకుంటున్నాడు. భార్గవ్‌ని చూసి తలెత్తాడు

"గుడ్ మార్నింగ్ భార్గవ్! న్యూస్ విన్నావా?" నవ్వుతూ అడిగాడు

గతుక్కుమన్నాడు భార్గవ్. అయితే తనకూ మూడిందన్న మాట!

భార్గవ్ మాట్లాడే లోపలే బాస్ అన్నాడు "భయపడకు! ప్రస్తుతం నీ జాబ్‌కేమీ కాలేదులే. కానీ ఇంకొక రెండు మూడు నెలల్లో ఇంకొంత మందిని తీసేస్తున్నారు ఇది కాన్ఫిడెన్షియల్! ఎవ్వరితోనూ అనకు"

తనకది వార్నింగా? ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చెయ్యకపోతే నీ పనీ ఈ సారి ఖాళీయే అని చెప్పటమా?

"ఇంత పెద్ద ఎత్తున 'లే ఆఫ్' జరగటానికి కారణమేమయ్యుంటుంది?" అడిగాడు భార్గవ్.

"ఏముందీ? ఆదాయం కంటే వ్యయం ఎక్కువయింది. చాలా కాలం నుంచీ కంపెనీ నష్టంతోనే నడుస్తోంది ఈ 'లే ఆఫ్' చెయ్యకపోతే వాళ్ళందరి జీతాలకు కూడా డబ్బులు లేవు. ఇలా కొన్ని నెలలు నడిస్తే 'బాంక్ రప్సీ' డిక్లేర్ చెయ్యాల్సిందే!" రహస్యం చెబుతున్నట్లు గుస గుసగా అన్నాడు బాస్.

బైటికి వచ్చేశాడు భార్గవ్. తలుపు దగ్గర నిలబడిన జిమ్ ఆతృతగా భార్గవ్ ముఖం వంక చూశాడు.

చిరునవ్వు నవ్వాడు భార్గవ్ "ప్రస్తుతం తప్పించుకున్నానులే! నీ



మల్లిక

సంగతేమిటి?"

"థాంక్ గాడ్! నేనూ తప్పించుకున్నాను."

"గుడ్! ఇక పనిలోకి పద. ఇంకాస్సేపు ఇలాగే నిలబడితే రేపిపాటికి మన గతీ ఇంతే!"

కాస్సేపటికి అందరూ ఎవరి పనుల్లోకి వాళ్ళు జొరబడ్డారు. కానీ అన్యమనస్కంగానే పనులు చెయ్యసాగారు.

ఆ మధ్యాహ్నం అధికారులు ఎమర్జన్సీ మీటింగ్ పెట్టారు.

కంపెనీ ప్రెసిడెంట్ డేవిడ్ వుద్యోగస్తులను నెమ్మదిపరుస్తూ మాట్లాడాడు.

"ఈ 'లే ఆఫ్' తప్పని పరిస్థితుల్లో చెయ్యవల్సి వచ్చింది. ఇక గండం గడిచిందనే అనుకుంటున్నాను. మిగిలిన వుద్యోగస్తులకు భయం వుండదని హామీ ఇస్తున్నాను. ఎందుకంటే, ఈ రోజే ఒక పెద్ద బాంక్ మనకు అప్పివ్వటానికి అంగీకరించింది."

డేవిడ్ చాలామందితో పర్సనల్‌గా మాట్లాడుతూ భార్గవ్ దగ్గరకి వచ్చాడు

కంపెనీ స్థాపించినప్పటి నుంచీ వున్నవాడివి నువ్వు కంపెనీకో పెద్ద ఎసెట్‌వి! పూర్వం కంపెనీ ఒడుదుడుకుల్లో వుండగా ఎన్నోసార్లు నాతో పాటు నువ్వూ పాటుపడ్డావు ఇప్పుడూ విడిచిపెట్టి వెళ్ళిపోవని ఆశిస్తాను' అంటూ చెయ్యి నొక్కాడు

బార్గవ్ ఎన్నోసార్లు ఏదైనా పెద్ద కంపెనీకి వెళ్ళిపోదామని అనుకున్నాడు కానీ ఏదో సెంటిమెంట్ అతన్నా పని చేయనీయదు తన యావశ్శక్తినీ, టాలెంట్‌నీ వుపయోగించి కంపెనీని ఒక దారికి తేవటానికి సహాయపడ్డాడు ఇప్పుడూ తనూ అందులో బాగంగానే భావిస్తాడు ఇంకొక కంపెనీకి వెళ్ళినా జాబ్ సెక్యూరిటీ మెరుగుపడుతుందేమో గాని పొజిషన్‌లో పెద్ద మార్పు రాదు

ఆ మధ్యాహ్నం కాఫీ బ్రేక్‌లో లైబ్రరీలో కూర్చున్నారు జిమ్, భార్గవ్

"కంపెనీ నష్టంతో నడుస్తోందంటారు ఎందుకలా నడవాలి? నన్నడిగితే ఇదంతా అధికారుల మిస్ మానేజిమెంటు వల్లనే నంటాను! ప్రొడక్షన్‌లో కంటే అడ్మినిస్ట్రేషన్‌లో ఎక్కువమంది హైర్ చేశారు పర్సనల్ అసిస్టెంట్లు, వాళ్ళకి సెక్రటరీలు, మళ్ళీ వాళ్ళకి అసిస్టెంట్లు! ఇంత చిన్న కంపెనీకి ఇంత మందా? ఆ రోజు ఇష్టం వచ్చినట్లు హైర్ చేసి ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు ఫైర్ చెయ్యటం! హిట్లర్ జ్యూయిష్ పీపుల్‌ని కాల్చినట్లు కాల్చేశారు ఆవేశంగా అన్నాడు జిమ్


నిజమే! మన కన్నీళ్ళు తుడవటానికి డేవిడ్ అలా అంటున్నాడు గాని కంపెనీలో ఇంకా ఎన్ని లోపాలున్నాయో! ఇంకా ఎంతమంది వున్న ఫళంగా వుద్యోగాలు వూడగొట్టుకుంటారో! నిట్టూర్చాడు భార్గవ్


'అసలు డేవిడ్‌ని ప్రెసిడెంట్ పదవి నుండి తీసెయ్యాలి! అప్పుడుగాని అతని తిక్క కుదరదు కంపెనీ బాగుపడదు "

డేవిడ్ బదులు ఇంకొకళ్ళు వస్తే కంపెనీ బాగుపడుతుందేమో తెలియదు గాని డేవిడ్‌కి వచ్చే నష్టం మాత్రం వుండదు కంపెనీలో మూడొంతుల స్టాకులు అతని పేర, అతని ఫామిలీ పేర వున్నాయి ఈ 'లే ఆఫ్' వల్ల ఎంత స్టాకులు

పడిపోయినా డేవిడ్ పెట్టిన పెట్టుబడితో కంపేర్ చేస్తే వాటికి చాలా విలువ వుంది అతను కంపెనీలో వున్నా లేకపోయినా అతని మిలియన్లు అతనికుంటాయి ఇక కంపెనీ దివాలా తీస్తే సంగతి చెప్పలేం అప్పటికీ అతను 'టాక్స్ రైటాఫ్' క్రింద సరిపెట్టుకోవచ్చు వున్నవాళ్ళ కత్తికి రెండు వైపులా పదునుంటుంది మై ఫ్రెండ్! నవ్వాడు భార్గవ్

జిమ్ ముఖం కసితో ఎర్రబారింది 'అవును ఈ లోకంలో సౌలభ్యాలన్నీ వున్నవాళ్ళకే సౌకర్యాలన్నీ వాళ్ళకే ఈ రోజు వుద్యోగాలు పోయి మనలో





చాలామంది రేపటి ఇంటి మోర్ట్‌గేజ్ సంగతేమిటా, కారు పేమెంట్ మాటేమిటా, పిల్లల కాలేజీ ఫీజులెలాగా అని వాపోతుంటే ఈ డేవిడ్లూ, రాక్‌ఫెల్లర్లూ తర్వాతి వెకేషన్‌కి ఎక్కడికెళ్ళాలా, నెక్స్ట్ వైన్ బాటిల్ ఎలాంటిది ఓపెన్ చెయ్యాలా అని ఆలోచిస్తూ వుండి వుంటారు

బిజినెస్‌లో వచ్చే ఫ్రస్ట్రేషన్స్ తప్పించుకోవటానికి ఫ్రెంచ్ రివియారాలో వెకేషన్‌లు పాష్ రెస్టారెంట్లలో 'కావియార్' పిలేమిన్యోన్ డిన్నర్లు, స్విట్జర్లాండులో స్కీయింగ్‌లు, స్వంత 'యాట్'లో షికార్లు! ఒకటేమిటి? ప్రపంచంలో ఏ మూలకైనా వెళ్ళి సేద దీర్చుకోగలరు కాని మనం చెయ్యగలిగిందేమిటి? ఏ సిక్స్ పాక్ బీరో ఏ చీప్ విస్కీనో పట్టించి ఆరోగ్యం చెడగొట్టుకోవటమేగా? ప్చ్! సృష్టిలో ఇంత పక్షపాతమా? సంతోషంలోనూ, సమస్యల్లోనూ కూడా ఇంత తేడానా! ప్రపంచంలో ఒక మనిషి చెయ్యగలిగింది అందరూ చెయ్యగలిగి వుండాలి అందరికీ అవకాశం వుండితీరాలి

ఒక్క విషయం జిమ్! మధ్యలో అందుకున్నాడు బార్గవ్, నువ్వన్నట్లే అందరూ ఫ్రెంచి రివియారా, స్విట్జర్లాండూ వెళ్ళే అవకాశం వుందనుకో అప్పుడు పరిస్థితి ఎలా వుంటుందో ఒకసారి వూహించు! మిగతా ప్రపంచమంతా ఖాళీ అయితే పై ప్రదేశాలు మాత్రం జనంతో క్రిక్కిరిసి న్యూయార్క్ సిటీ రోడ్లలాగాను, ఇండియా సత్రాల్లాగానూ తయారవుతాయి అప్పుడవి విలాస కేంద్రాలని పిలవబడవు సరికదా నీలాంటివాడు అక్కడికి వెళ్ళాలని కలలో కూడా అనుకోడు!'

బార్గవ్ వంక గుర్రుగా చూశాడు జిమ్

* * * * *

కంపెనీలో ప్రతి సంవత్సరం క్రిస్‌మస్ పార్టీ జరుగుతుంది అంతకుముందు ప్రతిసారి ఏ షెరాటన్ హోటల్లోనో పార్టీ ఇచ్చేవాళ్ళు ఈసారి డేవిడ్ ఇంట్లో పార్టీ అని అందరికీ ఇన్‌విటేషన్లు వచ్చాయి

ఏమిట కథ? డేవిడ్ ఇంట్లో పార్టీ ఇస్తున్నాడు? కొత్తగా కట్టించుకున్న మిలియన్ డాలర్ల మేన్షన్ చూపించుకోవాలనా? ఇన్‌విటేషన్ వంక చూస్తూ అన్నాడు జిమ్

అసలు కారణం అదయ్యి వుండదులే! హోటల్లో పార్టీకి డబ్బు వుండదు అన్నాడు బార్గవ్

క్రిస్‌మస్ వారం రోజులుండనగా పార్టీ! ఆ సాయంత్రం ఆఫీసు నుండి కాస్త పెందలాడే ఇంటికొచ్చాడు బార్గవ్ మల్లిక అప్పటికే వచ్చి వుంది స్నానం చేసి తయారవుతోంది

ఎర్ర జరీ అంచున్న తెల్లటి చందేరీ చీర కట్టుకుంది, తెల్లటి జాకెట్ వేసుకుంది మెళ్ళో సాదా ముత్యాల దండ చెవులకు ముత్యాల స్టడ్స్ ఒక చేతికి గాజులు, ఒక చేతికి వాచి పెట్టుకుంది ఎడం చేతికి డైమండ్ వెడ్డింగ్ రింగ్ వుంది షవర్ చేసిన వుంగరాల జుట్టు భుజాల మీదకు వ్రేళ్ళాడుతోంది తల మీద ఒక వైపుగా అమర్చిన ముత్యాల క్లిప్ నల్లటి జుట్టు మీద నిగనిగా మెరుస్తోంది పెదాలకు పగడపు రంగు లిప్‌స్టిక్ నుదుటన ఎర్రటి బొట్టు –

కొందరు అలంకరించుకున్నా అలంకరించుకోకపోయినా అందంగానే వుంటారు

కొందరు మామూలుగా కనబడేవాళ్ళే అలంకరించుకుంటే నమ్మశక్యంగాని అందంతో మెరిసిపోతుంటారు

కొందరు అలంకరించుకొన్నకొద్దీ వున్న అందం కూడా పోయి వికారంగా అవుతారు

కొందరు అలంకరించుకున్నా అలంకరించుకోకపోయినా మామూలుగానే వుంటారు

మల్లిక రెండవ కోవలోకి చెందుతుంది

ఆమె మామూలుగా చాలా సింపుల్‌గా వుంటుంది

వెడ్డింగ్ రింగ్, చెవులకు చిన్న స్టడ్స్ తప్ప ఎక్కువ ఆభరణాలు పెట్టుకోదు మేకప్ కూడా ఎక్కువ వాడదు ఎప్పుడైనా పార్టీలకు వెళ్ళేప్పుడు ఏ కాస్త ఆడంబరంగా తయారైనా ఆమె అందం ద్విగుణీకృతమవుతుంది

బార్గవ్ పోలరాయిడ్ కేమెరా తీసుకుని చప్పుడు కాకుండా వచ్చి చటుక్కున ఫోటో తీశాడు ఫ్లాష్ లైట్ కాంతికి ఇటు తిరిగి చూసింది మల్లిక

యూ లుక్ ఫెంటాస్టిక్ మల్లీ! పెదవుల మీద అంటీ అంటకుండా ముద్దు పెట్టుకున్నాడు

థాంక్స్! టైమవుతోంది నువ్వూ తయారుకా తాగటానికేమైనా తేనా?

ఆరంజ్ జ్యూస్ స్నానానికి వెళ్తూ అన్నాడు


యూ లుక్ హేండ్‌సమ్ యువర్‌సెల్ఫ్!" షూ లేసులు ముడేసుకుంటున్న మల్లిక మెట్లు దిగివస్తున్న భార్గవ్‌ని చూసి అంది

బార్గవ్ తెల్లటి షర్ట్, బూడిద రంగు సూట్ వేసుకుని, మెరూన్ రంగు టై కట్టుకున్నాడు షవర్ చేసిన వెంట్రుకలు పొడి పొడిగా, మెత్తగా కదులుతున్నాయి

మల్లిక డాట్సన్‌లో బైలుదేరారు మల్లికే డ్రైవ్ చేస్తోంది ఎవరి కార్లో వెళ్ళినప్పుడు వాళ్ళే డ్రైవ్ చెయ్యటం అలవాటు

సీట్ బెల్ట్ పెట్టుకున్నావా? డ్రైవ్ వేలో నుండి కారు రోడ్డు మీదకు రాగానే అడిగింది

ఆ అంటూ అప్పుడు బెల్ట్ బిగించాడు బార్గవ్ మల్లిక కారు డ్రైవ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది సీట్ బెల్ట్ విషయంలో ఆమె చాలా ఖచ్చితం ఆమెతో బాటు ప్రయాణం చేసేవాళ్ళంతా బెల్టు పెట్టుకు



మల్లిక

తీరాల్సిందే! ఈ చిన్న చిన్న అలవాట్ల వల్ల తర్వాత పెద్ద పెద్ద మనస్తాపాలు తప్పుతాయంటుందామె

కారు బాగా మురిగ్గావున్నట్టుంది వాష్ చేయిద్దామా?' అంది మల్లిక

ఈ చీకట్లో ఎవరు చూడొచ్చారులెద్దూ! ఇప్పటికే లేటయ్యాం వెళ్ళిపోదాం పద

ఎవరు చూడొచ్చారులెద్దూ అని ఎప్పటికీ అనుకోకూడదు డియర్! ఎప్పుడేం అవుతుందో చెప్పలేం మా కొలీగ్ షర్లీ అనే అమ్మాయి ఏమంటుందో తెలుసా? బైటికి కనిపించవు గదాని అండర్‌వేరైనా, సాక్సయినా సరే మాసినవిగాని, చిరుగులవి గాని వేసుకోకూడదట ఎప్పుడైనా ఏ యాక్సిడెంటయినా అయ్యి హాస్పిటల్‌కి తీసుకెళ్ళారనుకో, ఏ టెస్ట్‌లో, ఆపరేషనో చెయ్యాల్సి వచ్చి బట్టలు తీసేస్తే అప్పుడా చిరుగుల వల్ల ఎంత ఎంబరాసింగ్‌గా వుంటుందో గదా అనంటుంది కారు విషయంలో నూ అంతేనని నా అభిప్రాయం!

'ఇది అన్నిటికంటే బాగుంది! ఒక పక్కన యాక్సిడెంట్లై ప్రాణాలు పోతుంటే అండర్‌వేర్, సాక్స్ ఎలా వున్నాయో అని విచారపడుతూ కూర్చుంటారా ఎవరైనా? విస్తుపోతూ అడిగాడు భార్గవ్

ప్రాణం కంటే మానం ఎక్కువని భావించేవాళ్ళంతేలే! అదీగాక కార్ వాషింగ్ ప్లేస్ మనమెళ్ళే దార్లోనేగా? మాటల్లోనే 'కార్ వాష్' అన్న బోర్డు దగ్గరకు వచ్చేశారు

అప్పటికే అయిదారు కార్లు లైన్‌లో వున్నాయి కౌంటర్ ముందున్న వ్యక్తికి మూడు డాలర్లు చెల్లించి లైన్లోకి డ్రైవ్ చేసింది మల్లిక అయిదు నిముషాల్లో ముందున్న కార్లన్నీ వెళ్ళిపోయాయి కారు ముందుకు పోనిచ్చి రైల్వే పట్టాల లాగా వున్న చోట ఆగి న్యూట్రల్ షిఫ్ట్‌లో వుంచింది కన్వేయర్ బెల్ట్ మీద కారు దానంతటదే పోసాగింది

జలపాతంలాగా పైనుండి సబ్బునీళ్ళు పడుతుంటే కారుకి రెండు వైపులా, ముందు వెనక, పైన రోడ్ రోలర్ సైజులో వున్న జీబూతాల్లాంటి నైలాన్ చీపుళ్ళు కారుని చుట్టుముట్టి ఆటోమాటిగ్గా, చకచకా క్లీన్ చెయ్యసాగాయి. ఆ తర్వాత పైనుండి క్లీన్ వాటర్ పడసాగింది అంతా శుభ్రం అయినాక హాట్ ఎయిర్ ద్వారా తడారిపోయిన కారు బైటికి వచ్చేసింది మల్లికకు, కార్లో అలా కూర్చొని వెళుతుంటే మాయల ఫకీరు సినిమాలోలా థ్రిల్లింగా వుంటుంది

బహుమురికిగా మడ్డోడుతున్న కారు, ఒక్క నిముషంలో క్రొత్త కారులాగా తళతళలాడుతూ బైటపడింది

కారు హైవే మీద పరిగెత్తుతోంది స్టీరియోలో కంట్రీ మ్యూజిక్ మధురంగా వినబడుతోంది

పార్టీకి ఎంతమంది వస్తారో? అడిగింది మల్లిక

కంపెనీలో హైరింగ్ జరిగినాక షుమారు నూట ఏభై మంది దాకా వుంటారు వాళ్ళల్లో వందమంది వస్తారనుకుందాం! స్పవుజ్‌తోనో, డేట్‌తోనో వస్తారు కాబట్టి రెండొందల మందిని వేసుకో

దాదాపు గంట ప్రయాణం చేసినాక డేవిడ్ ఇంటి దరిదాపుల్లోకి వచ్చారు

ఇన్విటేషన్ మీది డైరెక్షన్స్ చూసి భార్గవ్ చెబుతుంటే ఆ ప్రకారం పోనిస్తోంది మల్లిక

వూరికి దూరంగా లేక్ ఒడ్డున వుంది ఇల్లు షుమారు పదెకరాల స్థలంలో కట్టిన మేన్షన్' అది ఇంటికి ఒక వైపున లేక్, రెండు వైపులా అడవి ఒకవైపు దూరంగా గాల్ఫ్‌కోర్స్ వున్నాయి

ఇంటి ప్రక్కన వున్న పెద్ద ఖాళీ స్థలంలో అప్పటికే చాలా కార్లు పార్కు చేసి వున్నాయి

మల్లిక కూడా వాటి దగ్గర పార్క్ చేసింది

తలుపు తీసిన బట్లర్ ఇద్దరి కోట్లూ తీసుకున్నాడు చలిలో నుండి వెచ్చటి ప్రదేశంలోకి రాగానే ప్రాణం హాయిగా అనిపించింది తేలిగ్గా వూపిరి పీల్చుకుని చుట్టూ చూశారు

అంత పెద్ద ఫాయిర్‌ని కమర్షియల్ బిల్డింగ్స్‌లో తప్ప ఇళ్ళలో ఇంతవరకూ చూడలేదిద్దరూ ఫాయిర్‌ని ఆనుకుని 'సన్‌రూం' వుంది గ్లాస్‌తో చేసిన హైసీలింగ్ గ్లాస్ వాల్స్ సూర్యకాంతి ఎక్కువ అక్కరలేనప్పుడు మూసి వుంచటానికి వాటికి వెనీషియన్ బ్లైండ్స్ వున్నాయి ఆ గది అందం పగటి పూట ఇంకా బాగా తెలుస్తుంది

ఫాయిర్‌లో నుండి మధ్య హాల్లోకి అడుగు పెట్టారు ఒకపెద్ద థియేటరంత వైశాల్యముంది ఆ హాలు పైన సీలింగ్ మధ్యలో పెద్ద గ్లాస్ విండో వుంది హాలు మధ్యలో రాక్ గార్డెన్ వుంది మధ్యన పెద్ద చెట్టు, ఆ చెట్టు చుట్టూ రకరకాల పూల మొక్కలు, రబ్బర్, పామ్ మొక్కలు వున్నాయి మొక్కల మధ్యలో చిన్న చిన్న గులకరాళ్ళు, అక్కడక్కడా పెద్ద పెద్ద కొండ రాళ్ళూ వున్నాయి మొక్కలన్నిటికీ క్రిస్‌మస్ అలంకారాలు చేసి వున్నాయి గార్డెన్ చుట్టూరా నీలం రంగు టైల్స్‌తో చేసిన నేల లైట్ల వెలుగులో తళతళలాడుతోంది అక్కడే అతిథులకు టేబుల్స్, కుర్చీలు వేశారు టేబుల్స్ మీద నీలం రంగు క్లాత్‌లు, ఫ్రెష్ ఫ్లవర్ అరేంజ్‌మెంట్లు వున్నాయి

ఎవరితోనో మాట్లాడుతున్న డేవిడ్ వీళ్ళను చూసి ఇటు వచ్చాడు

హల్లో భార్గవ్, మల్లికా! మీరు పార్టీకి రాగలిగినందుకు చాలా సంతోషంగా వుంది అంటూ ఇద్దరికీ షేక్‌హాండ్ ఇచ్చాడు

'యూ లుక్ బ్యూటిఫుల్!' మల్లికను కాంప్లిమెంట్ చేశాడు

"థాంక్స్! మీ ఇల్లు చాలా బావుంది చుట్టూ చూస్తూ అంది

"థాంక్స్! కట్టించి రెండు వారాలే అయ్యింది ఇల్లంతా తిరిగి చూడటానికి సంకోచించకండి ప్లీజ్ ఫీల్ ఫ్రీ!" అంటూ, ఇంకా ఎవరో రావటంతో అటు వెళ్ళాడు

వచ్చిన వాళ్ళందరూ ముందు ఇల్లంతా తిరిగి చూస్తున్నారు భార్గవ్, మల్లిక కూడా వాళ్ళతో కలిశారు వున్న ఆరు బాత్ రూములూ బెడ్‌రూముల కంటే పెద్దవిగా వున్నాయి మాస్టర్ బెడ్‌రూంకి అటాచ్ అయిన బాత్‌రూంను ఒదిలి రాబుద్ధి కాలేదు మల్లికకు విశాలమైన గది మధ్యలో "జకూజీ విర్ల్‌పూల్ బాత్‌టబ్ గులాబిరంగుతో తళతళా మెరుస్తోంది బాత్‌టబ్ చుట్టూరా గులాబిరంగు టైల్స్‌తో తాపడం చేసి వుంది క్రింద నేలంతా గులాబిరంగు కార్పెట్ గదిలో ఒక గోడంతా గ్లాస్ విండో పరుచుకుని వుంది ఆ విండోలో నుండి బైటి చెట్లు, గుట్టలు కనబడు తున్నాయి ఒక గోడంతా వున్న బిల్టిన్ బీరువాలో టవల్స్, రకరకాల సబ్బులు, లోషన్లు, బాత్ ఆయిల్స్, పెర్‌ఫ్యూమ్స్ వున్నాయి గ్లాస్ విండో దగ్గరగా సోఫాసెట్టు వుంది

ఇవతల ప్రక్కగా కాస్త విడిగా వానిటీ వుంది నగిషీ ఫ్రేం గల ఖరీదైన అద్దం, దానిముందు ప్లాట్‌ఫారం కూర్చుని మేకప్ చేసుకోవటానికి కుషన్ స్టూల్స్ వున్నాయి

అట్లాంటి బాత్‌రూం ఏ జేమ్స్‌బాండ్ మూవీలోనో తప్ప బైట చూడలేదు మల్లిక

ఇంట్లో మొత్తం ఏ ఇరవయ్యో, ముప్పయ్యో గదులుండి వుంటాయి వెనక సిటింగ్ రూంలో పెద్ద ఫైర్ ప్లేస్ వుంది అందులో కట్టెలు మండు తున్నాయి సిటింగ్ రూంలో నుండి చూస్తే బైట తామరాకు షేప్‌లో వున్న స్విమ్మింగ్ పూల్ కనబడుతోంది

(ఇంకా ఉంది)



"రహీం, కనబడ్డాడివాళ అబిడ్స్‌లో! ఎంత మారిపోయాడనుకున్నావ్! నేనయితే గుర్తే పట్టలేక పోయాను! అతనే పలకరించాడు

ఎంత జ్ఞాపకమో అతనికి! అందరినీ పేరుపేరునా అడిగాడు

నిన్ననో మొన్ననో జరిగినట్లుగా అప్పటి కబుర్లన్నీ చెప్పుకొచ్చాడు ఇంటికి రమ్మంటే 'ఎవరో ఆఫీసర్స్‌తో వచ్చాను. హోటల్లో దిగాం, రేపు తప్పకుండా వస్తా' నన్నాడు

'ఓయ్! గుర్తు రాలేదా? రహీం, అంటే తాజ్‌మహల్ రహీం'!

ఫుల్‌స్టాఫ్, కామాలు లేకుండా ఏకధాటీగా చెప్పుకుపోతున్న మా శ్రీవారు తలయెత్తి నా ముఖంలోకి చూశారు

చప్పున తలవూపాను జ్ఞాపకం వచ్చిందన్నట్లు

'వొట్టి ట్యూబ్ లైట్ బుర్ర! రేపు అతను వచ్చినప్పుడు గూడా ఇలాగే ముఖం పెట్టక పాపం చిన్నబుచ్చుకుంటాడు ఎంత గౌరవంగా, ఎంత ఆప్యాయంగా మాట్లాడాడని "

ఎంత హడావుడిగా మాట్లాడతారో భోజనమూ అంత హడావుడి గానే వుంటుంది ఈయనగారిది తినేది ఓ కూరనో పప్పో పచ్చడో కాబట్టదు భోజనం అయి చేతిమీద నీళ్ళు పోసుకుంటూనే షర్ట్ వేసుకున్నారు

ఇందాక వెళ్ళినప్పుడు ఏ ఇ కలవనే లేదు వెళుతున్నా తలుపు వేసుకో అంటూనే సైకిలెక్కేశారు

అలాగే నిలబడిపోయాను

తాజ్‌మహల్ రహీం!

తాజ్ చూడడానికి వెళ్ళినప్పుడు మావారికి అతనితో పరిచయం అయింది

తాజ్‌మహల్! ఎన్ని సంవత్సరాలయింది చూడడానికి వెళ్ళి!

మెరపులాటి ఆ సంఘటన!

ఆ వుద్వేగం! ఆ భావావేశం!

ఇవ్వాళ నాలుగున్నర పదులు దాటిన ఈ వయసులో కూడా ఆబెంగ, ఆవేదన, ఆర్తి, స్ఫురణకు తీసుకువచ్చి కొన్నిక్షణాలు నిలబెట్టగల, ఆసంఘటన, ఆ అనుభవం, ఆస్మృతి!

దాదాపు 26 సంవత్సరాల క్రితం

జుట్టంతా పల్చబడి, సగం నెరసిన తలతో వాలిపోయిన కళ్ళతో అనుభవం నేర్పిన, నిదానమూ నిరాసక్తత నింపుకున్న ఈ సుజాతమ్మ స్థానంలో

ఉద్వేగమూ ఆవేశమూ, అమితమైన భావ తీవ్రతా, చురుకుదనమూ నింపుకున్న మెరపులాటి సుజాత వుండేది

మా ఆడపడుచు భర్తకు అతని ఆఫీస ద్వారా, సంవత్సరాని కొక పాస్ వచ్చేది ఎక్కడైనా తిరిగి

రావడానికి బార్యాభర్త లిద్దరికీ తిరగడం సరదానే కానీ వెంట వెంటనే పుట్టుకు వచ్చిన పిల్లలు మగపిల్లవాడికోసం పెంచుకుపోయిన మెంబర్స్ నలుగురు కావడంతో ఆ నలుగురు పిల్లలతో ఆవిడ ఒంటరిగా సమర్థించుకోలేక మా అత్తగారిని సాయంగా తీసుకుపోతుండేవాళ్ళు

ఆ సంవత్సరం మాత్రం ఆవిడ ఆరోగ్యమూ అంతంతమాత్రంగావుండి నే రాలేనే తల్లీ అనేయడంతో పిల్లలులేని సింగిల్ ఫామిలీ అయిన మా దంపతులను ప్రయాణం కట్టించాడు ఆయన సెలవు గిలవూ అంటూ మావారు వెనుకాడుతూంటే నేను నిలవనీయలేదు

ఢిల్లీలో ముఖ్యమైనవి చూసి ఆగ్రా చేరాం!

ఆవేళ పూర్ణిమ పున్నమి వెన్నెలలో తాజ్ చూడాలని తక్కిన వాటిని వాయిదా వేసుకుని బోజనమూ విశ్రాంతీ అయినాక ఫ్రెష్‌గా తయారయి సాయంత్రం 5 గంటలకు టాంగాలు ఎక్కాం

మా ఆడపడుచు మావారి కంటే నాలుగేళ్ళు పెద్దది

మేమంటే కాస్త చనువెక్కువే

తమ్ముడూ మీ యావిడకు తాజ్ చూపించకురా! బొత్తిగా తట్టుకోలేదు ఇంత భావావేశం వున్న మనిషి తాజ్ చూసి మూర్ఛపోతుందో జ్వర మంటుందో అని ఎగతాళి చేస్తూండేది

తాజ్‌మహల్ చుట్టురా వున్న విశాలమైన ప్రాకార ద్వారం దగ్గర మేము దిగేసరికే సూర్యాస్తమయం అయిపోయింది

నాకు అంత దూరంనుంచీ స్థిరంగా ఠీవిగా తెల్లగా వెన్నెల ముద్దలాగా వున్న తాజ్ ని చూస్తూంటే అద్భుతంగా ఆనందంగా అనిపించింది

ఆ ఆవరణలో బాటకి రెండువేపులా రకరకాల షాపులు

అన్నిరకాల కోణాలలో తాజ్‌మహల్ ఫోటోల అల్బమ్స్! బట్టల షాపులు మెల్లిగా నడుస్తున్నారు వాళ్ళు నాకయితే ఎప్పుడెప్పుడు తాజ్ దగ్గరకి పోయి చూద్దామా అని తొందరగావుంది

అంత మెల్లిగాతాత్సారం చేసినవాళ్ళు తాజ్ ముందుకు వచ్చేసరికి గబగబా లోపలికి బయల్దేరారు వాళ్ళను అనుసరించక నేను మాత్రం తాజ్ వెనుక వేపుకి నడచాను

వెనుక అంతా (డౌన్‌లో) విశాలంగా అవరించివున్న యమునానది

అమసక మసక వెలుతురులో సన్నగావీస్తూన్న చల్లగాలుల మధ్య పాలరాతి బెంచీల మీద కూర్చుంటే ఉన్నతంగా గంభీరంగా నిలబడిన తాజ్ ఒక ప్రక్క వేగంగా పరిగెత్తుతూన్న యమునానది ఒక ప్రక్క

ఎవేవో సందేశాలు తెలుపుకుంటూన్నాయా అనిపిస్తూంది ఇట్సే జన సమ్మర్థం లేని ఆ ప్రదేశంలో మంద మందంగా సాగుతూన్న గానం యమునలోంచి!

నది మీద ఓ చిన్న పడవ మెల్లగా సాగి పోతూంది గెడవేస్తూ పాడుతూన్నాడు అతను ఏదో దేశీయమైన పల్లెపదం

అర్థం తెలియని ఆ జానపద గీతం సంధ్య వేళ ఆ మసగ మసగ చీకట్ల మధ్య నిశ్శబ్దమైన ఆ పరిసరాలలో ఆర్తిగా బెంగగా మనసును కదలించి వేస్తూంది

యాంత్రికంగా పడుతున్నాయి అడుగులు తాజ్ ముందరికి వచ్చి లోపలికి దోవతీసే మెట్లమీద కాలు పెట్టాను మావారు వగైరాలు అప్పుడే చూడడం అయిపోయి బయటకు వచ్చేస్తున్నారు

అరె! నువ్వింకా ఇక్కడే వున్నావా? పద పద వెళ్ళి చూసిరా అని తొందర చేసింది మా ఆడబడుచు

గబగబా లోపలకు నడిచాను విశాలమైన హాలు అద్దాల కిటికీలలోంచి యమునను చూస్తూ వెన్ను జలదరించేలా చల్లగా మంచు కక్కుతున్నట్లున్న పాలరాతి గోడలను చేతితో తాకుతూ ముందుకు సాగుతూన్నాను

ఇంత మహత్తరమైన కళాసృష్టి చేయించిన షాజహాన్ నిర్దుష్టమైన ప్రేమ ఆ ఇద్దరి అనురాగ జీవితం ఇవేవి నా మనసుకు తాకడం లేదు మాటి మాటికీ ముంతాజ్ గుర్తు వస్తూంది నాకు

ఇంత అనురాగవంతమైన సౌభాగ్యవంతమైన జీవితాన్నీ ఈ ఆనందాన్నీ అనుభవించనీయక నిర్దాక్షిణ్యంగా బలవంతంగా తనను లాక్కుపోతూన్న మృత్యుదేవతకు బలి అయిపోతూన్న ముంతాజ్‌బేగం దుఃఖమూ క్షోభ బెంగ బయమూ నాకు క్షణ క్షణమూ మనసుకు తాకుతూన్నాయి

చుట్టూ వ్యాపించిన మసక చీకట్లు గోడల్లోంచి చెప్పలేనంత చల్లదనం గుండెల్లో ఏదో బెంగ

మెల్లగా పాలరాతి సమాదులను సమీపించాను

సమాదుల చుట్టూ నడుస్తూ చేతితో తాకాను

గడ్డ కట్టిన మృత్యువులా కరడుకట్టిన దుఃఖంలా మంచు ముద్దలావున్న ఆ సమాదులను ముట్టుకునేసరికి గుండె జల్లుమన్నది

గుండెలోనించి దుఃఖం తరుము కొస్తూంది గొంతు నరాలు తెగిపోయేలా నొప్పిపుడుతున్నాయి

వెక్కి వెక్కి ఏడుస్తున్నారు ఎవరో!

నాకు కొంచెం ముందర ఎవరో ముఖానికి చేయి అడ్డం పెట్టుకుని ఎడుస్తున్నారు ఆ ఏడుపు మిగిలివున్న నా శక్తిని పూర్తిగా హరించేసింది

నో! ప్లీజ్! వద్దు! ఎందుకు? ఏడవ వద్దు! ఇలా చూడు

ఏమన్నానో ఎమంటున్నానో నాకే తెలియదు నా చేయి అతని తలమీద వేశాను నా కళ్ళ వెంబడి నీళ్ళు కారిపోతూన్నాయి

అతను తల నా బుజం మిద ఆన్చాడు

మమ్మీ! మమ్మీ! మా మమ్మీ ఇలాగే పోయింది!

అతను ఏడస్తూనే వున్నాడు

నాకు వొళ్ళు తెలిసింది ఏదో సెంటు పరిమళం అతని వొంటిమీదనుంచీ! వొత్తయిన అతని జుట్టు నా చెంపలకు తగుల్తూంది నా బుజంమీద గుండెలమీద అతని కన్నీళ్ల తడి

ఎంత హఠాత్తుగా జరిగిందో అంత హఠాత్తుగా నా నుంచీ దూరం జరిగాడు అతను గబగబ నడుస్తూ వెళ్ళిపోయాడు

నన్ను నేను తమాయించుకుని ముఖమూ కళ్ళూ తుడుచుకుని బయటపడేసరికి మా వాళ్ళు విసుక్కోడానికి ప్రారంభదశలో వున్నట్లున్నారు కొంచెం పైకి వచ్చిన చంద్రుడు తాజ్‌ను వెన్నెల స్నానం చేయించడానికి సిద్ధపడుతున్నట్లున్నాడు

మా వదిన ఏదో సరసమాడబోయింది నన్నూ నా కళ్లనూ చూచి డోన్ట్ డిస్టర్బ్ హర్ మెల్లగా మందలించాడాయన

ఓదార్పుగా నా బుజంమీద చేయివేసి నా చేయి అందుకున్నారు మా వారు

నలతగా వున్న పిల్లలూ మేమూ పూర్తిగా అలసిపోయాం

మర్నాడు అరకొరగా ఆగ్రాలో ముఖ్యమైనవి చూశామనిపించి ఆ రాత్రికే ట్రైన్‌కి తయా తయారవుతున్నాం మా ఆడపడుచు బర్త బెడ్డింగ్ చుడుతున్నాడు ఆవిడ పిల్లల్ని తయారు

అధికారి ఆఖరి రోజు

అధికారి దర్పందర్జాతో
రోజూ ఆఫీసుకు వెళ్ళేవాడు
ఆఫీసు నుండి తిరిగి వచ్చేవాడు
ఆయన వెంట అనేకమంది మార్బలం
నడిచి వెళ్ళడం కద్దు
రానే వచ్చింది చివరి రోజు
అధికారి అన్నాడు
నేను రేపటి నుంచి ఆఫీసుకురాను
అదేమిటి? ఎందుకురారు
అరిచాయి అనేక గొంతులు
నా ఉద్యోగం సర్వీసు అయిపోయింది
అన్నాడు అధికారి
అని వెనుతిరిగి చూశాడు
అక్కడ ఎవరూ కానరాలేదు
అంతా నిశ్శబ్దం
ఒంటరి అయాడు మాజీ అదికారి

—ఎం ఎస్ ఎం

చేస్తూంటే నేను పెట్టెలు సర్దుతున్నాను

హడావుడిగా ఎవర్నో తీసుకుని వచ్చారు మావారు

బావా! మన తెలుగు వాళ్ళు దొరికారు ఇతనిది మన కృష్ణా జిల్లానే తాజ్‌మహల్ చూడడానికి ఫ్రెండ్స్‌తో వచ్చాడట! అవునూ నీ పేరు ఏమిటోయ్?

అబ్దుల్ రహీం అండీ

యాదాలాపంగా తలయెత్తిన నేను ఉలిక్కిపడ్డాను

మసక మసక చీకట్ల మధ్య కళ్ల నీళ్ల తడిలో నేను గుర్తించ లేదనుకున్న ముఖం అతడు స్ఫుటమైన ముక్కూ ముఖం! వొత్తైన జుట్టు దృఢమైన విగ్రహం!

చటుక్కున తల తిప్పేసుకున్నాడు అతను

ట్రైన్ ఎక్కిందాకా మావారు అతన్ని వదలి పెట్టలేదు అతను వెళ్ళాక చెప్పుకొచ్చారు మావారు

అతని తల్లి ఈ మధ్యనే పోయిందట ఆ బాధతో చదువు మానేసి ఇలా వూళ్ళమీద తిరుగుతున్నాడట!

తాజ్ చూస్తూన్నంతసేపూ చెప్పలేనంత ఏడుపువచ్చిందట అతనికి!

మమ్మీ! మమ్మీ! ఇలాగే పోయింది!

అతని కంఠం ఆ కన్నీళ్ళు ఆ జుట్టు తగిలిన స్పర్శ

నా గుండెల్లో సుళ్ళు తిరుగుతూనే వున్నాయి రూపుకట్టని ఆవేదన ఆరాటం!

మళ్ళీ అతన్ని చూడవలసిన అవసరం నాకు రాలేదు

కానీ కానీ తాజ్ ప్రస్తావన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అతను జ్ఞాపకం వచ్చేవాడు ఆ కళ్ళ నీళ్ళ తడి! ఆ గొంతులో దుఃఖం!

వయసు తిరిగి రక్తం పలచబడి పోయి ఆ

అవధి లేని ప్రతి అనుభూతికి

వుద్వేగమూ ఆవేశమూ తగ్గిపోయినా తాజ్ నన్ను వదలలేదు అనుభూతికిరాని ఆ స్మృతి నన్ను వీడి పోలేదు

★ ★ ★ ★ ★ ★

ఇదుగో సుజాతా! నేను వొచ్చేటప్పుడు స్వీటేదయినా పట్టుకొస్తాగానీ నువ్వేం అనవసరంగా హడావుడి పడకు కాస్త ఇల్లు నీట్‌గా వుంచి టీ అదీ చూడు

హడావుడి పడొద్దంటూనే ఎప్పుడూ ఏదో ఒక హడావుడి కల్పించుకోవడం మా వారి అలవాటు

టిఫిన్‌చేసి టీ డికాక్షన్ తీసిపెట్టి హాల్లో కుర్చీలో కూర్చున్నాను


ఇన్ని ఏళ్ల తర్వాత అతన్ని చూడడం నేను ఎందుకని దీన్ని సాదారణ విషయంగా తీసుకోలేకపోతున్నాను ఏమిటి నా బలహీనత?

అయిదు సంవత్సరాలు నిండని పెద్దబాబు కాన్వెంటు స్కూల్లో చేర్చిననాడు తొలి సారిగా మమ్మీ అని ఎలిస్తే అదే జలదరింపు అదే జ్ఞాపకం ఎన్నిసార్లో ఎన్ని సందర్భాల్లోనో అతను గుర్తుకు వచ్చాడు ముగ్గురు పిల్లల తల్లినయి వృద్ధాప్యపు అంచులలో వున్న ఈ మనసు అట్టడగు పొరల మాటున అతని ఆర్ద్రమైన జ్ఞాపకం తడి ఆరనేలేదు అనా?

నేను స్త్రీని గాంభీర్యమూ నిండుతనమూ మనసును దాచుకోగల శక్తీ దృఢత్వమూ వున్నదాన్ని

ఇదేమిటి ఇంత సెంటిమెంటల్‌గా అయి పోతున్నాను? అని నవ్వు వచ్చింది

రావోయ్ ఇదే మా గృహరాజము 30 ఏళ్ళు సర్వీస్ చేసి మిగుల్చుకున్న ఆస్తి ఇదుగో మా శ్రీమతి వ్పు



గుర్తుపట్టలేవులే అప్పటికీ ఇప్పటికీ బాగా మారిపోయిందిలే

కుర్చీలోంచి లేస్తూనే తలయెత్తి చూచాను అతను రహీం కళ్ళు నా వైపే పరిశీలనగా చూస్తున్నాయి నా కనులలో ఏదో వెతుక్కుంటున్నట్లు

అది నా బావం మాత్రమేనేమో చప్పున తల తిప్పేసుకున్నాను

ఏం మారిపోలేదండీ అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగానే ఉన్నారు అన్నాడు

ఏవిటీ ఒక్కలానే వుందా సన్నగా చలాకీగా ఎంత స్మార్ట్‌గా వుండేదని

బావుందండీ వయసు పెరుగుతుంటే పెద్దతనం వచ్చేసెయ్యదేవిటండీ నన్ను చూడండీ తలంతా తెల్లగా నెరిసిపోయి మా మనవళ్లకి పొద్దస్తమానం ఒకటే ఆట నల్ల వెంట్రుకలు నా తలలో ఎన్నున్నాయో లెక్క పెడతామని ఎమండీ మీరు చెప్పండి నేను గుర్తు పట్టలేనంతగా మారిపోలేదా?

రహీం ఫ్రీగా మాట్లాడుతున్నాడు మా వారూ కబుర్లకి పెట్టింది పేరు

రిటైరైనా సోమరిగా వుండకుండా కంట్రాక్టులు చేయడం చాల మంచి పని చేస్తున్నారు అన్నాడు రహీం మా ఎల్లలెవర్నీ (ఇక్కడ లేకపోవడం వల్ల) చూడలేకపోయినందుకు చాలా నొచ్చుకున్నాడు

నా ఆరోగ్యం పిల్లల చదువులూ ఇళ్ళు కట్టడంలో లావాదేవీలూ ఒకటేమిటి? వాళ్ళిద్దరి మధ్య సంబాషణ అనర్గళంగా దొర్లిపోతూంది

నడవాలో కుర్చీ వేసుకుని వాళ్ల మాటలు వింటూ కూర్చున్నాను

తెల్లగా పండిపోయిన తల బారీ అయిన విగ్రహం కొట్ట వచ్చినట్లు కనబడే ముక్కు రహీం మా వారికంటే 5 6 ఏళ్ళు పెద్దవాడిలా కనపడుతున్నాడు బెదురుగా బయంగా తలవంచుకుని తిరిగిన ఆనాటి రహీంకి ఇతనికీ ఎంత తేడా అనుకున్నాను

టిఫినూ కాఫీ అయిపోయినా వాళ్ల కబుర్లు పూర్తి కాలేదు టెలిఫోన్ మ్రోగి వాళ్లను కాస్త నిలబెట్టింది కబుర్లనుంచీ మావారు ఫోన్ అందు కునిమాట్లాడారు

ఎ ఇ ఫోన్ చేశాడు మళ్ళీ వెళ్ళిపోతాడట జస్ట్ ఒక్క పావు గంటలో వచ్చేస్తాను రహీం ఏమను కోకు

మరి నేను వెళ్లొస్తానండీ లేచి నిలబడ్డాడు అతను

నో నో ఇవాళ సాయంత్రందాకా నిన్ను వదిలిపెట్టేది లేదు చాలా త్వరగా వచ్చేస్తాను సుజాతా! రహీంని వెళ్లనివ్వకు చాలా మాట్లాడాలి త్వరగా వచ్చేస్తాలే చెబుతూనే వాకిలి దాటారు

చాలా మంచివారండీ నిన్న అయితే నన్ను

కదంనీయ్యల్లేధనుకోండి' అన్నాడు రహీం

కొన్ని క్షణాల నిశ్శబ్దం తర్వాత నన్ను గుర్తుపట్టారాండీ? అడిగాడు రహీం ఆ ప్రశ్న సూటిగా దూసుకు వచ్చిన ప్రశ్న నేను బయపడినదెందుకో ఇప్పుడర్థమయింది నాకు

ఎవరో పిచ్చివాడు అనుకుని నవ్వుకొని వుంటారు కదండీ

చప్పున తలఎత్తి లేదు లేదు నేనలా ఎప్పుడూ అనుకోలేదు అన్నాను అదే చూపు జాలిగా దీనంగా చూస్తున్న అతని కళ్లల్లోకి నా మాటలకు మెరిసిన ఆశ ఆనందం

నిజంగా మీరు నిజంగానే అంటున్నారా ఆ మాట? కొన్ని వందలసార్లు నాలో నేను అడిగి చూచుకున్నాను ఎన్నిసార్లో మిమ్మల్ని చూడాలని మళ్లీ బయుం బెదురు ఆవేళ ఆ దు ఖంలో

రహీం లేచి కిటికీ దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు

'అమ్మా నాన్నా ఎంతో అన్యోన్యంగా వుండేవాళ్లు నా కంటికి ఈ ప్రపంచం అంతటిలో నూ ప్రేమమూర్తులు అనిపించేది మమ్మీకి నేనంటే అంతులేని ప్రేమ కష్టం అంటే బాధ అంటే ఎలా వుంటుందో తెలీకుండా పెరిగాను కొద్ది రోజుల జబ్బుతో మమ్మీ పోయింది నాకు లోకమే శూన్యమైపోయింది డాడీ ఎన్ని చెప్పినా ఏం చేసినా నేను తేరుకోలేకపోయాను డబ్బు చేతిలో పెట్టి బలవంతాన స్నేహితులతో టూర్‌కి పంపారు

ఎందుకో తాజ్ చూచేసరికి ఆపుకోలేని ఏడుపు వచ్చింది

మమ్మీ పోయాక ఆడవాళ్లు అంత దగ్గరగా ఆదరించినవాళ్లు ఎవ్వరూ లేరు మాకు ఆ వేళ మీ ఓదార్పుకు

సారీ' మిమ్మల్ని సిగ్గుపడేట్లు చేయాలని చెప్పడంలేదు

ఆ తర్వాత ఇల్లూ చదువూ పట్టకుండా ఎక్కడ పడితే అక్కడ తిరిగాను డాడీ కనీసం నాకు పెళ్లయినా చేస్తే కుదుటపడతానని ప్రయత్నించాడు నేను ఒప్పుకోలేదు

ఎందుకని నా మనస్సు మమ్మీ చుట్టూ అల్లుకున్న మనసు మీ ఓదార్పు ఆ ఆప్యాయత అదొక అనుభూతిగా ఆడవాళ్లంతా మమ్మీలా మీలా అనిపించేది అదొక అయోమయం అవస్థ

డాడీ నన్ను ఎంతవరకు అర్థం చేసుకున్నారో తెలీదు కానీ మా దగ్గరి బంధువుల అమ్మాయి కొంచెం లేమిలో వున్న కుటుంబంలో నుంచీ తీసుకువచ్చాడు

రహీం చెప్పడం ఆపి నా వైపు చూశాడు నేను తలవంచుకొని కుర్చీ టేబిల్ ముందుకు జరుపుతూ ఉండిపోయాను

రహీం మళ్లీ చెప్పడం ప్రారంభించాడు.

మమ్మీ తర్వాత మీ తర్వాత నన్ను నా తల మీద చెయ్యి వేసి ఆదరించి ఊరడించింది ఆ అమ్మాయే ఆత్మకూ అమ్మాయికీ తేడా తెలిపి నన్ను మనిషిని

న్యూటన్స్ లా

చెట్టు కాయ

భూమ్మీద పడ్డందుకు

భూమికి

ఆకర్షణ శక్తుందని చెప్పిన న్యూటన్

ఆ కాయ దర

భూమి నుండి

ఆకాశంలో కెళ్తుందని వూహిస్తే

అంత తొందరగా ఆ సిద్ధాంతాన్ని

ఆయన మనకిచ్చేవాడు కాదేమో!

– అడిగోపుల వెంకటరత్నమ్

అవధి లేని ప్రతి అనుభూతికి

చేసి లోకజ్ఞానం నేర్పింది ఆ అమ్మాయే నాకు భార్య కూడా అయింది లోకాన్నీ నన్నూ అర్థం చేసుకునేకొద్దీ తప్పు పని చేశాననే బిడియమూ సిగ్గూ స్థానే మిమ్మల్ని ఒక్కసారి చూడాలనే కోరిక మరీ మరీ అనిపించేది కానీ కానీ కనీసం మీరు నాకంటే 10 ఏళ్లు పెద్ద అయినా బాగుండిపోయేది బావాల కంటే బావ్యాభ్యంతరాలనే లోకం ఎక్కువ గుర్తిస్తుందని తెలిసే కొద్దీ ఆ కోరి కను అణిచేసుకుంటూ వచ్చాను

రహీం తాపీగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు

ఇప్పుడు హాయిగా ఉందండీ తలంతా నెరిసిపోయింది కదా? వయసుకు మించి ముసలివాడినయి పోయాను రెండు సార్లు తాతను గూడా అయాను అందుకే మీ ముందర ఇంత ధైర్యంగా మాట్లాడగలుగుతున్నాను ఆనాడు ఒక్కసారి మిమ్మల్ని చూడాలనీ మీతో మాట్లాడాలనీ ఎన్నెన్నో అనుకునీ మీరుండే హొటల్ వెతికి మీవారితో పరిచయం చేసుకున్నాను కాని తలయెత్తి మిమ్మల్ని చూడడానికే నాకు ధైర్యం చాలలేదు

'ఇప్పుడు చూశారా' ఏదో ఒక రోజున ఇలా మీ ముందు నిలబడి ఇదంతా చెప్పగలుగుతానని నేను అనుకోలేదు జీవితంలో ఇంకొక్క కోరిక మిగిలి పోయింది

మీరేమీ అనుకోకపోతే –

కంగారుగా రహీం వంక చూశాను

అతని కళ్లు నిర్మలంగా స్వచ్ఛంగా సూటిగా నా వంకే చూస్తున్నాయి ఆ ముఖంలో కళ్లలో మనిషిలో ఎక్కడా తొట్రుపాటు భయమూ సంకోచం గానీ లేవు నా జవాబు కోసం ఎదురు చూస్తున్న అతనికి చెప్పండి అని మాత్రం అనగలిగాను

మీ కభ్యంతరం లేకపోతే ఒక్కసారి మీ పాదాలు పట్టుకుని నమస్కారం చేస్తాను మేడమ్'

నా కళ్ల వెంబడి గిర్రున నీళ్లు తిరిగినయ్

నేను చేయలేనిది అతను చేశాడు నేను చెప్పలేనిది అతను చెప్పగలుగుతున్నాడు అవది లేని ఒక అనుభూతిని అనుభవంలోకి తెచ్చుకుని చెదరగొట్టుకోకుండా ఒక బావంగా రూపు కట్టుకుని పదిలపరచుకన్నాడు

దీంట్లో నేనూ రహీంల ప్రస్తావన కనబడడంలేదు అతను రూపు కట్టుకుని పదిలపరచుకున్న ఒక ఆర్ద్ర బావానికి ఈ పాదాభివందనం ఒక బాహ్యమైన తృప్తి కాబోలు

నా కంటే రెండు అడుగుల ఎత్తున వున్న రహీం బారిగా గంబీరంగా కనపడే రహీం వంగి రెండు చేతులతో నా పాదాలు ముట్టుకుని నమస్కారం చేశాడు

నేను కళ్లు తుడుచుకున్నాను

ఇవాళ నాకు చాలా సంతోషంగా వుంది మేడమ్ ఎన్నాళ్ల నుంచో నా మనసులో వున్న కోరిక ఇది

మేడమ్ అనకు రహీం బొత్తిగా బాగాలేదు నాకు అన్నాను

రహీం కళ్లలో నీటి పొర.

నాకు మమ్మీ అనే అనాలనున్నా బొత్తిగా బాగుండదు కదండీ చూడండీ మీకంటే నేనెంత పొడుగ్గావున్నానో? అన్నాడు రహీం

మీ మహమ్మదీయులంతా బాగా దృఢంగా ఉంటారు కదా రహీం? అడిగాను

మా అబ్బాయి వుంటాడు పొట్టి, అన్నట్టు మా బీబీకి మిమ్మల్ని చూపించాలండీ ఓసారి

ఈ ఏరియాలో వున్నావంటే మా వారు నిన్ను ఓ పట్టాన వదిలిపెట్టరులే' అన్నాను నవ్వుతూ

రహీం టైమ్ చూసుకున్నాడు అబ్బో చాలా సేపయిపోయిందండి ఇంకా ఆయన రాలేదు

వస్తూనే వుంటారులే ఈ పాటికి, నువ్వున్నావని త్వర త్వరగానే తెముల్చుకుని వస్తారు ఇంకోసారి టీ తెస్తాను 'ఉండు' అంటూ వంట గదిలో పలకి వచ్చాను

రహీం టేబిల్ మీది టేప్ రికార్డు ఆన్ చేసినట్టున్నాడు. 'అవధి లేని ప్రతి అనుభూతికి ఆత్మానందమే పరమార్థం' అంటూ పాట వినపడుతూంది.

దాన్ని అధిగమిస్తూ గలగలమంటూ వాకిట్లోంచి మా వారి సైకిల్ బెల్ మ్రోత వినవచ్చింది త్వర త్వరగా టీ కలపడం ప్రారంభించాను


హైదరాబాద్ నోట్‌బుక్

విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్ కార్యాలయ ప్రారంభోత్సవం :–

విశాలాంధ్ర ప్రచురణాలయం 1953 జనవరి 1వ తేదీన ప్రారంభమై ఇంతవరకు 1120 గ్రంథాలు ప్రచురించింది ఆంధ్రప్రదేశ్‌లో ఇంత సంఖ్యలో తెలుగులో ప్రచురణలు అందించిన సంస్థ ఇదే ననవచ్చు ఈ సంస్థ తన సోషలిస్టు సిద్ధాంత గ్రంథాలే కాక గురజాడ, కందుకూరి కొడవటిగంటి, గిడుగు రాహుల్ సాంకృత్యాయన్, ప్రేమ్‌చంద్ కిషన్‌చందర్, టాల్‌స్టాయ్ హోవర్‌షాస్ట్ మున్నగు వారి గ్రంథాలను కూడ ప్రచురించింది ఏటా కనీసం 60 గ్రంథాలు ప్రచురించాలని సంకల్పించింది ఇంతవరకు ఈ సంస్థ ప్రధాన కార్యాలయం విజయవాడలో వుంది ఈ కార్యాలయం రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాదు నుంచి ఇతోధికంగా సేవ చేయగలదనే విశ్వాసంతో హైదరాబాదుకు తరలించారు హైదరాబాద్ కార్యాలయ ప్రారంభోత్సవం మే నెల 27 సాయంకాలం బ్యాంక్ స్ట్రీట్ లోని స్వకీయ బవనంలో జరిగింది ప్రారంభోత్సవానికి విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు శ్రీ తమ్మారెడ్డి సత్య నారాయణ అధ్యక్షత వహించారు కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి కార్యదర్శి శ్రీ ఎన్ గిరిప్రసాద్ ప్రారంభోత్సవం జరిపారు 1985 విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ నవలల పోటీలో బహుమతి పొందిన వెలుగు రేకలు (శ్రీ సుద్దాల అశోక్) పుడమితల్లికి పురిటి నొప్పులు (శ్రీ సింహప్రసాద్), సర్దార్ బగత్‌సింగ్ (బుర్రకథ–మురారి) లకు తెలుగు విజ్ఞాన పీఠం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ తూమాటి దొణప్ప ఆవిష్కరించి, బహుమతి ప్రదానం చేశారు ఫాసిజంపై విజయం 40 వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ వెలువరించిన ఆయుధ స్తంబన, అనుకూల మెవ్వరు? ప్రతికూల మెవ్వరు? అణుయుగంలో శాంతి నిబందనల ఆవశ్యకత, మనిషి సంక్షేమం కోసం, భూమి మీద శాంతి కోసం – అనే గ్రంథాలను కమ్యూనిజం పత్రిక సంపాదకులు శ్రీ ఏడ్పుగంటి నాగేశ్వరరావు ఆవిష్కరించారు ఆంధ్రప్రదేశ్ యూత్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ కుమారి వాసిరెడ్డి సీతాదేవి, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధునిక బాషల శాఖ అధ్యక్షులు ఆచార్య డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి, తెలుగు అకాడెమీ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ అక్కిరాజు రమాపతిరావు సంస్థ చేసిన సేవను ప్రశంసించి కొన్ని సూచనలు చేశారు విశాలాంధ్ర ప్రచురణాలయం మేనేజర్ శ్రీ విశ్వేశ్వరరావు అబినందనలతో ప్రారంభోత్సవ సమావేశం ముగిసింది

భారత కళా పరిషత్తు కళాప్రదర్శనం :–

భారత కళా పరిషత్తు శ్రీ సిహెచ్ వి పి మూర్తిరాజు అధ్యక్షతన 1965 ఏప్రిల్ 3వ తేదీన అవతరించి రెండు దశాబ్దాలుగా లలితకళల, హస్తకళల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది మే 21 వ తేదీ నుంచి వారం పాటు 12వ అఖిలభారత కళాప్రదర్శనం కళాభవన్‌లో నిర్వహించింది ఈ పరిషత్తు ఇదివరకు భారతదేశంలోని ప్రధాన నగరాలు కలకత్తా, న్యూఢిల్లీ, బెంగుళూరు, మద్రాసులలో కళాప్రదర్శనలు నిర్వహించింది ఉత్తమోత్తమ కళాఖండానికి బంగారు పతకం, 500 రూపాయల నగదు బహుమతి, ఒక వెండి పతకం, ఆరు 300 రూపాయల నగదు బహుమతులు ఇచ్చేది ఈసారి బహుమతి నిర్ణేతలు బంగారు, వెండి పతకాలు ఆపి, పదకొండు 500 రూపాయలు నగదు బహుమతులు ఇవ్వాలని తీర్మానించారు ఈ సంవత్సరం 210 కళా ఖండాలు పోటీకి వచ్చాయి 94 ప్రదర్శనానికి ఎంపికయ్యాయి పలువురు సుప్రసిద్ధ కళాకారులు – జాతీయ అవార్డు గ్రహీతలు కూడ ఈ పోటీలో పాల్గొన్నారు శ్రీయుతులు పుష్పబేతాళ (న్యూఢిల్లీ), తామన్‌కర్ అశోక్ బల్‌వంత్ (పుణే), దినేకర్ ఎస్ ధోష్పే (పుణే), అప్పాసాహెబ్ దశ్‌రథ్‌కాబే (నాగపూర్), ఫుండ్లిక్ ఎస్ దేశ్‌ముఖ్ (నాగపూర్), పి. శ్రీనివాసన్ (మద్రాసు), శ్రీహరి భోలేకర్, జి రంగారెడ్డి, సుభాష్‌బాబు, సి నారప్ప, బి పద్మారెడ్డి (హైదరాబాద్)– ఈ పదకొండుగురు 500 రూపాయలు నగదు బహుమతి పొందారు 17 మంది ప్రశంసా పత్రాలు పొందారు తామన్ కర్ అశోక్ బల్వంత్ (పుణే) రచించిన కెల్లా– ఇ– షివనేరి (శివనేరి జాతర) అనే కళాఖండాన్ని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ శంకర్‌దయాళ్ శర్మ కొన్నారు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ శంకర్‌దయాళ్ శర్మ కళా ప్రదర్శనాన్ని ప్రారంభిస్తూ, కళాకారులు భారతీయ సంస్కృతికి మూలాధారాలైన రామాయణ భారత భాగవతాల చిత్రాలను రచించాలని సూచించారు అధ్యక్షత వహించిన శ్రీ మూర్తిరాజు రామాయణ భారతాల చిత్రాలు రచించిన వారికి వేయి రూపాయల బహుమతి ఇస్తానని ప్రకటించారు తెలుగు విజ్ఞాన పీఠం స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ తూమాటి దొణప్ప ప్రసంగిస్తూ ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తుందని అన్నారు రాష్ట్ర లలితకళా అకాడెమీ అధ్యక్షులు శ్రీ పి. టి రెడ్డి తమ ప్రసంగంలో ప్రభుత్వం లలితకళలకు ఇతోధిక ఆర్థిక సహాయం చేయాలని కోరారు భారత కళా పరిషత్తు కార్యదర్శి, విఖ్యాత చిత్రకారుడు, కేంద్ర లలితకళా అకాడెమీ సభ్యుడు శ్రీ పి ఆర్ రాజు ధన్యవాదాలు చెప్పారు



ఉపశ్రుతి :–

చూచారా, మిత్రపక్షాలలో ఒక్కటైన కమ్యూనిష్టు పార్టీ ఎంతగా పాలకపక్షమైన తెలుగుదేశం పార్టీతో మైత్రి పాటిస్తున్నదో! – అన్నారు మే 27న విశాలాంధ్ర ప్రచురణాలయ కార్యాలయ ప్రారంభోత్సవంలో మిత్రులు డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ ఎలా? – అనడిగాను. ఉపన్యాస వేదిక భూమిక చూడండి అక్కడ కట్టిన బ్యానరేమో ఎర్ర గుడ్డ, కమ్యూనిస్టుల అసలు రంగు. దాని మీది అక్షరాలేమో పసుపు పచ్చ తెలుగుదేశం రంగు ఇంతకన్నా తార్కాణం ఏమి కావాలి గాఢతర మైత్రికి?– అన్నారు ఆయన

–తిరుమల రామచంద్ర

Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3, Editor S Radhakrishna, Phones P B X 61247, 61248 & 75667

Regd. No. H/VJ-41 ANDHRA SACHITRA VARA PATRIKA
28, జూన్-4 జూలై, '85

